అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 25-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 176
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50

కేరళ రాష్ట్రం పేరు కేరళం
మారుస్తూ అసెంబ్లీ తీర్మానానికి ఆమోదం



తిరువనంతపురం : కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చేందుకు, ఈ పేరు మార్పుకు అవసరమైన రాజ్యాంగ సవరణకు ప్రతిపాదిస్తూ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానాన్ని సోమవారం ఆమోదించింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఫస్ట్ షెడ్యూల్‌లో ఈ పేరు మార్పును అమల్లోకి తెచ్చేందుకు భారత రాజ్యాంగంలోని 3వ అధికరణను అమలు ...13లో

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు
రాష్ట్రంలో ఒకే సారి 42 మందికి స్థానచలనం

- ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా
- పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్
- ఐదుగురు ఐపీఎస్‌లకూ ట్రాన్స్‌ఫర్
- ఐజీ రంగనాథ్‌తోపాటు మరో నలుగురు అధికారుల బదిలీ : ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మరోసారి భారీగా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఎన్నికలకోడ్ ముగిసిన తర్వాత రెండో సారి పెద్ద ఎత్తున బదిలీలు చేపట్టింది. ఈ నెల 15న 20 జిల్లాల కలెక్టర్లను బదిలీ చేసి, వారి స్థానంలో కొత్త కలెక్టర్లను నియమించింది. తాజాగా ఒకేసారి 42 మంది ఐఏఎస్‌లతో పాటు ఐదుగురు ఐపీఎస్‌లకు స్థానచలనం కలిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియాకు అవకాశం కల్పించగా, పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌ను నియమించింది. చేనేత, ...6లో

ఇండ్లు మంజూరు చేయండి
స్మార్ట్‌సిటీ మిషన్ కాలపరిమితిని పొడిగించాలి



కేంద్రమంత్రి ఖట్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- 2,450 ఎకరాల రక్షణ శాఖ భూములు బదలాయించండి
- వరంగల్ సైనిక స్కూల్ అనుమతులు పునరుద్ధరించండి : కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, రాజ్‌నాథ్ సింగ్‌లకు సీఎం రేవంత్ రెడ్డి వినతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2024-25 ఆర్థిక సంవత్సరంలో బీఎల్‌సీ మోడల్‌లో తెలంగాణకు 2.70 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ...13లో

తొలిరోజే గరంగరం

లోక్‌సభలో ప్రధాని, కేంద్రవిద్యాశాఖమంత్రులకు ప్రతిపక్షాల నిరసన సెగ ... వెలుపల రాజ్యాంగ ప్రతులతో ఆందోళన

18వ లోక్‌సభ సమావేశాలు తొలిరోజు నుంచే వేడెక్కాయి. ఇప్పటివరకు బీజేపీ ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా ఉండేది. కానీ ఈసారి బీజేపీ సొంత మెజారిటీ కోల్పోయి, పదేండ్ల తర్వాత సంకీర్ణ సర్కార్ కొలువయ్యాక.. సోమవారం లోక్‌సభలో ఇండియా ఫోరం ఎంపీలు జోరు పెంచారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో మోడీ ప్రభుత్వం చెలగాటమాడుతున్న నీట్, నెట్, ఇతర పోటీ పరీక్షల నిర్వహణలో విఫలమైన తీరును ఎండగట్టారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని నిరసనలు తెలిపారు. నీట్ అంశాన్ని బీజేపీ సర్కార్‌పై ప్రతిపక్షాలు ఆయుధంగా ఎక్కుపెట్టాయి.



పార్లమెంట్ వెలుపల రాజ్యాంగ పత్రాలతో ఆందోళన చేస్తున్న సోనియా గాంధీ, ప్రతిపక్షాల ఎంపీలు...

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

18వ లోక్‌సభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సోమవారం లోక్‌సభలో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ కొత్తగా ఎన్నికైన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మెహతాబ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. మెహతాబ్ తొలుత ప్రధాని మోడీతో ప్రమాణ స్వీకారం చేయించగా, తరువాత ప్రొటెం స్పీకర్ల ప్యానెల్ సభ్యులు రాధామోహన్ సింగ్, ఫగ్గన్ సింగ్ కులస్తేతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కేంద్ర మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తరువాత అక్షర క్రమంలో రాష్ట్రాలకు చెందిన సభ్యులతో ప్రమాణ స్వీకారం కొనసాగింది. సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయగా, మంగళవారం తెలంగాణ ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు.

కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ మూడో సారి అధికారం చేపట్టిన తరువాత సోమవారం ప్రారంభమైన తొలి పార్లమెంటు సమావేశాల్లోనే నీట్ నిర్వహణలో బీజేపీ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష ఇండియా ఫోరం నేతలు పార్లమెంటు ...3లో


నీట్ నిరసన మధ్యే ప్రమాణం



ప్రధాని మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లకు నిరసన సెగ తగిలింది. సోమవారం లోక్‌సభలో ప్రధాని మోడీ ఎంపీగా ప్రమాణ చేసేందుకు సీటులో నుంచి వెళ్తుండగా ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లో లేచి, రాజ్యాంగ ప్రతులను చూపించి నిరసన తెలిపారు. అలాగే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎంపీగా ప్రమాణ చేసేందుకు సీటులో నుంచి వెళ్తుండగా ప్రతిపక్ష ఎంపీలు నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో సభను హోరెత్తించారు. 'నీట్.. నీట్.. నీట్..' అంటూ నినదించారు. ప్రతిపక్షాల నినాదాల మధ్యే ధర్మేంద్ర ప్రధాన్ ప్రమాణ స్వీకారాన్ని పూర్తి చేశారు.

ప్రజాస్వామ్యంపై ఎమర్జెన్సీ మచ్చ : ప్రధాని మోడీ

సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని మోడీ మీడియాతో మాట్లాడుతూ దేశానికి మూడోసారి సేవచేసే భాగ్యాన్ని కల్పించినందుకు ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఎమర్జెన్సీ ద్వారా ప్రజాస్వామ్యంపై పడిన మచ్చకు రేపటితో



50 ఏండ్లు అని ప్రధాని మోడీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. 50 ఏండ్ల కిందట జరిగిన తప్పు మరెవరూ చేయకూడదన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. కొత్త పార్లమెంట్ భవనంలో 18వ లోక్‌సభ సమావేశమవుతుందని చెప్పారు. 'ప్రపంచంలో అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ నిర్వహించాం. 65 కోట్ల మంది ...3లో

ఇంకెన్నాళ్లు అదే పాట.. ప్రధానికి స్ట్రాంగ్ కౌంటర్


ఎమర్జెన్సీపై పార్లమెంటులో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇంకెన్నాళ్లు అదే పాత పాట పాడుతారంటూ చురకలంటించారు. ఇప్పటికే ఆయన ఈ మాట వందసార్లు చెప్పి ఉంటారని.. ఇంకెన్నాళ్లు అలాంటి మాటలతో ప్రజలను మభ్యపెడుతూ అధికారంలో



కొనసాగుతారు. నీట్ ఆందోళనలపై గానీ, వెస్ట్ బెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదంపై గానీ, మణిపూర్ అల్లర్లపై గానీ మోడీ స్పందిస్తారని చూస్తుంటే.. ఆ విషయాలపై ఆయన మౌనం పాటిస్తూ వస్తున్నారని దుయ్యబట్టారు.

సుప్రీంకు బీఆర్ఎస్?
కాంగ్రెస్ అలర్ట్!

- ఎమ్మెల్యేల అనర్హత వేటు అంశంపై గులాబీ బాస్ కసరత్తు
- ఆలోపే మిగతా ఎమ్మెల్యేలనూ చేర్చుకోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్
- ఈనెల 27న హైకోర్టులో దానం అనర్హత కేసు విచారణ
- రంజుగా మారుతున్న రాష్ట్ర రాజకీయాలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం కోర్టుకు వెళ్లేందుకు బీఆర్ఎస్ అధిష్టానం కసరత్తులు చేస్తున్నది. ఆ పార్టీ సుప్రీం తలుపులు తట్టేకంటే ముందే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను హస్తం గూటికి చేర్చుకోవడంపై కాంగ్రెస్ అధిష్టానం ఫోకస్ పెట్టింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల త్రయం ఎత్తులకు పైఎత్తులు వేస్తూ మీరునడిచిన బాటలోనే మేము అన్నట్టుగా బీఆర్ఎస్ ఎల్పీని విలీనం చేసుకోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్ పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. దానంపై అనర్హత వేటు పడకముందే ఈ ప్రక్రియనంతా పూర్తిచేయాలనే ఆలోచనతో కాంగ్రెస్ అగ్రనేతలు కూడా రంగంలోకి దిగారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు గాలం వేస్తూ గులాబీబాస్‌కు షాకులమీద షాకులిస్తూ పోతున్నారు. దీంతో రాష్ట్ర రాజకీయాలు రంజుగా మారాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో చావుదెబ్బతిన్న బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికలకొచ్చేసరికి అసలు ఆ పార్టీలో ఎమ్మెల్యేలుంటారా? వీడుతారా? అన్న చర్చ తీవ్రస్థాయికి చేరుకున్నది. అదికాస్తా నిజమవుతూ ఒక్కో ఎమ్మెల్యే కారుదిగి చేయిపార్టీ చెంతకు చేరుతున్నారు. ఒక్కోరోజు ఒక్కో ఎమ్మెల్యే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు షాకులమీద షాకులు ఇస్తూపోతున్నారు. పెద్దదిక్కుగా ఉన్న ...13లో



జీవన్‌రెడ్డిని బుజ్జగిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు. తదితరులు...

అధిష్టానంపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అలక
కాంగ్రెస్‌లో చిచ్చురేపిన ఎమ్మెల్యే సంజయ్ చేరిక

- ప్రత్యర్థి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరికపై తీవ్ర అసంతృప్తి
- కనీసం సమాచారం ఇవ్వరా? అంటూ ఆగ్రహం
- బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారంటూ ప్రచారం
- జీవన్‌రెడ్డిని సముదాయించేందుకు వెళ్లిన మంత్రి శ్రీధర్‌బాబు, సీనియర్ నేతలు
- నిరసన తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు
- మరోవైపు సంజయ్‌పై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దిష్టిబొమ్మలు దహనం

నవతెలంగాణ- కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / జగిత్యాల

జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడం స్థానిక కాంగ్రెస్‌లో చిచ్చురేపింది. స్థానిక 'హస్తం' పార్టీ శ్రేణులు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జీర్ణించుకోలేకపోయారు. పార్టీ సీనియర్ నేతనైన తనకు కనీసం తన ప్రత్యర్థిని పార్టీలో చేర్చుకునే విషయం కూడా చెప్పరా? అంటూ ఆగ్రహానికి గురయ్యారు. అలకబూనిన ఆయన పార్టీకి రాజీనామా చేయడానికి సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఏకంగా బీజేపీలో చేరుతున్నారనే ప్రచారం వరకూ వెళ్లింది. దీంతో పార్టీ సీనియర్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు సహా ప్రభుత్వ విప్‌లు లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్ ఆయన ఇంటికి వెళ్లి బుజ్జగించే ప్రయత్నం చేశారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడనున్నట్టు తెలిసింది. ఏదేమైనా తన 40ఏండ్ల రాజకీయ ప్రస్థానంలో వన్‌మ్యాన్ ఆర్మీగా ఉన్న జీవన్‌రెడ్డి ఎపిసోడ్ ఎటు ...5లో

వైద్య ఆరోగ్య వర్సిటీకి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణ..

- ఏపీ సీఎం చంద్రబాబు సంతకాలు చేసిన ఐదుకు ఏపీ క్యాబినెట్ ఓకే

వివరాలు 13లో



మాట్లాడుతున్న సీఐటీయూ నేత వంగూరు రాములు

వీఆర్ఏల గోడు పట్టదా?
సచివాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోరా?

- వారసులకు ఉద్యోగాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలి
- లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తాం : వీఆర్ఏ జేఏసీ కో-కన్వీనర్ వంగూరు రాములు
- సీసీఎల్ఏ ఎదుట వీఆర్ఏల ధర్నా, వినతిపత్రం అందజేత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వీఆర్ఏల గోడు పాలకులకు పట్టదా? అధికారులు, మంత్రులు, సచివాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోరా? ఇంకెన్నేండ్లు తిరగాలి? ఇందిరమ్మ రాజ్యంలోనూ పరిష్కారం చూపెట్టరా? ఇదెక్కడి న్యాయం? అంటూ వీఆర్ఏ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ కో-కన్వీనర్ వంగూరు రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు, ఆయా శాఖల్లో పనిచేస్తున్న వీఆర్ఏలకు ఆప్షన్ ఇచ్చి రెవెన్యూ శాఖలోనే కొనసాగింపు, సొంత జిల్లాలకు బదిలీ, తదితర పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ...13లో

సమస్యల వలయంలో జూడాలు
ఉపకారవేతనాల నుంచి వసతిగృహాల వరకూ..



- ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు అందరికీ గోడు వెళ్లబోత
- స్పందన లేకపోవడంతో నిరవధిక సమ్మెలోకి వెళ్లిన జూనియర్ వైద్యులు
- ఉస్మానియా, గాంధీ సహా అన్ని బోధనాస్పత్రుల వద్ద ఆందోళన
- మంత్రి దామోదరతో చర్చలు విఫలం
- సమ్మె కొనసాగిస్తామని తెలిపిన జూడాలు

వివరాలు 5లో

పార్లమెంట్‌కు ట్రాక్టర్‌పై సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతు నేత, సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్ పార్లమెంట్‌కు ట్రాక్టర్‌పై వెళ్లారు. సోమవారం పార్లమెంట్ సమావేశాలు ...13లో

ఒడిశాలో సింగరేణి సీఎమ్‌డీ



- 'నైనీ' ఉత్పత్తి కోసం కార్యాచరణ
- అటవీ భూమి కోసం అధికారులతో చర్చలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాంనాయక్ సోమవారం ఒడిశా రాష్ట్రానికి వెళ్లారు. నైనీ ప్రాజెక్ట్ అనుమతుల కోసం అక్కడి ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఆయన విజ్ఞప్తికి ఒడిశా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా సానుకూలంగా స్పందించారు. ఆ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఒడిశా రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సౌకర్యాల కల్పనా సంస్థ (ఇడ్కో) చైర్మెన్ హేమంత్‌శర్మను కూడా కలిశారు. సింగరేణి సంస్థ ఒడిశా రాష్ట్రంలో చేపట్టిన నైనీ బొగ్గు గని నుంచి ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం చివరి నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలని కృతనిశ్చయంతో ఉంది. అలాగే నైనీ సమీపంలో నిర్మించతలపెట్టిన థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలం గుర్తింపు కోసం కూడా సీఎమ్‌డీ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో భేటీ అయ్యి నైనీ బ్లాక్‌కు సంబంధించి రెండో దశ అటవీ అనుమతులపై చర్చించారు. అక్కడి రాష్ట్ర ప్రభుత్వం కోరినట్టు వన్య ప్రాణి నిర్వహణ ప్రణాళికలో భాగంగా రూ.39 కోట్లను డిపాజిట్ చేశామనీ, దీంతో ఇప్పటి వరకు రూ.180 కోట్లను పూర్తిగా ప్రభుత్వానికి చెల్లించినట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టు ప్రారంభం కోసం కావాల్సిన 783 హెక్టార్ల అటవీ భూమిని సింగరేణికి బదలాయించాలని కోరారు. సింగరేణి ఆధ్వర్యంలో నైనీ ప్రాజెక్టుకు 50 కిలోమీటర్ల దూరంలో 1,600 (2ఞ800) మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.దీనికోసం 800 ఎకరాల స్థలం అవసరం ఉంటుందన్నారు. సంబంధిత భూములకు సంబంధించిన ప్రభుత్వం నుంచి సహకారం కావాలని కోరారు. అనంతరం ఇడ్కో సీజీఎం(ల్యాండ్) సరోజ్ కుమార్ సేథీతో మాట్లాడారు. అక్కడి నుంచి ఒడిశా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ సుశాంత్ నందాను కలిసి అటవీ భూమి బదలాయింపు కోరారు.

ఈ సందర్భంగా సీఎమ్‌డీ బలరాం మాట్లాడుతూ అటవీ భూమి బదలాయింపు జరిగితే మూడు నెలల్లో బొగ్గు ఉత్పత్తి మొదలవుతుందని తెలిపారు. ఈ పర్యటనలో ఆయన వెంట నైనీ జీఎం తుమ్మలపల్లి శ్రీనివాసరావు, జీఎం (ఎస్టేట్స్) బండి వెంకటయ్య, చీఫ్ ఆఫ్ పవర్ ప్రాజెక్ట్స్ విశ్వనాథరాజు, ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్.మజుందార్, ఎస్ఈ(మైనింగ్) ప్రవీణ్ కశ్యప్ తదితరులు ఉన్నారు.

నేతన్నలవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే

- ఉపాధి లేక ఉసురు తీసుకుంటున్నా ఆదుకోరా?
- రూ.25 ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేతన్నలవి ఆత్మహత్యలు కాదు.. అవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ఆరోపించారు. ఉపాధి లేక ఉసురు తీసుకుంటున్నా ప్రభుత్వం ఆదుకోదా?అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు పది మంది నేతన్నలు ఆత్మబలిదానం చేసుకున్నారని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ఆత్మహత్య చేసుకున్న నేతన్నల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?అంటూ ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిలదీశారు. తెలంగాణలో పదేండ్ల తర్వాత మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు- సమైక్యరాష్ట్రం నాటి సంక్షోభం వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను, నేతన్నలకు ఆర్డర్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసిందని పేర్కొన్నారు. గతంలో అందిన ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం గత ప్రభుత్వంపై కక్షతో నేతన్నల ప్రాణాలను బలిపెట్టొద్దని కోరారు. గత పదేండ్లు చేతినిండా పనులతో కళకళలాడిన చేనేతరంగం.. ఇందిరమ్మ రాజ్యం పేరుతో తెచ్చిన ప్రభుత్వంలో సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందో.. మళ్లీ కాంగ్రెస్ వచ్చిన ఆర్నెళ్లలోనే అలాంటి విషాదకర పరిస్థితిని ఎదుర్కొంటోందని తెలిపారు. నేతన్నల విషాదకరమైన పరిస్థితిని రాజకీయ కోణంలో కాకుండా మానవత్వంతో పరిష్కరించాలని సూచించారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఉపాధి లేక దిక్కు తోచని స్థితిలో ఉన్న నేతన్నలకు, నేత పరిశ్రమలకు భరోసా కల్పించాలని సూచించారు. గత ప్రభుత్వం అమలు చేసిన చేనేత మిత్రా, థ్రిఫ్ట్, యారన్ సబ్సిడీ, నేతన్న ఫించన్లు, నేతన్న బీమా, విద్యుత్ సబ్సిడీ మొదలైన పథకాలను కొనసాగిస్తూ వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని తెలిపారు. లేకుంటే సమస్య పరిష్కారం అయ్యే వరకు బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. నేత కార్మికులకు అండగా ఉంటూ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

డీసెట్ దరఖాస్తు గడువు 30

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్-2024 దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. వాటి సమర్పణకు ఈనెల 30 వరకు గడువుందని డీసెట్ కన్వీనర్ ఎస్ శ్రీనివాసాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ లేదా తత్సమాన పరీక్షలో 50 శాతం మార్కులు వచ్చిన వారే దరఖాస్తు చేసేందుకు అర్హులనీ, ఎస్సీ,ఎస్టీ, వికలాంగులకు 45 శాతం మార్కులొచ్చినా దరఖాస్తు చేయొచ్చని సూచించారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి 17 ఏండ్లు నిండి ఉండాలని వివరించారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో డీసెట్ రాతపరీక్షలను వచ్చేనెల పదో తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 20,30 తేదీల్లో ఇప్పటి దరఖాస్తు చేసిన అభ్యర్థులకు సవరణకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఇతర వివరాలకుhttp://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

సీఎం అంటే కటింగ్ మాస్టర్ కాదు, కరెక్టింగ్ మాస్టర్ :మంత్రి తుమ్మల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ నాయకులు వాఖ్యానించినట్టు సీఎం అంటే కటింగ్ మాస్టర్ కాదు, కరెక్టింగ్ మాస్టర్ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంలో నిరుపేదలకు, అర్హులకే సంక్షేమ పథకాలని చెప్పారు. దుబారాకు దూరంగా పథకాల అమలు చేస్తామన్నారు. కష్టాల్లో ఉన్న రైతాంగానికి భరోసా ఇచ్చి, వారి పురోగతికి తోడ్పడటమే కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతని చెప్పారు.

సంక్షేమ పథకాలు అమలు, రాష్ట్ర అభివృద్ధి రెండు ఈ ప్రభుత్వ ప్రాథమిక సూత్రాలని ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా అలస్యం చేయడానికి కాదు, ఆదర్శం చేయడానికే కేబినేట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశామని తుమ్మల చెప్పారు.

మల్టీజోన్-2లో 6,013 మంది స్కూల్ అసిస్టెంట్ల బదిలీ

- నేటినుంచి ఎస్‌ఏ పదోన్నతులకు వెబ్‌ఆప్షన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మల్టీజోన్-2 పరిధిలో 6,013 మంది స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఈ ప్రక్రియ నుంచి రంగారెడ్డి జిల్లాకు మినహాయింపు ఉన్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో గతేడాది అక్టోబర్‌లోనే సుమారు 750 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. దీంతో మల్టీజోన్-2లో 6,763 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది. తాజాగా బదిలీ చేసిన వాటిలో నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 876 మంది ఎస్‌ఏ టీచర్లు బదిలీ అయ్యారు. సంగారెడ్డి జిల్లాలో 834 మంది, వికారాబాద్ జిల్లాలో 641 మంది, సూర్యాపేట జిల్లాలో 575 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 562 మంది, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 456 మంది, నాగర్ కర్నూల్ జిల్లాలో 451 మంది, మహబూబ్‌నగర్ జిల్లాలో 397 మంది, జనగామ జిల్లాలో 335 మంది, వనపర్తి జిల్లాలో 310 మంది, జోగులాంబ గద్వాల జిల్లాలో 305 మంది, నారాయణపేట జిల్లాలో 271 మంది చొప్పున మొత్తం 6,013 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. మల్టీజోన్-1 పరిధిలో 10,083 మంది, మల్టీజోన్-2 పరిధిలో 768 మంది కలిపి ఇప్పటి వరకు 10,851 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందిన విషయం తెలిసిందే. మల్టీజోన్-2లో మంగళవారం నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల ప్రక్రియకు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశమున్నది.

హైదరాబాద్ జిల్లాలో ఇప్పటికే 750 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు లభించాయి. మల్టీజోన్-2లో రంగారెడ్డి జిల్లా మినహా మిగిలిన 12 జిల్లాల్లో మరో ఆరు వేల మందికి మూడు, నాలుగు రోజుల్లో పదోన్నతులు వస్తాయని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. ఆ తర్వాత మల్టీజోన్-1, మల్టీజోన్-2లో ఒకేసారి సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)కు బదిలీల ప్రక్రియను నిర్వహిస్తారు. దీంతో రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తవుతుంది.

మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజీలో సాంకేతిక సమస్య

- ఆ అభ్యర్థులకు మళ్లీ పరీక్ష : టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ సంక్షేమ శాఖల పరిధిలో 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, వార్డెన్, మ్యాట్రన్, మహిళా సూపరింటెండెంట్ పోస్టుల భర్తీకి సోమవారం నుంచి కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షలు (సీబీఆర్టీ) విధానంలో రాతపరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈనెల 29 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని సైదాబాద్‌లో ఉన్న మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజీలో ఉదయం విడత రాతపరీక్ష నిర్వహణలో కొంత సాంకేతిక సమస్య వచ్చిందని తెలిపారు. దీంతో కొందరు అభ్యర్థులు పరీక్షను రాయలేకపోయారని పేర్కొన్నారు. వారికి తిరిగి పరీక్షను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పరీక్ష తేదీ, సమయాన్ని అభ్యర్థులకు ఈమెయిల్/ఎస్ఎంఎస్ ద్వారా తర్వాత సమాచారాన్ని తెలియజేస్తామని వివరించారు.

నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలి

- మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరా భవన్‌లో మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానంతరం బీజేపీ కార్యాలయ ముట్టడికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ 24 లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్‌సీ విషయంలో బీఆర్ఎస్‌ను బొంద పెట్టినట్టే.. నీట్ విషయంలో బీజేపీని బొంద బెట్టుడు ఖాయమని హెచ్చరించారు. నీట్ విషయంలో విద్యార్థులకు న్యాయం చేయకపోతే పార్లమెంట్‌ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

వెబ్‌సైట్‌లో ఏఈఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా :టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ శాఖల పరిధిలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఏఈఈ) మెకానికల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన ప్రొవిజినల్ జాబితా వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వెల్లడించింది. ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 163 పోస్టుల భర్తీ కోసం 2022, సెప్టెంబర్ మూడో తేదీన ఏఈఈ నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసిన సంగతి తెలిసిందే.

ప్రజల కొనుగోలు శక్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలి

సామాజిక భద్రతా నిధిని ఏర్పాటు చేయాలి

- కేంద్ర సంస్థల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి
- స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలి
- ఐఎల్‌సీ సిఫారసులను అమలు చేయాలి : కేంద్ర ఆర్థికమంత్రికి కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యల లేఖ



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను రూపొందించే సమయంలో కచ్చితంగా పరిగణించాల్సిన కొన్ని అంశాలను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకువస్తూ కేంద్ర కార్మిక సంఘాలు సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్ఈ డబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ, రంగాలవారీగా ఫెడరేషన్‌లు, అసోసియేషన్లు సంయుక్తంగా ఒక లేఖను రాశాయి. సంపద సృష్టికర్తలకు ప్రతినిధులుగా ఈ దేశ కార్మిక లోకం ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై గౌరవం, విశ్వాసంతో బడ్జెట్‌కు ముందస్తుగా జరిగే చర్చల్లో పాల్గొంటున్నా కార్మిక సంఘాలు చేసే ఏ ఒక్క సూచనను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని అందుకే ఈ లేఖ రాయాల్సి వచ్చిందని సంఘాల ప్రతినిధులు ఆ లేఖలో పేర్కొన్నారు. అత్యున్నత త్రైపాక్షిక వేదిక అయిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సీ) సమావేశం ఏర్పాటు చేసి దాదాపు దశాబ్ద కాలం గడుస్తోంది. గత ఐఎల్‌సీల సిఫారసులను అమలు చేయాలని కోరినా ఇంతవరకు దాన్ని పట్టించుకోలేదన్నారు. కేంద్ర కార్మిక సంఘాల సూచనలు, సిఫారసులు, డిమాండ్లు అన్ని విస్మరించడమే కాకుండా అన్ని త్రైపాక్షిక, ద్వైపాక్షిక ప్రజాస్వామ్య యంత్రాంగాలను, సంస్థలను కూడా పట్టించుకోకుండా పక్కనబెట్టేసి విధానాలను రూపొందిస్తున్నారని ఆ లేఖ పేర్కొంది. ఇందుకు తాజా ఉదాహరణగా కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రచురించిన నోటిఫికేషన్‌ను పేర్కొంది. ఈపీఎఫ్ చెల్లించని యజమా నులకు విధించే జరిమానాల రేట్లను గణనీయంగా తగ్గించారు. ఇది కూడా ఈపీఎఫ్‌ఓ సెంట్రల్ ట్రస్టీల బోర్డుకు తెలియకుండా జరిగింది. యూనియన్లతో కూడా దీనిపై చర్చలు జరపలేదు. ఇటువంటి విధానాల వల్ల కేవలం కొన్ని కార్పొరేట్ సంస్థలకు మాత్రమే లబ్ది చేకూరుతుందనే విషయాన్ని కొత్త ఎన్డీఏ ప్రభుత్వం గుర్తించాలని ఆ సంఘాలు ఆ లేఖలో కోరాయి. ప్రజల విస్తృత ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న దయనీయ పరిస్థితులను గమనంలోకి తీసుకుని ప్రజల కొనుగోలు శక్తి పెరిగేలా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్టు లేఖ పేర్కొంది. స్వామినాథన్ సిఫారసుల మేరకు అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర ఇవ్వాలని సూచించింది. కార్మికులందరికీ ఈపీఎఫ్, ఈఎస్ఐ సేవలు అందేలా చూడాలని కోరింది.వేతన జీవుల వేతనాలు, గ్రాట్యుటీలపై ఆదాయపన్ను రాయితీ సీలింగ్ పరిమితిని గణనీయంగా పెంచాలని సూచించింది. అలాగే నెలకు రూ.9వేల కనీస పెన్షన్, ఇతర వైద్య, విద్యా ప్రయోజనాలు కల్పించడంతో సహా సార్వజనీన సామాజిక భద్రతా పథకాలను అందచేసేందుకు అసంఘటిత రంగాల కార్మికులు, వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రతా నిధిని ఏర్పాటు చేయాలని సూచించింది. అసంఘటిత రంగాల కార్మికులందరినీ ఈ శ్రమ పోర్టల్‌లో చేర్చాలని, వారికి కూడా ఈ పథకాలను వర్తింపచేయాలని సూచించింది. కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు, పీఎస్‌యూల్లో ప్రస్తుతమున్న ఖాళీలన్నింటినీ తక్షణమే భర్తీ చేయాలని సూచించింది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లను తక్షణమే ఆపివేయాలని, దానికి బదులుగా రెగ్యులర్ ఉపాధికి హామీ కల్పించాలని కోరింది. సమాన పనికి సమాన వేతనం వుండాలని సూచించింది. అగ్నివీర్, ఆయుధ్‌వీర్, కొయలావీర్ వంటి నిర్దిష్ట కాలపరిమితి ఉపాధులను తక్షణమే ఆపివేయాలని కోరింది. ఆయా రంగాల్లో రెగ్యులర్ ఉపాధి కల్పించాలని కోరింది. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు పెంచుతూ కనీసం 200 రోజుల పనిదినాలు వుండేలా, చట్టబద్ధమైన కీన వేతనాలు నిర్ణయించేలా చూడాలని సూచించింది. కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేసిన, ఆ స్థానంలో పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని సూచించింది. తక్షణమే 8వ వేతన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరింది. 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని కార్మిక సంఘాలు సూచించాయి. పీఎస్‌యూల ప్రయివేటీకరణను తక్షణమే ఆపాలని కోరింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ ఖజానా దోపిడీ, దుర్వినియోగాలను ఆపాలని కోరింది. ఎల్ఐసీ, జీఐసీలను ప్రయివేటీకరించే చర్యలను నిలుపుచేయాలని సూచించింది. పోషకాహారం, ఆరోగ్యం, విద్య వంటి సామాజిక సేవా రంగాల ప్రయివేటీకరణను ఆపాలని కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యలు సూచించాయి. ఆరోగ్య, విద్య రంగాల్లో మౌలిక సేవలకు కేటాయింపులు పెంచాలని కోరాయి. తాగునీరు, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణాలకు తగిన కేటాయింపులు జరపాలని కోరింది. ఎస్సీ, ఎస్టీ, ఉప ప్రణాళికకు, మహిళలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని సూచించింది. పెట్రోలియం ధరలను పెంచడం వల్ల నిత్యావసరాలు, ఇతర సేవల ధరలు పెరుగుతాయని అందువల్ల పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచరాదని సూచించింది. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా వర్కర్లతో సహా స్కీమ్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, వారికి ఐఎస్‌సీ సిఫారసులకనుగుణంగా వేతనాలు, ఇతర ప్రయోజనాలు అందించాలని సూచించింది.

తొలిరోజే గరం గరం



(మొదటిపేజీ తరువాయి)

ఆవరణలో నిరసనకు దిగారు. రాజ్యాంగ ప్రతులను చేతిలో పట్టుకుని, రాజ్యాంగాన్ని కాపాడాలంటూ నేతలు నినాదాలు హోరెత్తించారు. బీజేపీ రాజ్యాంగాన్ని అవమానిస్తోందని విమర్శించారు.

ఆందోళనలో సోనియా, ప్రతిపక్ష ఎంపీలు

ఈ ఆందోళనలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ, వివిధ పార్టీల నేతలు, ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం వాయనాడ్ లోక్‌సభ స్థానానికి రాహుల్ గాంధీ రాజీనామా చేశారు. ఆ రాజీనామాను ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ఆమోదించారు.

స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు ప్రతిపక్ష పోటీ

లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు పోటీ చేస్తామని ఆర్ఎస్‌పీ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చందన్ పేర్కొన్నారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులపై ప్రతిపక్షాల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకునేందుకు ముందుకొస్తే తాము పోటీపై పునరాలోచిస్తామని చెప్పారు. ప్రభుత్వం మొండివైఖరితో వెళితే తాము తప్పకుండా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. ఎమర్జెన్సీపై ప్రధాని మోడీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ గత పదేండ్లలో మోడీ పాలనలో రాజ్యాంగం, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. రాజ్యాంగ మార్పుకు కాషాయ పాలకులు గట్టి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ మార్పులను ప్రతిపక్షం ఐక్యంగా ఎదుర్కొని నిలువరిస్తుందని అన్నారు. రాజ్యాం గాన్ని కాపాడుకునేందుకు తాము కలిసికట్టుగా పోరాడతామని స్పష్టం చేశారు. దేశ లౌకిక ప్రజాస్వామ్య స్ఫూర్తిని రక్షించాల్సిన అవసరం ఉందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలు, సిద్ధాం తాలను పరిరక్షించుకోవాలని అన్నారు.

ప్రజాస్వామ్యంపై ఎమర్జెన్సీ మచ్చ : ప్రధాని మోడీ

(మొదటిపేజీతరువాయి)

ఓటర్లు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. మా విధానాలకు, అంకితభావానికి జనామోదం లభించింది. ప్రజలు మాకు వరుసగా మూడోసారి సేవచేసే అవకాశం కల్పించారు. ఇది చాలా పవిత్రమైన రోజు. కొత్త సభ్యులకు స్వాగతం. కొత్త ఆశలు, కొత్త ఉత్సాహంతో ముందుకు సాగాలి. అందరి సహకారంతో భరతమాత సేవలో పాల్గొంటాం. కొత్త లక్ష్యాలను చేరుకోవడానికి మనమంతా కృషి చేయాలి. 2047 వికసిత్ భారత్ సంకల్పం, లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా సాగుతాం. రాజ్యాంగానికి గౌరవం ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటాం. కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతాం. భారత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా కృషి చేస్తాం' అని మోడీ తెలిపారు. 18వ లోక్‌సభలో ప్రతిపక్షం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

రాజ్యసభనేతగా జేపీ నడ్డా

రాజ్యసభ సభ పక్ష నేతగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను ఆ పార్టీ ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల్లో ముంబయి నార్త్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచిన పియూశ్ గోయల్ స్థానంలో ఆయనను నియమించింది. గోయల్ 2010 జులై 5న రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. 2021 జులై 14న ఆయనను రాజ్యసభ సభా నాయకుడిగా ప్రకటించారు. జూన్ 4న లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన స్థానంలో జేపీ నడ్డా నియమించారు. జేపీ నడ్డా తొలిసారిగా 2012 ఏప్రిల్ 3న రాజ్యసభకు ఎన్నికయ్యారు. సోమవారం ఆయనను సభపక్ష నేతగా నియమిస్తూ పార్టీ నిర్ణయించింది.

15 రోజుల అరాచకాలు.. : రాహుల్ గాంధీ



మోడీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ మూడోసారి అధికారం చేపట్టిన 15 రోజులపాటు అరాచక పాలన కొనసాగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఈ15 రోజుల్లో ప్రజలు ఎదుర్కొన్న పది సమస్యలపై ఆయన ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ప్రజా సమస్యల్ని పక్కకు పెట్టి.. ప్రభుత్వాన్ని కాపాడుకోవడంలో మోడీ బిజీగా ఉన్నారని ఆరోపించారు.ఎక్స్‌లో ఆయన సుదీర్ఘ పోస్ట్ చేశారు. అందులో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదం నుంచి కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడుల వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.


ఎంపీలుగా ప్రమాణం చేస్తున్న...



మోడీ..



కిషన్ రెడ్డి..



బండి సంజయ్..



రామ్మోహన్ నాయుడు



పెమ్మసాని చంద్రశేఖర్

నీట్ టాపర్లు అక్కడే పరీక్ష రాశారు !

- అది బీజేపీ నేత బంధువుల పాఠశాల
- హర్యానాలో బయటపడిన బాగోతం

న్యూఢిల్లీ/జజ్జర్ : ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్-యూజీ పరీక్షల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగిన సంగతి తెలిసిందే. హర్యానాలోని జజ్జర్‌లో ఉన్న హర్‌దయాళ్ పబ్లిక్ స్కూలులో కూడా ఈ పరీక్ష జరిగింది. ఈ కేంద్రంలో ఐదు వందల మందికి పైగా విద్యార్థులు పరీక్ష రాశారు. వీరిలో ఆరుగురికి 720కి గాను 720...అంటే ఫుల్ మార్కులు వచ్చాయి. మరో ఇద్దరు విద్యార్థులకు 718, 719 చొప్పున మార్కులు వచ్చాయి. సాధారణంగా ఈ స్థాయిలో మార్కులు పొందడం అసంభవం. విశేషమేమిటంటే పరీక్షా కేంద్రానికి కొద్ది దూరంలోనే పోలీస్ స్టేషన్ ఉంది. కానీ అక్కడి సిబ్బందికి తమ సమీపంలోనే ఉన్న ఆ పాఠశాల గురించే తెలియదు.

ఈ పరీక్షా కేంద్రం దేశ రాజధానికి కేవలం యాభై కిలోమీటర్ల దూరంలో ఉంది. దీనిని 1995లో ప్రారంభించారు. అనురాధా యాదవ్ ఈ పాఠశాలకు అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె కుటుంబానికి ఆ ప్రాంతంలో ఎంతో ప్రాబల్యం ఉంది. అనురాధా యాదవ్ మేనల్లుడు శేఖర్ యాదవ్ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా



పనిచేస్తున్నారు. ఆయన రోహ్‌తక్ బీజేపీ మాజీ ఎంపీ అరవింద్ శర్మకు అత్యంత సన్నిహితుడు. రాబోయే హర్యానా శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయాలని శేఖర్ యాదవ్ ప్రయత్నిస్తున్నారు. నీట్ కుంభకోణంలో హర్‌దయాళ్ పబ్లిక్ స్కూలు పాత్రపై ఆయనను ప్రశ్నించగా 'అది మా కుటుంబానికి చెందిన పాఠశాలే. అయితే ఆ స్కూలులో నా పాత్ర ఏమీ లేదు' అని బదులిచ్చారు.

శేఖర్ యాదవ్ భార్య నేహా యాదవ్‌కు కూడా బీజేపీతో సంబంధాలు ఉన్నాయి. పాఠశాల అధ్యక్షురాలైన అనురాధా యాదవ్ సైతం బీజేపీ కరపత్రాలు పంచేవారు. ఆ పార్టీ కోసం ప్రచారం చేసేవారు. జజ్జర్‌లో తొలిసారి నీట్ పరీక్ష జరిగింది. జిల్లాలోని మూడు పాఠశాలల్లో పరీక్ష నిర్వహించారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే దేశవ్యాప్తంగా ఇచ్చిన ప్రశ్నాపత్రానికి, హర్‌దయాళ్, విజయ స్కూళ్లలో ఇచ్చిన ప్రశ్నాపత్రానికి మధ్య వ్యత్యాసం ఉంది. ప్రశ్నాపత్రాల పంపిణీలో పొరబాటు జరగడంతో చాలా సమయం కోల్పోయామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సమయం వృథా కావడంతో దేశవ్యాప్తంగా 1,563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలిపారు. హర్‌దయాళ్ స్కూలులో 170/170 సాధించిన ఆరుగురికి కూడా ఈ మార్కులు కలిశాయి. ఆ పాఠశాలకు చెందిన మరో ఇద్దరికి కూడా ఈ మార్కులు ఇచ్చారు.

ఉద్యోగాలు కోల్పోతున్న చట్టవిరుద్ధ సంస్థలు



న్యూఢిల్లీ : ఉత్పాదక రంగంలో చట్టబద్ధంగా ఏర్పడని పలు సంస్థలు గడచిన ఏడు సంవత్సరాల కాలంలో లక్షలాది ఉద్యోగాలను కోల్పోయాయి. 2015 జూలై-2016 జూన్, 2022 అక్టోబర్-2023 సెప్టెంబర్ మధ్య కాలంలో ఈ సంస్థలు 54 లక్షల ఉద్యోగాలను కోల్పోయాయి. అదే సమయంలో 18 లక్షల సంస్థలు మూతపడ్డాయి. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) అందించిన సమాచారం ప్రకారం గత ఏడు సంవత్సరాల కాలంలో చట్టబద్ధంగా ఏర్పడని సంస్థల సంఖ్య 9.3% మేర తగ్గింది. 2022 అక్టోబర్-2023 సెప్టెంబర్ మధ్యకాలంలో ఉత్పాదక రంగంలో 1.78 కోట్ల అనధికారిక సంస్థలు కార్యకలాపాలు సాగించాయి. 2015 జూలై-2016 జూన్ మధ్యకాలానికి వాటి సంఖ్య 1.97 కోట్లుగా ఉండేది. అంటే అనధికారిక సంస్థల సంఖ్య 9.3% తగ్గిందన్న మాట.ఇదే కాలంలో ఆయా సంస్థల్లో పనిచేసిన కార్మికుల సంఖ్య కూడా తగ్గిపోయింది. 2015-16లో అనధికారిక సంస్థల్లో 3.60 కోట్ల మంది కార్మికులు పనిచేయగా 2022-23 నాటికి వారి సంఖ్య 3.06 కోట్లకు అంటే 15% మేర తగ్గింది. అనధికారిక రంగంలోని చిన్న చిన్న వ్యాపారాలు, ఒకే వ్యక్తి యాజమాన్యంలో నడిచే సంస్థలు, భాగస్వామ్యాలు...వీటన్నింటినీ చట్టవిరుద్ధంగా ఏర్పడిన సంస్థలుగా పరిగణిస్తారు. ఇవి చట్టబద్ధంగా ఏర్పడినవి కావు. వాణిజ్య రంగంలో కూడా చట్టవిరుద్ధంగా ఏర్పడిన సంస్థల సంఖ్య తగ్గిపోయిందని ఎన్ఎస్ఓ తెలిపింది. 2015 జూలై-2016 జూన్ మధ్యకాలంలో 2.30 కోట్ల సంస్థలు ఉంటే 2022 అక్టోబర్-2023 సెప్టెంబర్ నాటికి వాటి సంఖ్య 2.25 కోట్లకు తగ్గింది. అయితే ఈ రంగంలో పనిచేసిన కార్మికుల సంఖ్య స్వల్పంగా... 3.87 కోట్ల నుండి 3.9 కోట్లకు పెరగడం గమనార్హం.

బీహార్‌లో నీట్-యూజీ ప్రశ్నాపత్రం లీక్

లభించిన ఆధారాలు




పాట్నా : బీహార్‌లో నీట్-యూజీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయిందని రూఢీ అయింది. ప్రశ్నాపత్రం ఫొటోకాపీ ఒక దానిని కొందరు వ్యక్తులు తగలబెట్టారు. ఆ చెత్తను బీహార్ ప్రభుత్వ ఆర్థిక నేరాల విభాగం క్షుణ్ణంగా పరిశీలించగా ప్రశ్నాపత్రంలో ఇచ్చిన 68 ప్రశ్నలు తగలబడిన ఫొటోకాపీలోనూ కన్పించాయి. ఈ సమాచారాన్ని బీహార్ ప్రభుత్వం కేంద్రానికి చేరవేసింది. తగలబడిన ప్రశ్నాపత్రంలో అధికారులకు పరీక్షా కేంద్రం కోడ్ కన్పించింది. అది సీబీఎస్ఈ అనుబంధ ఒయాసిస్ ప్రైవేటు పాఠశాలకు చెందినది. జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో ఉన్న ఈ పాఠశాలలో పరీక్ష జరిగింది. ఈ ప్రశ్నాపత్రాన్ని ఓ ఇంటి నుండి బీహార్ పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు. తగలబడిన ఫొటోకాపీని, అసలైన ప్రశ్నాపత్రాన్ని, అందులోని ప్రశ్నలను సరిపోల్చేందుకు అధికారులు ఫోరెన్సిక్ లేబొరేటరీ సాయం తీసుకున్నారు.

ఆర్థిక నేరాల విభాగం అందించిన సమాచారం ఆధారంగానే కేంద్ర విద్యా శాఖ విచారణను సీబీఐకి అప్పగించింది. పేపర్ లీకేజీ కేసులో ఇప్పటి వరకూ 18 మంది అరెస్టయ్యారు. కాగా ఫొటోకాపీలోని ప్రశ్నల వరుస సంఖ్యలు, ఒరిజనల్ ప్రశ్నాపత్రంలోని ప్రశ్నల వరుస సంఖ్యలు కూడా ఒకేలా ఉన్నాయి. పేపర్ ఎక్కడ, ఎప్పుడు లీకైందో తెలుసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అధికారులు రెండు రోజుల క్రితం ఒయాసిస్ పాఠశాలకు వెళ్లి ప్రశ్నాపత్రాలు ఉన్న పెట్టెలు, కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఓ కవరును తప్పుగా వేరే వైపు కత్తిరించారని వారు గుర్తించారు. పరీక్షా కేంద్రానికి చేరుకోక ముందే పేపర్లు లీక్ అయి ఉంటాయని పాఠశాల ప్రిన్సిపాల్ అభిప్రాయపడ్డారు.

ఇదేం సంప్రదాయం ?

ప్రొటెం స్పీకర్ నియామకంపై నిపుణుల అభ్యంతరం

మోడీ విషయంలోనూ ఉల్లంఘన జరిగిందని వ్యాఖ్య



న్యూఢిల్లీ : లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్‌ను నియమించడంపై రాజ్యాంగ నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ సంప్రదాయానికి విరుద్ధంగా ఈ నియామకం జరిగిందని వారు వ్యాఖ్యానించారు. లోక్‌సభ సభ్యుడిని ప్రొటెం స్పీకర్‌గా నియమించడంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య ఇప్పటి వరకూ ఎలాంటి వివాదం చెలరేగలేదు. అయితే ఆరు సార్లు ఎంపీగా ఎన్నికైన భర్తృహరి మహతాబ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 21న ప్రొటెం స్పీకర్‌గా నియమించడంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, కాంగ్రెస్ నేత జైరాం రమేష్ మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. రాబోయే కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు మధ్య సంబంధాలు సజావుగా సాగబోవని ఈ పరిణామాన్ని బట్టి తేటతెల్లమవుతోంది.

ప్రొటెం స్పీకర్‌గా సభలో అందరి కంటే సీనియర్ అయిన సభ్యుడిని రాష్ట్రపతి నియమించాల్సి ఉంటుందని పార్లమెంటరీ సంప్రదాయాలు చెబుతున్నాయి. 1952లో మొదటి లోక్‌సభ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులు ఖాళీగా ఉన్నప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 95(1) ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించి రాష్ట్రపతి ప్రొటెం స్పీకర్‌ను నియమిస్తారు. సాధారణంగా సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులు ఖాళీగా ఉంటాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ బాధ్యతలు నిర్వర్తించేందుకు రాష్ట్రపతి ప్రొటెం స్పీకర్‌ను నియమిస్తారు.

రిజిజు ఏమన్నారంటే...

ఈ నిర్ణయాన్ని కేంద్ర మంత్రి రిజిజు సమర్థించుకున్నారు. ఎలాంటి అంతరాయాలు లేకుండా మహతాబ్ వరుసగా ఆరు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారని, సురేష్ ఎనిమిది సార్లు సభకు ఎన్నికైనప్పటికీ అది వరుసగా జరగలేదని, మధ్యలో విరామం వచ్చిందని ఆయన చెప్పారు. అయితే అత్యంత సీనియర్ సభ్యుడిని ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తూ 1952 నుండి అమలవుతున్న పార్లమెంటరీ సంప్రదాయాన్ని ఉల్లంఘించడానికి మంత్రివర్యులు చెబుతున్న కారణం చాలా పేలవంగా ఉంది.

సీనియారిటీ అంటే...

ఎంఎన్ కౌల్, ఎస్ఎల్ షక్దర్ రచించిన ప్రాక్టీస్ అండ్ ప్రొసీజర్ ఆఫ్ పార్లమెంట్ అనే పుస్తకాన్ని లోక్‌సభ సచివాలయం తీసుకొచ్చింది. 1952 నుండి లోక్‌సభలో అత్యంత సీనియర్ అయిన సభ్యుడిని ప్రొటెం స్పీకర్‌గా రాష్ట్రపతి నియమిస్తున్నారని ఆ పుస్తకంలో స్పష్టం చేశారు. అత్యంత సీనియర్ అయిన సభ్యుడినే ప్రొటెం స్పీకర్‌గా రాష్ట్రపతి నియమిస్తున్నారని ఆ పుస్తకం తెలిపింది కానీ వరుసగా ఎన్నికైన సభ్యుల సీనియారిటీనే పరిగణనలోకి తీసుకున్నారని ఎక్కడా చెప్పలేదు. ఈ నేపథ్యంలో రిజిజు వాదన పార్లమెంటరీ సంప్రదాయాన్ని ఉల్లంఘించేలా ఉంది.

ఈ మినహాయింపులున్నాయి

1956లో సర్దార్ హుకుం సింగ్, 1977లో డీఎన్ తివారీని ప్రొటెం స్పీకర్లుగా నియమించినప్పుడు సంప్రదాయాన్ని పాటించలేదు. ఎందుకంటే ఆ సమయంలో అత్యంత సీనియర్ సభ్యులు ఎవరూ సభలో లేరు. ఇక 2004లో అత్యంత సీనియర్ అయిన సోమనాథ్ ఛటర్జీని ప్రొటెం స్పీకర్‌గా రాష్ట్రపతి నియమించారు. అయితే ఆయన పేరును లోక్‌సభ స్పీకర్ పదవికి పరిశీలించినప్పుడు బాలాసాహెబ్ విఖే పాటిల్‌ను అప్పటి రాష్ట్రపతి స్పీకర్ ప్రొటెంగా నియమించారు. అంటే ముందుగా ప్రొటెం స్పీకర్‌గా నియమితులై, ఆ తర్వాత స్పీకర్ పదవికి ఎన్నికై సభను నడిపిన సందర్భం ఒకటి ఉందని అర్థమవుతోంది. ఇప్పుడు భర్తృహరి మహతాబ్‌ను కూడా స్పీకర్ పదవికి ఎన్నుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ప్రొటెం స్పీకర్ విధులేమిటి?

ప్రొటెం స్పీకర్ కేవలం రెండు విధులు మాత్రమే నిర్వర్తిస్తారు. లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయిస్తారు. ఆ తర్వాత స్పీకర్ ఎన్నిక జరిపిస్తారు. అంతటితో ప్రొటెం స్పీకర్ పాత్ర ముగుస్తుంది. ప్రొటెం స్పీకర్ పెద్దగా చేసే పని ఏమీ ఉండదు కాబట్టి వివాదానికి తావు లేకుండానే నియామకం జరిగిపోతుంది. సాధారణంగా సభలో అత్యంత సీనియర్ సభ్యుడైన వ్యక్తిని రాష్ట్రపతి ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తారు. కానీ దురదృష్టవశాత్తూ ఇప్పుడు అలా జరగలేదు. ఎనిమిది సార్లు లోక్‌సభకు ఎన్నికైన కె.సురేష్‌ను కాదని కేవలం ఆరు సార్లు మాత్రమే ఎన్నికైన మహతాబ్‌ను ద్రౌపది ముర్ము ప్రొటెం స్పీకర్‌గా నియమించారు.

వారేం చేశారు?

1989లో వీపీ సింగ్‌ను వెంకట్రామన్ ప్రధానిగా నియమించారు. పార్టీ పార్లమెంటరీ పార్టీ నేతగా, అదే విధంగా నేషనల్ ఫ్రంట్ కూటమి భాగస్వామ్య పక్షాల నేతగా వీపీ సింగ్ ఎన్నికయ్యారని ధృవీకరించుకున్న తర్వాతే వెంకట్రామన్ ఆయనను ఆహ్వానించారు. లోక్‌సభలో నెల రోజుల్లో మెజారిటీ నిరూపించుకోవాలని సూచించారు. నారాయణన్ కూడా 1998లో అటల్ బిహారీ వాజ్‌పేయిని ప్రధానిగా నియమించినప్పుడు ఆయన బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికయ్యారని, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ఆయనకు మద్దతు ఇచ్చాయని ధృవీకరించుకున్నారు. కానీ మోడీ బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికయ్యారని ముర్ము ధృవీకరించుకోలేదు. అంతేకాదు....లోక్‌సభలో బల నిరూపణ చేసుకోవాలని కూడా ఆయనకు సూచించలేదు. ఈ పరిణామాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి హానికరమని మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ వద్ద ఓఎస్‌డీగా పనిచేసిన ఎస్ఎన్ సాహూ వ్యాఖ్యానించారు.

సంప్రదాయానికి తిలోదకాలు

మహతాబ్ ఆరు సార్లు మాత్రమే లోక్‌సభకు ఎన్నికైనప్పటికీ ఆయనను ప్రొటెం స్పీకర్‌గా నియమించాలంటూ రాష్ట్రపతికి ప్రధాని మోడీ సూచించడం అసాధారణం మాత్రమే కాక పార్లమెంటరీ సంప్రదాయాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. ప్రధానిగా మోడీని నియమిస్తూ రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయం సైతం సంప్రదాయానికి విరుద్ధంగానే జరిగిందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా మోడీ ఎన్నికయ్యారా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకోకుండా రాష్ట్రపతి ఆయనను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. గతంలో ఆర్. వెంకట్రామన్, కేఆర్ నారాయణన్ పాటించిన సంప్రదాయాన్ని ముర్ము అనుసరించలేదన్న విమర్శలు వచ్చాయి.

భారీగా పెరిగిన అంచనా వ్యయం


- ప్రస్తుతం 458 కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు రూ. 5.71 లక్షల కోట్లకు పైగానే ఖర్చవుతుందని లెక్కలు
- కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ సమాచారం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ద్వారా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఖర్చు అంచనాలను మించిపోయాయి. దేశవ్యాప్తంగా మొత్తం 1,817 ప్రాజెక్టుల్లో 458 ప్రాజెక్టులపై రూ.5.71 లక్షల కోట్లకు పైగా అదనపు వ్యయం నమోదైంది. అలాగే, 831 ప్రాజెక్టులు ఆలస్యమయ్యాయి. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక ఈ సమాచారాన్ని వెల్లడించింది. ఈ సామాచారం ప్రకారం.. ఈ ప్రాజెక్టులలో ప్రతి ఒక్కదాని ఖర్చు రూ. 150 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ.ఈ 1,817 ప్రాజెక్టుల అమలుకు తొలుత మొత్తం అసలు వ్యయం రూ. 27,58,567.23 కోట్లుగా అంచనా వేయగా.. ప్రస్తుతం వాటి పూర్తి అంచనా వ్యయం రూ. 33,29,647.99 కోట్లకు చేరింది. అంటే, అదనంగా రూ. 5,71, 080.76 కోట్లు ఎక్కువ అన్నమాట. పూర్తి వ్యయం పెరగటంతో ప్రభుత్వానికి 20.70 శాతం అదనపు ఖర్చు అవుతుంది.

831 ఆలస్యమైన ప్రాజెక్టులలో, 245 మొత్తం 1-12 నెలల పరిధిలో ఆలస్యంగా ఉన్నాయి, 188 ప్రాజెక్టులు 13-24 నెలలు, 271 ప్రాజెక్టులు 25-60 నెలలు, 127 ప్రాజెక్టులు 60 నెలలకు పైగా ఆలస్యమయ్యాయి. కాగా, జాప్యానికి కారణాలు భూసేకరణ, పర్యావరణ క్లియరెన్స్, ఆర్థిక సమస్యలు, ఒప్పంద, అంతర్గత సమస్యలు, మానవ వనరుల కొరత, వ్యాజ్య సమస్యలని ప్రాజెక్ట్ అమలు ఏజెన్సీలు చెప్పటం గమనార్హం.

సంపాదకీయం

నేరాల దారిలో...



అసాంఘిక శక్తులను కట్టడిచేసి సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించే ఉదాత్త బాధ్యత పోలీసులది. భయానికి తావులేని, భద్రతకు ఊతమిచ్చే పరిస్థితులను కల్పించడమే వారి అంతిమ లక్ష్యం. అలాంటి బాధ్యతాయుత వృత్తిని చేపట్టిన రక్షక భటులు వారి శాఖ కీర్తిని ఇనుమడింపజేస్తూ ప్రజల మన్ననలు పొందాలి. కానీ, వాస్తవ చిత్రం ఇందుకు విరుద్ధంగా ఉండటంతో పోలీసుల ప్రతిష్టకు తూట్లు పడుతున్నాయి. రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకొన్న ఘటనలే ఇందుకు తార్కాణం. భూవివాదాల్లో తలదూర్చడం, బెదిరింపులకు పాల్పడటం వంటి ఆరోపణలు పోలీసుశాఖకు కొత్తేమీ కాదు. ప్రస్తుతం ఆ స్థాయి దాటిపోయి లైంగికదాడులకు పాల్పడే స్థితికి దిగజారింది. అవినీతి, భూ, ఆస్తి తగాదాల కేసుల్లో చిక్కుకోవడంతోపాటు తమ అనైతిక చర్యలతో శాఖ పరువును, విశ్వసనీయతను అభాసుపాలు చేస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. తాజాగా కాళేశ్వరం ఎస్సై తన కింద పనిచేసే ఓ మహిళా హెడ్‌కానిస్టేబుల్‌పై లైంగిక వేధింపులకు పాల్పడ్డ వ్యవహారం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలోనూ ఇలాంటి ఘటనలకు పాల్పడ్డ చరిత్ర ఆయనకు ఉంది.

గతంలో తెరవెనకే ఉండిపోయిన దురాగతాలు సామాజిక మాధ్యమాల పుణ్యమా అని నేడు కళ్లెదురుగా కనిపిస్తున్నాయి. నడిరోడ్డుపై ప్రజలను చితకబాదడం, చిరువ్యాపారులపై ప్రతాపం చూపడం, మద్యం తాగి ఒళ్లు తెలియకుండా పడిపోవడం లాంటి ఘటనలు పోలీసులను మరింత చులకన చేస్తున్నాయి. శాఖలో అంతర్గత సంబంధాల్లోనూ కర్కశత్వం రాజ్యమేలడం గమనార్హం. కిందిస్థాయి సిబ్బంది పట్ల చిన్నచూపు, నియంతృత్వ వైఖరి, ప్రతీకార ధోరణులకు పాల్పడే ధోరణులు అంతకంతకూ తీవ్రమవుతుండటం కూడా పోలీసు వ్యవస్థలో అతిపెద్ద సమస్యగా మారింది.

ఒక్కొక్క చోట ఒక్కో వివాదం. ఏ తీగ లాగినా కదులుతోంది పోలీసు డొంకలే. 'భూవివాదంలో కొట్టి చంపుతున్నారు.. కాపాడండి' అంటూ నారాయణపేట జిల్లా ఊట్కూరు పోలీసుస్టేషన్ పరిధిలో బాధితులు డయల్-100కు ఫోన్ చేస్తే స్థానిక ఎస్సై మాత్రం స్పందించలేదు. దాదాపు 4 గంటల తర్వాత ఘటనా స్థలానికి పోలీసులు చేరుకునేటప్పటికి ఓ వ్యక్తి నిండు ప్రాణం పోయింది. హైదరాబాద్ సీసీఎస్‌లో ఏసీపీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయ్యారు. గతంలోనూ ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోక పోగా.. కీలకమైన కేసుల బాధ్యతలు అప్పగించారు. ఇదే సీసీఎస్‌లో సీఐ రూ.3 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పోలీసుశాఖకు మాయనిమచ్చలా మారింది. ఈ కేసులో ఇప్పటికే నలుగురు పోలీసు అధికారులు అరెస్టు కాగా.. విశ్రాంత ఐజీ స్థాయి అధికారి కీలక నిందితుడిగా ఉన్నారు. చివరకు జడ్జీల ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్టు నిందితులు ఒప్పుకోవడం సంచలనంగా మారింది. ఎన్నికల సందర్భంగా ఒక ఎస్పీ స్థాయి అధికారే స్వయంగా డబ్బు తరలింపునకు ఎస్కార్ట్ ఏర్పాటు చేశారని దర్యాప్తులో వెల్లడైంది. ఓ విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇంటి కబ్జా కేసులో ఐపీఎస్ అధికారిపై కేసు నమోదైంది. మరోవైపు నగరవాసులు 'డయల్ 100'కు ఫోన్ చేయాలంటేనే హడలిపోతున్నారు. తమకు ఫోన్ చేసిన భాధితుల వివరాలు స్వయంగా పోలీసులే రౌడీమూకలకు అందిస్తుండటమే ఇందుకు కారణం. వివాదాలను పరిష్కరించాల్సిన వ్యవస్థే ఇలా కొత్త సమస్యాత్మకంగా మారడం సోచనీయం.

కేసుల విచారణలో.. సాంకేతికత వినియోగంలో తెలంగాణ పోలీసులకు దేశవ్యాప్తంగా మంచి పేరుంది. కానీ కొందరి తీరుతో ఆ కీర్తి కాస్తా మసకబారుతోంది. పోలీసులకు ప్రజల మధ్య సత్సంబంధాల విషయంలో ఆదినుంచీ ఉన్న అగాధం నేడు మరింత పెద్దది అవు తుందే తప్ప తగ్గడం లేదు. ఫలితంగా సమాజంలో ఆ శాఖ పట్ల ప్రతికూల వైఖరి, వ్యతిరేక దృక్పథం వేళ్లూనుకున్నాయి. ప్రజల్లో నెలకొన్న ఈ అభిప్రాయాలను తొలగించుకొవాల్సిన బాధ్యత నిస్సందేహంగా పోలీసులదే. ఆ దిశగా అడుగులు వేయాల్సిందిపోయి...కఠిన శిక్షపడే సెక్షన్ల కింద నేరాన్ని మోపేందుకు కొందరు పోలీసులు ఎంతమాత్రం వెనకాడరని వాస్తవ ఘటనలు రుజువు చేస్తున్నాయి. ఇలాంటి ఘటనలు ఆ శాఖ ప్రతిష్టను మంటగలుపుతున్నాయి.

గతంలో తెరవెనకే ఉండిపోయిన దురాగతాలు సామాజిక మాధ్యమాల పుణ్యమా అని నేడు కళ్లెదురుగా కనిపిస్తున్నాయి. నడిరోడ్డుపై ప్రజలను చితకబాదడం, చిరువ్యాపారులపై ప్రతాపం చూపడం, మద్యం తాగి ఒళ్లు తెలియకుండా పడిపోవడం లాంటి ఘటనలు పోలీసులను మరింత చులకన చేస్తున్నాయి. శాఖలో అంతర్గత సంబంధాల్లోనూ కర్కశత్వం రాజ్యమేలడం గమనార్హం. కిందిస్థాయి సిబ్బంది పట్ల చిన్నచూపు, నియంతృత్వ వైఖరి, ప్రతీకార ధోరణులకు పాల్పడే ధోరణులు అంతకంతకూ తీవ్రమవుతుండటం కూడా పోలీసు వ్యవస్థలో అతిపెద్ద సమస్యగా మారింది.

సహజంగా రాజ్యం చేసే ప్రతి పనికి వత్తాసు పలకడం పోలీసు వ్యవస్థ పని. అందుకనే అధిపత్యం, పీడన ఆ వ్యవస్థకు అలవాటుగా మారిపోయాయి. సమాజంలో నెలకొన్న అవినీతిని వెలికితీయాల్సిన వ్యవస్థ అవినీతిలో కూరుకుపోతోంది. ఇప్పుడు నేరాల మకిలి కూడా అంటించుకుంటోంది. ప్రజాస్వామిక దృక్పథంతో ప్రజలను రక్షించే వ్యవస్థగా పోలీసుశాఖ మారడం కష్టతరమైనప్పటికీ జరగాల్సిన అది అవసరం ఉంది. 'ఫ్రెండ్లీ పోలీస్' వంటి నినాదాలు ఎన్ని ఇచ్చినప్పటికీ, సంస్థాగతంగా మారకుండా ప్రజా'రక్షకులు'గా పేరు తెచ్చుకోలేరు.

కృత్రిమ మేధస్సు - ఉపాధి సమస్య



ప్రభాత్ పట్నాయక్

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ లేదా ఎ.ఐ)ను ఉపయోగించడానికి నిర్మాతలు సిద్ధపడినప్పుడు హాలీవుడ్ రచయితలు దాని కారణంగా తమ ఉపాధి దెబ్బతింటోందంటూ సమ్మెకు దిగారు. ఆ ఘర్షణ సర్దుబాటు అయింది. అయితే ఆ సమ్మె లేవనెత్తిన మౌలిక ప్రశ్న మాత్రం అలానే మన ముందుంది. ఎ.ఐ ని ప్రవేశ పెడితే వచ్చే అనేక సమస్యల గురించి చాలా మంది రాశారు. కాని ఎ.ఐ కారణంగా తలెత్తే భారీ స్థాయి నిరుద్యోగం గురించి ఇక్కడ మనం ప్రధానంగా చర్చించాలి.


ఇక్కడ సమస్య ఎ.ఐ ది కాదు. ఎ.ఐ ని పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రవేశ పెట్టడం వలన వచ్చే సమస్య ఇది. ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక భాగంలో ఉన్నది పెట్టుబడిదారీ వ్యవస్థే గనుక శ్రామిక ప్రజానీకానికి ఇది తీవ్రమైన సమస్యగా ఉంటుంది. శ్రమను అందరూ పంచుకోవడం, దాని ఫలితంగా వచ్చే ఉత్పత్తిని కూడా అందరూ పంచుకోవడం అన్న సూత్రాన్ని అనుసరించే వ్యవస్థ, అంటే సోషలిస్టు వ్యవస్థ వంటిది ఉన్న చోట ఎ.ఐ ని ప్రవేశపెడితే అది పెద్ద సమస్య కానే కాదు. ఎ.ఐని ప్రవేశ పెట్టడం వలన వచ్చే నైతిక, ఇతర అభ్యంతరాలను పక్కన పెడితే, అది సోషలిస్టు వ్యవస్థలో మనుషుల మీద పనిభారాన్ని తగ్గిస్తుందే తప్ప అక్కడ ఉపాధి అవ కాశాలను నాశనం చేయదు. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో అలా జరగదు. ఎందుకంటే ఈ వ్యవస్థ పని భారాన్ని పంచుకోవడం, ఉత్పత్తిని పంచుకోవడం అనే సూత్రాన్ని అనుసరించదు.

ఉదాహరణకు, ఎ.ఐని ప్రవేశ పెట్టడం వలన గాని, మరే ఇతర టెక్నాలజీని ప్రవేశ పెట్టడం వలన కాని ఇప్పుడు 100 మంది కార్మికులు అవసరమైన చోట 50 మంది మాత్రమే సరిపోతారనుకుందాం. ఇది సోషలిస్టు వ్యవస్థలో జరిగితే అప్పుడు ఆ 100 మంది కార్మికులమీద పనిభారం సగానికి తగ్గిపోతుంది. వారికి అంతవరకూ చెల్లించిన వేతనాలు అలానే కొనసాగుతాయి. అంటే వారి తీరుబాటు సమయం పెరుగుతుంది. అదే సమ యంలో అంత వరకూ వారు పొందిన మోతాదులోనే సరుకులను ఇక ముందూ పొందగలుగుతారు. లేదా, అంతకు ముందు ఎంత సమయం పని చేస్తూ వచ్చారో, అంత సమయమూ ఇప్పుడు కూడా (అంటే, ఎ.ఐ ని ప్రవేశ పెట్టిన తర్వాత కూడా) పనిచేస్తూ వచ్చారనుకోండి. అప్పుడు వారి వేతనాలు రెట్టింపు అవుతాయి. అంటే సోషలిజంలో ఉత్పాదకత పెరుగుతున్న కొద్దీ దాని ఫలితంగా వారి తీరుబాటు సమయం కాని, ఆదాయాలు కాని పెరుగుతూ పోతాయి. వారి శ్రమకాలం అంతకు ముందు ఎంత ఉందో ఇప్పుడు కూడా అంతే ఉంటుంది.

ఎ.ఐని ప్రవేశ పెట్టడం వలన గాని, మరే ఇతర టెక్నాలజీని ప్రవేశ పెట్టడం వలన కాని ఇప్పుడు 100 మంది కార్మికులు అవసరమైన చోట 50 మంది మాత్రమే సరిపోతారనుకుందాం. ఇది సోషలిస్టు వ్యవస్థలో జరిగితే అప్పుడు ఆ 100 మంది కార్మికులమీద పనిభారం సగానికి తగ్గిపోతుంది. వారికి అంతవరకూ చెల్లించిన వేతనాలు అలానే కొనసాగుతాయి. అంటే వారి తీరుబాటు సమయం పెరుగుతుంది. అదే సమ యంలో అంత వరకూ వారు పొందిన మోతాదులోనే సరుకులను ఇక ముందూ పొందగలుగుతారు. లేదా, అంతకు ముందు ఎంత సమయం పని చేస్తూ వచ్చారో, అంత సమయమూ ఇప్పుడు కూడా (అంటే, ఎ.ఐ ని ప్రవేశ పెట్టిన తర్వాత కూడా) పనిచేస్తూ వచ్చారనుకోండి. అప్పుడు వారి వేతనాలు రెట్టింపు అవుతాయి. అంటే సోషలిజంలో ఉత్పాదకత పెరుగుతున్న కొద్దీ దాని ఫలితంగా వారి తీరుబాటు సమయం కాని, ఆదాయాలు కాని పెరుగుతూ పోతాయి. వారి శ్రమకాలం అంతకు ముందు ఎంత ఉందో ఇప్పుడు కూడా అంతే ఉంటుంది.

అదే పెట్టుబడిదారీ వ్యవస్థలోనైతే, తక్కువ మంది కార్మికులతో పని చేయించగలిగే టెక్నాలజీని ప్రవేశ పెడితే దాని ఫలితంగా వెంటనే ఉపాధి తగ్గిపోతుంది. పైన చెప్పిన ఉదాహరణనే పెట్టుబడిదారీ వ్యవస్థకు వర్తింపజేస్తే, ఇక్కడ ఎ.ఐ ని ప్రవేశపెట్టగానే, 50 మందికి ఉద్యోగాలు పోతాయి. కొత్త టెక్నాలజీని ప్రవేశ పెట్టినందుకు అయ్యే అదనపు ఖర్చు వలన తమ లాభాలు తగ్గిపోకుండా ఉండాలంటే యజమానులు అదనంగా ఉండే కార్మికులను తొలగించి తద్వారా తమ ఖర్చును తగ్గించుకుంటారు. ఇలా పనులు పోగొట్టుకున్న 50 మందీ నిరుద్యోగ సైన్యంలో కలుస్తారు. అప్పుడు మెరుగైన జీతాలు కోరుకునే కార్మికుల పోరాట శక్తి బలహీన పడు తుంది. వారి వేతనాలు పెరగవు సరికదా తగ్గే అవకాశాలు ఉంటాయి. అంటే పని భారాన్ని తగ్గించే ఏ టెక్నాలజీ అయినా పెట్టుబడిదారీ సమాజంలో ప్రవేశపెడితే దానివలన కార్మికుల పరిస్థితి మరింత దిగజారుతుంది. నిరు ద్యోగం మరింత పెరుగుతుంది. కార్మికుల నిజ వేతనాలు తగ్గుతాయి. దానికి భిన్నంగా సోషలిజంలో అదే టెక్నాలజీ వలన కార్మికుల చాకిరీ భారం తగ్గుతుంది. మానవులకు మరింత సుఖ సంతోషాలు కలుగుతాయి. అందుచేత పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎ.ఐ ప్రవేశం వలన కార్మికుల జీవితాలు నాశనం అవుతాయి.

ఇదేదో 19వ శతాబ్దం నాటి మొరటు కార్మిక పోరాటపు వాదనగా ముందు అనిపించవచ్చు. 19వ శతాబ్దంలో జౌళి పరిశ్రమల్లో యంత్రాలను ప్రవేశ పెట్టినప్పుడు దాని కారణంగా తమ ఉద్యోగాలు పోతాయని ఆ యంత్రాలను ధ్వంసం చేయడానికి కార్మికులు పూనుకున్నారు. ఆ ఉద్యమకారులను "లుడ్డైట్స్" అంటారు. వారి వాదన అంతా యంత్రాల ప్రవేశం వలన తమ ఉద్యోగాలు పోతున్నాయనే. ఆ వాదనలో పొరపాటు ఏమిటి? యంత్రాల ప్రవేశంతో వారి ఉద్యోగాలు పోయిన మాట వాస్తవమే కదా?అయితే



వారి ఉద్యోగాలు పోయినది పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆ యంత్రాలను ప్రవేశపెట్టడం వలన తప్ప యంత్రాల వలన కాదు. పెట్టుబడిదారీ సమాజపు లోపాన్ని వారు టెక్నాలజీ లోపంగా చూశారు. అంతే తప్ప ఉద్యోగాలు కోల్పోరాదన్న వారి వాదనలో తప్పేమీ లేదు. నిజానికి పెట్టుబడిదారీ వ్యవస్థలో కొత్త టెక్నాలజీ వస్తే అదనపు ఉద్యోగాలు వస్తాయని వాదించేవారిదే తప్పుడు వాదన.

అలా కొత్త టెక్నాలజీ ద్వారా అదనపు ఉద్యోగాలు కలుగుతాయని వాదించిన ఆర్థికవేత్తలలో డేవిడ్ రికార్డో ముఖ్యుడు. వేతనాలు ఎప్పుడూ స్థిరంగా, జీవించేందుకు సరిపోయేలా ఉంటాయని భావిస్తూ, అటువంటి స్థితిలో కొత్త టెక్నాలజీని ప్రవేశపెడితే కొందరి ఉద్యోగాలు వెంటనే పోతాయని, అయితే పెట్టుబడిదారుల లాభాలు బాగా పెరుగుతాయని, అలా పెరిగిన లాభాలను పెట్టుబడిదారులు మళ్ళీ పెట్టుబడి రూపంలో పెడ తారని, అప్పుడు చాలా కొత్త ఉద్యోగాలు వస్తాయని, అలా వచ్చే కొత్త ఉద్యోగాలు అంతకు ముందు కోల్పోయిన ఉద్యోగాలకన్నా ఎక్కువ సంఖ్యలో ఉంటాయని రికార్డో వాదించాడు. ఆ విధంగా కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టడం వలన ఉత్పత్తి రేటు, ఉపాధి రెండూ పెరుగుతాయని అతడు భావించాడు. అంటే కొత్త టెక్నాలజీని ప్రవేశ పెట్టిన ఫలితంగా ఏర్పడే నిరుద్యోగం తాత్కాలికమేనని, ఆ తర్వాత వచ్చే కొత్త ఉపాధి అవకాశాలు అంతకన్నా చాలా ఎక్కువగా ఉంటాయని రికార్డో అభిప్రాయపడ్డాడు.

ఈ రోజుకీ యజమానులు, ప్రభుత్వాలు ఇదే వాదనను ఉపయోగిస్తున్నాయి. కార్మిక సంఘాలు తమ ఉపాధి అవకాశాలను దెబ్బతీసే కొత్త టెక్నాలజీని వ్యతిరేకించిన ప్రతీసారీ ఇదే వాదనతో యజమానులు కార్మికుల డిమాండ్లను తిరస్కరిస్తున్నారు. రికార్డో వాదన అంతా కొత్త టెక్నాలజీ కేవలం ఒక్కసారి మాత్రమే ప్రవేశ పెడతారన్నట్టు, దాని వలన కలిగే తాత్కాలిక నిరుద్యోగం కొంతకాలంలో సర్దుకుపోయి అదనపు ఉద్యోగాలు కూడా వస్తాయన్నట్టు ఉంది. కాని కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టడం అనేది మానవ సమాజంలో నిరంతరం కొనసాగే ప్రక్రియ. దాని వలన ప్రతీ సందర్భంలోనూ ఉద్యోగాలు కోల్పోవడం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థలో జరుగుతూనే వుంటుంది. అందుచేత ఏ సమయంలో చూసుకున్నా కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టేముందు ఉన్న ఉద్యోగాల కన్నా ఆ ప్రవేశం తర్వాత ఉండే ఉద్యోగాలు ఎప్పుడూ తక్కువే.

అంతకన్నా ముఖ్యమైనది మరొకటి ఉంది. పెట్టుబడిదారుడు తాను ఉత్పత్తి చేసే సరుకులకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది అన్నప్పుడే అదనంగా పెట్టుబడి పెడతాడు. కొత్త టెక్నాలజీని తెచ్చి దాని వలన తన ఉత్పత్తి ఖర్చు తగ్గిపోయింది గనుక, లాభాలు పెరుగుతాయి గనుక అదనంగా పెట్టుబడి పెట్టాలని అనుకోడు. అలా అదనంగా పెట్టే పెట్టుబడితో ఉత్పత్తి అయ్యే అదనపు సరుకును కొనుగోలు చేయగలిగిన అదనపు డిమాండ్ మార్కెట్‌లో ఉన్నప్పుడే ఆ అదనపు పెట్టుబడి పెట్టడానికి ముందుకొస్తాడు.

కొత్త టెక్నాలజీ ప్రవేశిస్తే వెంటనే ఉన్న ఉద్యోగాలు తగ్గుతాయన్నది రికార్డో సైతం అంగీకరించిన విషయం. జీతాలు ఎప్పుడూ బతకడానికి సరిపోయే స్థాయిలోనే కొనసాగుతాయన్నది కూడా అతడు చెప్పినదే. కొత్త టెక్నాలజీ వచ్చిన ఫలితంగా ఉద్యోగాలు తగ్గినప్పుడు మార్కెట్‌లో ఉండే కొనుగోలుశక్తి ఆ మేరకు తగ్గుతుంది. తక్కువ మంది కార్మికులతో పని చేయించుకున్నందు వలన పెట్టుబడిదారుల లాభాలు పెరుగు తాయి. అలా అదనంగా వారికి వచ్చే లాభాలను వారు దాచుకుంటారు తప్ప వారి వినిమయం ఏమీ పెరగదు. పైగా కొత్త టెక్నాలజీ ప్రవేశం ఫలితంగా ఉద్యోగాలు తగ్గిపోయాయి గనుక మార్కెట్‌లో ఉండే డిమాండ్ తగ్గుతుంది. దానికి తగినట్టు పెట్టుబడిదారులు ఉత్పత్తిని తగ్గించుకుంటారు తప్ప పెంచరు. అందుచేత రికార్డో ఊహించినట్టు అదనపు పెట్టుబడీ రాదు, అదనపు ఉపాధీ రాదు.

కొత్త టెక్నాలజీ ప్రవేశంతో కార్మికుల ఉద్యోగాలు తగ్గిపోతాయన్న కార్మికుల పాత కాలపు వాదన ఇప్పటికీ చెల్లుతుంది.

అయితే మరి యూరప్‌లో కొత్త టెక్నాలజీ ప్రవేశపెట్టినప్పుడు ఉపాధి అవకాశాలు ఎందుకు ప్రతీసారీ పెరుగుతూ వచ్చాయి? మొదటి కారణం: యూరప్ ఖండం నుంచి భారీ స్థాయిలో తెల్లవాళ్లు ఉష్ణ మండల ప్రాంతాలకు వలసలు పోయారు. అక్కడి స్థానికులను వారి వారి భూముల నుండి వెళ్లగొట్టి ఆక్రమించుకున్నారు. అందుచేత యూరప్‌లో కార్మికులకు డిమాండ్ ఎప్పుడూ ఉంటూ వచ్చింది. దాని ఫలితంగా అక్కడ కార్మికులు తమ జీతాలను పెంచుకోగలిగారు. 19వ శతాబ్దంలో ఐదు కోట్ల మంది ప్రజలు కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా దేశాలకు వలస వెళ్లారు.


రెండవది: కొత్త టెక్నాలజీతో యూరప్‌లో ఉత్పత్తి అయిన సరుకులను ఇంకా పెట్టుబడిదారీ దశ పెరగని వెనుకబడిన వలస దేశాలలోకి దింపి అక్కడి మార్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అదనపు మార్కెట్ వలన యూరప్‌లో అదనపు ఉద్యోగాలు వచ్చాయి. కాని అంతకు మించిన సంఖ్యలో భారతదేశం, చైనా తదితర వలస దేశాల్లో చేతివృత్తుల మీద జీవించే ప్రజలు ఉపాధి కోల్పోయారు. ఒక విధంగా, యూరప్ తన దేశంలోని నిరుద్యో గాన్ని తాను ఆక్రమించుకున్న దేశాల మీదకు నెట్టివేసింది. ఆ దేశాల్లో పరిశ్రమలు నాశనం అయ్యాయి.

సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కొత్త టెక్నాలజీని ప్రవేశ పెట్టినప్పుడు కలిగే నిరుద్యోగ సమస్యను ఆ విధంగా ఇతర దేశాల మీదకు నెట్టివేసి తమ తమ పెట్టుబడిదారీ వ్యవస్థలను వారు భద్రంగా కాపాడు కోగలిగారు. ఆ వలసలు విముక్తి పొంది స్వతంత్ర దేశాలుగా మారిన తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థలో కీన్స్ విధానాలను అనుసరించారు. ప్రభుత్వ వ్యయాన్ని పెంచి దాని ద్వారా అదనపు ఉపాధి అవకాశాలను కల్పించే ప్రయత్నం చేశారు. కాని నయా ఉదారవాద విధానాలు చేపట్టాక ప్రభుత్వ వ్యయాన్ని పెంచి ఉద్యోగాలను కల్పించడం అనేదానికి అవకాశం లేకుండా పోయింది. అందుకే ఇప్పుడు ఆ సంపన్న పెట్టుబడిదారీ దేశాలతో సహా పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తం మీద నిరుద్యోగం అతి పెద్ద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో ఎ.ఐ ని ప్రవేశపెడితే ఉద్యోగులకు, కార్మికులకు అది పెనుముప్పు కాగలదు. ఈ ముప్పును నివారించడానికి సము చితమైన రీతిలో డిమాండ్లను రూపొందించుకుని కార్మికవర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సమాయత్తం కావాలి.

సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కొత్త టెక్నాలజీని ప్రవేశ పెట్టినప్పుడు కలిగే నిరుద్యోగ సమస్యను ఆ విధంగా ఇతర దేశాల మీదకు నెట్టివేసి తమ తమ పెట్టుబడిదారీ వ్యవస్థలను వారు భద్రంగా కాపాడు కోగలిగారు. ఆ వలసలు విముక్తి పొంది స్వతంత్ర దేశాలుగా మారిన తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థలో కీన్స్ విధానాలను అనుసరించారు. ప్రభుత్వ వ్యయాన్ని పెంచి దాని ద్వారా అదనపు ఉపాధి అవకాశాలను కల్పించే ప్రయత్నం చేశారు. కాని నయా ఉదారవాద విధానాలు చేపట్టాక ప్రభుత్వ వ్యయాన్ని పెంచి ఉద్యోగాలను కల్పించడం అనేదానికి అవకాశం లేకుండా పోయింది. అందుకే ఇప్పుడు ఆ సంపన్న పెట్టుబడిదారీ దేశాలతో సహా పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తం మీద నిరుద్యోగం అతి పెద్ద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో ఎ.ఐ ని ప్రవేశపెడితే ఉద్యోగులకు, కార్మికులకు అది పెనుముప్పు కాగలదు.

(స్వేచ్ఛానుసరణ)

దృశ్యం



రెటీనాపై ఏదో
రెక్కలిప్పి వాలుతున్న దృశ్యం
చూపుల కాంతిపుంజాలనడ్డగిస్తూ
పొరలు పొరలుగా పాకుతున్న దృశ్యం

వెన్నెల వెలుగులను
చీకటి మబ్బేదో చెరబడుతున్న దృశ్యం
మెదడు సెన్సింగ్ న్యూరాన్లను
మార్మిక భ్రమ ఏదో మాయచేస్తున్న
దృశ్యం

భావం అభావంగా ఏదో
మంచులా కరిగిస్తున్న దృశ్యం
వాస్తవావస్తవాల దృగ్విషయాలనేదో
తలకిందులు చేస్తున్న దృశ్యం

జనారణ్య చైతన్య దేహాలనేదో
శకలాలు శకలాలుగా నరుకుతున్న
దృశ్యం
భయపీడన నిప్పుల జలపాతమేదో
నిలువెల్లా దహిస్తున్న దృశ్యం

పరిపాలన వక్రరేఖ ప్రాకారాల నడుమ
ప్రజాస్వామ్య గోపురమేదో
తగులబడుతున్న దృశ్యం
రాక్షస రహస్యోన్మాద హింస ఏదో
రాజ్యాన్ని ఆక్రమిస్తున్న దృశ్యం

భావస్వేచ్ఛ పక్షినేదో
పవర్ గన్ను నేలగూల్చుతున్న దృశ్యం
గోడలేని జైలు ఏదో విస్తరిస్తూ
జనం గొంతు నొక్కుతున్న దృశ్యం

రాజ్యం రాజకీయ క్రీనీడలో
రాబందుల గుంపేదో తిరుగాడుతున్న
దృశ్యం
సమిష్టి శ్రమ సంపద సౌధాలనేదో
సర్వం స్వాహా చేస్తున్న దృశ్యం

అంతటా అదే అదృశ్యంకాని దృశ్యం
అహం బ్రహ్మోస్మీ అంటూ
అన్నిటినీ కబళిస్తూ ఆక్టోపస్ లా
విస్తరిస్తున్న యదార్థ దృశ్యం

భయోత్పాత ప్రకంపనల మధ్య
బిగుసుకున్న పిడికిళ్లలో సూర్యరశ్మి
వేల వేల రూపాలలో ఇక
విచ్చుకోక తప్పదు
విశృంఖల విధ్వంస విపత్తు దృశ్యమిక
భస్మీపటలమై అదృశ్యం కాకతప్పదు

- వేల్పుల నారాయణ
9440433475

మణిపూర్ మంటలు ఇంకెన్నాళ్లు?



కె. శాంతారావు
9959745723

మనిషి చనిపోయి కట్టెయ్యాక ఒకేసారి కాలుతాడు. కానీ బతికుండగానే క్షణక్షణం చితిమంటల్లో కాలడం ఎంత నరకం? రావణకాష్టంలా రగులుతున్న మణిపూర్ రాష్ట్రాన్ని, ఆ రాష్ట్ర ప్రజానీకాన్ని తలచుకుంటేనే భయం కలుగుతుంది. ఈ మంటలింక ఎన్నాళ్లు?

ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ ఇటీవలి "హెచ్చరికలు"! అల్లర్లతో అతలాకుతలమవుతున్న మణిపూర్ సమస్యను తొలుత పరిష్కరించాలని మోడీ ప్రభుత్వానికి "సూచించారు". నేతలు అహంకారరహితంగా ప్రజాసేవలో నిమగ్నం కావాలని, సభ్యతను, హుందాను మరచి ఒకర్నొకరు విమర్శించుకునే తీరు సమాజాన్ని రెండు వర్గాలుగా చీల్చుతుందని, పరస్పర అవిశ్వాసాన్ని కలిగిస్తుందని హితవచనాలు పలికారు. ఏడాదికాలంగా మణిపూర్ శాంతికోసం ఎదురు చూస్తున్నదన్నారు.

ఆ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మణిపూర్ రాష్ట్ర ఉన్నతస్థాయి భద్రతా సమావేశం ఇటీవల ఢిల్లీలో నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ హాజరుకాకపోవటం వైచిత్రి. ఆ రాష్ట్రం నుండి ఎన్నికైన పార్లమెంటు సభ్యునికైతే ఆహ్వానమే లేదు. రాష్ట్రంలోని మెయితీ - కుకీ జాతుల మధ్య ఘర్షణ నివారణ కోసమే ఈ సమావేశం ఉన్నత భద్రతాధికారులతో జరిగినట్టు షా చెప్పుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కులదీప్‌సింగ్ సమావేశానికి అధ్యక్షత వహించారు.

'అసలు కేంద్ర ప్రభుత్వం మణిపూర్‌ను ప్రతీకారేచ్ఛతో ఓ అస్థిత్వం లేని పరాయి రాష్ట్రంగా చూస్తున్నదని' ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీ. బిమల్ అకోయ్‌జమ్ విమర్శిస్తున్నారు. ఢిల్లీ సమావేశం అంతా షా నేతృత్వంలో సాగిన జరిగిన సైనిక (భద్రతా) అధికారుల తంతుగా ఆయన అభివర్ణించారు. ఆ సమావేశానికి స్థానిక ఎంపీనైన తనకూ ఆహ్వానం లేదు. ముఖ్యమంత్రీ పాల్గొనలేదు. రాష్ట్ర ప్రజా ప్రతినిధులు పాల్గొనని ఆ సమావేశం అప్రజాస్వామ్యం కాదా? అని ప్రశ్నించారు. "రెండు ప్రజా సమూహాలు (జాతులు) మధ్య వైరం ఉన్నప్పుడు ఓ సమూహాన్నే నేరస్తులుగా, అను మానితులుగా పరిగణించడం ఘోరం కాదా? ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మౌనం కూడా సందేహాస్పదంగా ఉన్నది. చూస్తుంటే ఇదేదో కుట్రలా కనపడుతున్నది. సమావేశం కేంద్రపాలిత ప్రాంతం జమ్ము కాశ్మీర్‌ది మాదిరిగా నడిచింది. అక్కడ లెఫ్టినెంట్ జనరల్ ఉంటాడు. ఇక్కడ ఉండడు అంతే తేడా. కానీ 'మాకిక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అంతర్గత శాంతి భద్రతల అంశం రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత. కేంద్రం ఈ విషయాలను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఒంటెత్తు పోకడతో వ్యవహరిస్తున్నది. తన సైనిక కండకావరాన్ని చూపడానికి సిద్ధమవుతున్నది. ఇది నిరంకుశ పోకడ కాదా? దీనిని దేశ ప్రజలంతా గమనించాలి.' అని బిమల్ విజ్ఞప్తి చేశారు.

ఏ కారణం రీత్యా సమావేశం జరిగినా ఆ సమావేశం సైనిక బలంతోనే శాంతిని నెలకొల్పాలనే దురుద్దేశ్యమే అవగతమవుతుంది. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేవారు, విద్వేషమంటలను ఎందుకు చల్లార్చుతారు? అనే ప్రశ్న లేకపోలేదు. శాంతిని నెలకొల్పడం అంటే ఆయుధబలంతోనే అనేది వారి స్వభావంలోనే ఉన్నప్పుడు ఉత్పన్నమవుతున్న పరిస్థితి ఇది.

మణిపూర్ రాష్ట్రంలో అశాంతిని కట్టడి చేయడంలో విఫలమయ్యామని లోక్‌సభ ఎన్నికల తర్వాత సాక్షాత్తు ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఒప్పుకున్నారు కూడా. మణిపూర్‌లో మెజారిటీ వర్గమైన మెయితీలకు షెడ్యూల్ తెగల హోదా ఇవ్వాలన్న అసందర్భ డిమాండే మారణహోమానికి మూల కారణమని అక్కడ ప్రతి ఒక్కరికి తెలిసిందే. ఆ డిమాండ్‌కు నిరసనగా కొండ ప్రాంతంలోని ఆదివాసులు అందరూ పెద్ద ఎత్తున సంఘీభావ ర్యాలీ చేపట్టారు. గతేడాది మే 3వ తేదీ నుండి ఘర్షణలు అలా చెలరేగాయి. అప్పటినిండి ఈ కార్చిచ్చు రగులుతూనే ఉంది. అటు కేంద్రం - ఇటు రాష్ట్రం డబుల్ ఇంజన్ సర్కార్ స్వార్థపూరిత ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలతో ఈ అగ్నికి ఆజ్యం పోసిందే తప్ప మానవీయతకు రవ్వంత విలువనివ్వలేదు. గడిచిన ఈ 400 రోజుల్లో 220 మందికి పైగా అమాయకులు బలైపోయారు. దాదాపు 60 వేల మంది కొంపాగోడు వదిలి ఎక్కడెక్కడో వెళ్లి తలదాచు కున్నారు. అనేక మంది నిరాశ్రయులయ్యారు. వేలమంది చిన్నారులు బడులకు పోలేక చదువులకు దూరమయ్యారు.

మయన్మార్ నుంచి అక్రమంగా ప్రవేశించిన చొరబాటుదారులే ఈ ఘర్షణలకు మూలమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాదిస్తున్నాయి. ఎందుకంటే మయన్మార్ వలసదారులు, మణిపూర్ కొండ ప్రాంతాల్లో నివసించేవారు ఒకే కుకీ జాతికి చెందినవారు. ప్రభుత్వాలు, మైదాన ప్రాంత మెయితీ జాతికి కొమ్ము కాస్తున్నాయి. ఇప్పటికీ ఇదే పరిస్థితి.ఇదే భావన కాంగ్రెస్ ఎంపీ బిమల్ వ్యక్తం చేస్తున్నాడు. ఈ పక్షపాత ధోరణే శాంతికి భగ్నమని విమర్శిస్తున్నాడు. అయినవారికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో వడ్డించడం ఇంకెంతమాత్రం చెల్లదంటున్నాడు.

ఒకప్పుడు ఈశాన్య రాష్ట్రాల్లో అత్యధిక తలసరి ఆదాయంతో తులతూగిన మణిపూర్, ఈ ఘర్షణల కారణంగా అత్యల్ప మూడో తలసరి ఆదాయం గల రాష్ట్రంగా దిగజారింది. ఒక పక్క నానాటికి బతుకు దుర్భరమవు తున్నది. మరోపక్క ఎప్పుడు ఏ వైపు నుండి ఏక్షణాన ఘర్షణ కమ్ముకొస్తుందేమోననే భయం. అస్సాం సరిహద్దుగల ప్రాంతం జికోబామ్ జిల్లాలో సాక్షాత్తు ముఖ్యమంత్రి సెక్యూరిటీ కాన్వాయ్‌తో తాజాగా దాడులు జరిగాయి. దాంతో వేలాది మంది ప్రజానీకం అసోంకి తరలిపోయారు. ఇప్పుడు మణిపూర్ సమస్య మణిపూర్‌కే పరిమితం కాలేదు. సరిహద్దు రాష్ట్రాలకూ పాకింది.

అటు కేంద్రం - ఇటు రాష్ట్రం డబుల్ ఇంజన్ సర్కార్ స్వార్థపూరిత ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలతో ఈ అగ్నికి ఆజ్యం పోసిందే తప్ప మానవీయతకు రవ్వంత విలువనివ్వలేదు. గడిచిన ఈ 400 రోజుల్లో 220 మందికి పైగా అమాయకులు బలైపోయారు. దాదాపు 60 వేల మంది కొంపాగోడు వదిలి ఎక్కడెక్కడో వెళ్లి తలదాచుకున్నారు. అనేక మంది నిరాశ్రయులయ్యారు.

ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ స్పందించకపోవడం మిలియన్ డాలర్‌ల ప్రశ్న. మూడోసారి ప్రధాని అయ్యాక కూడా దేశ విదేశాలు పర్యటిస్తున్నారు కానీ, మణిపూర్ వెళ్లరు. మణిపూర్ గురించి మాట్లాడరు. ఎన్నికల ప్రచారంలో కూడా 'అశ్వద్ధామ హత: - కుంజరహా' అన్నట్టు అక్కడ మణిపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వ యత్నాలు - కేంద్రం జోక్యంతో పరిస్థితి మెరుగైనట్టు చెప్పారు అంతే.

అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును ఎండగడుతూ. ఆ రాష్ట్ర ప్రజానీకం రెండూ ఎంపీ సీట్లలోనూ కాంగ్రెస్‌కే పట్టంగట్టారు. కాగా కేంద్ర ప్రభుత్వ గోడీ మీడియా ఎప్పటికప్పుడు మణిపూర్ పరిస్థితిని బాహ్య ప్రపం చానికి దాచిపెట్టినా, సత్యం, అహింస, ప్రజాస్వామ్యకాంక్షా ప్రియుల వలనే సోషల్ మీడియా ద్వారా వాస్తవాలు బయటకు వస్తున్నాయి. కేవలం కపటత్వంతో, ఆయుధబలంతో శాంతిని నెలకొల్పాలనుకోవడం మూర్ఖత్వం. ప్రజలు తమకు అవసరమైన శాంతి సామరస్యాలను ఉద్యమాల ద్వారా తప్పక సాధించుకుంటారు. ప్రజలే చరిత్ర నిర్మాతలు అన్న విషయం తెలిసిందే కదా!



ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ స్పందించకపోవడం మిలియన్ డాలర్‌ల ప్రశ్న. మూడోసారి ప్రధాని అయ్యాక కూడా దేశ విదేశాలు పర్యటిస్తున్నారు కానీ, మణిపూర్ వెళ్లరు. మణిపూర్ గురించి మాట్లాడరు. ఎన్నికల ప్రచారంలో కూడా 'అశ్వద్ధామ హత: - కుంజరహా' అన్నట్టు అక్కడ మణిపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వ యత్నాలు - కేంద్రం జోక్యంతో పరిస్థితి మెరుగైనట్టు చెప్పారు అంతే.

పాడి రైతుల ఆందోళన

- హైదరాబాద్ -శ్రీశైలం ప్రధాన రహదారిపై రాస్తారోకో..
- రెండు నెలలుగా బిల్లుల పెండింగ్



నవతెలంగాణ -కల్వకుర్తి

రెండు నెలలుగా పెండింగ్ ఉన్న పాల బిల్లులు చెల్లించాలంటూ రైతులు ఆందోళనకు దిగారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని తాండ్ర గేటు వద్ద హైదరాబాద్- శ్రీశైలం ప్రధాన రహదారిపై పాడి రైతులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. విజయ డెయిరీ నిర్వాహకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక్కో రైతుకు దాదాపు రూ.50 వేలకు పైగానే బిల్లులు రావాల్సి ఉందని పలువురు రైతులు వాపోయారు. బిల్లులు వెంటనే చెల్లించకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. చివరకు పోలీసు ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. వెంటనే బిల్లులు చెల్లించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాండ్ర, కొ్ట్ర, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాల పాడి రైతులు పాల్గొన్నారు.

చిన్నారిపై బాలుడు లైంగికదాడికి యత్నం

- ఫోక్సో కేసు నమోదు



నవ తెలంగాణ-రాయపోల్

ప్రతిరోజూ చిన్నారిని ఆడిస్తూ ఉండేవాడే ఎదురింటి బాలుడు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ చిన్నారిపై లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో ఆదివారం సాయంత్రం జరిగింది. దౌల్తాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన బాలుడు (16) వారి ఇంటి ముందు ఉండే చిన్నారి (5)ని ప్రతిరోజూ ఎత్తుకొని ఆడిస్తుండేవాడు. ఆ చిన్నారి కూడా వాళ్ల ఇంటికి.. వీళ్ళ ఇంటికి ఆడుతూ పాడుతూ తిరుగుతుండేది. కాగా, ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ బాలుడు.. చిన్నారిపై లైంగికదాడికి పాల్పడుతుండగా.. గమనించిన చిన్నారి బంధువు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బాలుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం చిన్నారి తండ్రి దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యయత్నం

- రైల్వే వంతెన పైనుంచి దూకి..




నవతెలంగాణ-ఘట్కేసర్

రైల్వే వంతెనపై నుంచి దూకి ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా, దేవరుప్పల మండల కేంద్రానికి చెందిన బాషపాక బుచ్చయ్య కుమార్తె నాగమణి(19) ఘట్కేసర్‌లోని ఓ ప్రయివేటు హాస్టల్‌లో ఉంటోంది. అవుషాపూర్ విజ్ఞానభారతి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నది. ఆదివారం బయటకు వెళ్తున్నానని హాస్టల్ నిర్వాహకులకు చెప్పి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో హాస్టల్ నిర్వాహకులు పలుమార్లు ఫోన్ చేయగా రాత్రికి తన ఫ్రెండ్ వాళ్ల ఇంట్లో ఉంటానని చెప్పింది. అయితే, అదేరోజు తల్లిదండ్రులు ఫోన్ చేస్తే.. హాస్టల్లోనే ఉన్నానని చెప్పింది. సోమవారం ఉదయం కూడా హాస్టల్‌కు రాకపోవడంతో నిర్వాహకులు విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి.. మీ అమ్మాయి ఇంకా హాస్టల్‌కు రాలేదని సమాచారం ఇచ్చారు. దాంతో తల్లిదండ్రులు నాగమణికి ఫోన్ చేసి త్వరగా హాస్టల్‌కు వెళ్లాలని మందలించారు. ఆందోళనకు గురైన విద్యార్థిని బైపాస్ రోడ్డులోని రైల్వే వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు గమనించి ఆమెను వెంటనే ఘట్కేసర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి చేరుకున్న పోలీసులు ఆమె కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తన భూమిని మరొకరి పేర పట్టా..

- తనకు పట్టా చేయాలని రైతు ఆత్మహత్యాయత్నం
- జనగామ కలెక్టరేట్‌లో ఘటన



నవ తెలంగాణ - జనగామ కలెక్టరేట్

మరొకరి పేరిట ఉన్న తన వ్యవసాయ భూమిని తనకు పట్టా చేయాలని పలు మార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ తన సమస్య పరిష్కారం కావడం లేదన్న మనస్తాపంతో ఓ యువ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం జనగామ కలెక్టరేట్‌లో జరిగింది. జనగామ మండలం పసరమడ్ల గ్రామానికి చెందిన నిమ్మల నర్సింగరావు (29) అనే యువరైతు తన వ్యవసాయ భూమిని తన పేరిట పట్టా చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా అధికారుల నుంచి నిర్లక్ష్యమైన సమాధానం ఎదురయింది. దాంతో తీవ్ర కలత చెంది కలెక్టరేట్ భవనం పైకి ఎక్కి బ్యానర్ కట్టి మరీ వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన ప్రజలు, పోలీసులు, అధికారులు అతన్ని కిందికి దింపి వెంటనే జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా, నర్సింగరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం ఇది మూడోసారి. గతంలోనూ రెండుసార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అనంతరం ఇలాగే కలెక్టరేట్‌లో ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్టు స్థానికులు గుర్తుచేశారు. కాగా, గతంలో నిమ్మల నర్సింగరావు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సమయంలో అప్పటి కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ భాస్కరరావు.. ప్రజావాణి నిర్వహించే సమయంలో ప్రతి సోమవారం కలెక్టరేట్ భవనం పైకి ఎవరూ ఎక్కకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత పరిస్థితులు సాధారణంగా ఉండటంతో ఆ విషయాన్ని అంతా మర్చిపోయారు. మరోసారి రైతు ఆత్మహత్యాయత్నం చేయడంతో కలెక్టరేట్ రక్షణ బాధ్యత ఎవరిదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

బీజేపీ ఏజెంట్‌గా మందకృష్ణ ముత్తినేని వీరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ బీజేపీకి ఏజెంట్‌గా మారారని కాంగ్రెస్ వికలాంగుల విభాగం చైర్మెన్, వికలాంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు.వికలాంగుల జాతిని బీజేపీకి తాకట్టు పెట్టొద్దని కోరారు. సోదరి రజినీకి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఉద్యోగాన్ని కించపర్చడం అనైతికమని విమర్శించారు. వికలాంగులను ప్రభుత్వానికి వ్యతిరేకం చేయటమే మంద కృష్ణ ఉద్దేశమని తెలిపారు. దీని వల్ల మీరు లబ్దిపొంది, వారికి నష్టం చేయాలనుకుంటున్నారా? అని ఆయన్ను ప్రశ్నించారు. స్వార్థ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం వికలాంగులను వాడుకోవద్దని సూచించారు. చిత్తశుద్ధితో ధర్నా చేయాలనుకుంటే..కిషన్‌రెడ్డి ఇంటి ముందు చేయాలని కోరారు. అంతే తప్ప వికలాంగుల మధ్య చిచ్చుపెట్టొద్దని మందకృష్ణకు ముత్తినేని సూచించారు.

అమ్మాయిలదే పైచేయి

- ఫస్టియర్‌లో 63.86 శాతం, సెకండియర్‌లో 43.77 శాతం ఉత్తీర్ణత
- ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను సోమవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా విడుదల చేశారు. గతనెల 24 నుంచి ఈనెల మూడో తేదీ వరకు ఈ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ కేటగిరీ నుంచి 2,54,498 మంది పరీక్షలు రాయగా, 1,62,520 (63.86 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 1,06,484 మంది ఇంప్రూవ్‌మెంట్, 56,036 మంది ఇంప్రూవ్‌మెంట్ రాయని వారున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో వార్షిక ఫలితాలతో కలిపితే 3,18,967 (74.1 శాతం) మంది పాసయ్యారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో 1,17,249 మంది అమ్మాయిలు పరీక్షలకు హాజరుకాగా, 82,374 (70.26 శాతం) ఉత్తీర్ణత పొందారు. 1,37,249 మంది అబ్బాయిలు పరీక్షలు రాయగా, 80,146 (58.39 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. అబ్బాయిల కన్నా అమ్మాయిలు 11.71 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్ కేటగిరీలో 18,913 మంది పరీక్ష రాస్తే, 10,070 (53.24 శాతం) మంది పాసయ్యారు. వారిలో ఇంప్రూవ్‌మెంట్ వారు 1,633 మంది, ఇంప్రూవ్‌మెంట్ కానివారు 8,437 మంది ఉన్నారు. వార్షిక ఫలితాలతో కలిపితే ఒకేషనల్‌లో 32,191 (66.63 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ కేటగిరీలో 1,38,477 మంది పరీక్షలు రాయగా, 60,615 (43.77 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. వార్షిక ఫలితాలతో కలిపితే 3,54,242 (76.69 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. సప్లిమెంటరీ ఫలితాల్లో 54,007 మంది అమ్మాయిలు పరీక్షలు రాస్తే, 25,673 (47.54 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 84,470 మంది అబ్బాయిలు పరీక్షలు రాయగా, 34,942 (41.37 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలోనూ అబ్బాయిల కన్నా అమ్మాయిలు 6.17 శాతం మంది అధికంగా పాసయ్యారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అమ్మాయిలే పైచేయి సాధించారు. ఫలితాల కోసం విద్యార్థులు https://tgbie.cgg.gov.in, http://results.cgg.gov.in వెబ్‌సైట్లను సంప్రదించాలని అధికారులు సూచించారు. సోమవారం నుంచే ఆన్‌లైన్‌లో మార్కుల మెమోలను తీసుకోవాలనీ, మంగళవారం నుంచి కాలేజీ లాగిన్ ఐడీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాని కోరారు. వాటిలో ఏమైనా తప్పులుంటే పదిరోజుల్లో దరఖాస్తు చేయాలని తెలిపారు.

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తు గడువు 29

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం మంగళవారం నుంచి దరఖాస్తు చేయాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా పేర్కొన్నారు. వాటి సమర్పణకు తుది గడువు ఈనెల 29 వరకు ఉందని సూచించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో జనరల్ కేటగిరీలో 85.29 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. 44.38 శాతం ఉత్తీర్ణతతో కామారెడ్డి జిల్లా అట్టడుగు స్థానంలో ఉందని వివరించారు.

ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జనరల్ కేటగిరీలో 81.47 శాతం ఉత్తీర్ణత సాధించి ములుగు జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా, 31.95 శాతం ఉత్తీర్ణతతో హైదరాబాద్-3 జిల్లా చివరిలో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి (సీవోఈ) జయప్రదబాయి, జాయింట్ సెక్రెటరీలు శ్రీనివాస్, భద్రసేన్, భీంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల వివరాలు

ఏడాది	మార్చిలో విద్యార్థుల హాజరు	ఉత్తీర్ణత	శాతం	సప్లిమెంటరీకి హాజరు	ఉత్తీర్ణత	శాతం	మొత్తం ఉత్తీర్ణత	శాతం
ప్రథమ సంవత్సరం (జనరల్ కేటగిరీ)								
2022	414380	268869	65	220560	149324	68	317535	76
2023	433082	272280	63	252055	157741	63	317802	73
2024	430313	262829	60	254498	162520	64	318967	74
ద్వితీయ సంవత్సరం (జనరల్ కేటగిరీ)								
2022	398453	270956	68	102256	48744	48	319700	81
2023	419267	265584	63	129494	59669	46	325253	78
2024	455673	293596	64	138477	60615	44	354242	77

'డబుల్' ఇండ్లను అప్పగించండి

- తాగునీరు, కరెంట్ సౌకర్యాలు కల్పించాలి
- కేంద్రం వాటా నిధులను విడుదల చేయాలి : సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్
- జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్దిదారులకు వెంటనే అప్పగించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ లిబర్టీలోని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గత ప్రభుత్వం ఓట్ల కోసం ఎన్నికల ముందు ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ మధ్యకాలంలోనే లబ్దిదారులకు కేటాయించిందని తెలిపారు. కానీ వాటిని వారికి అప్పగించలేదన్నారు. కేటాయించిన ఇండ్లను లబ్దిదారులకు అందజేయాలని ఎన్ని సార్లు ధర్నాలు చేసినా గత ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇండ్ల సముదాయాల్లో తాగునీరు, కరెంట్, రోడ్డు సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. డబుల్ బెడ్‌రూమ్స్ వద్ద లిఫ్టులు పనిచేయడం లేదని, ఆ ఇండ్లలో నివసించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా.. డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల వద్ద ఎలాంటి పనులూ చేయలేదని తెలిపారు.

ఇండ్ల సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు రూ.600కోట్లు అవసరమవుతాయని జీహెచ్‌ఎంసీ కమిషనర్ సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా ఇండ్ల సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వాటా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఇండ్లలోకి వెళ్లేందుకు అన్ని సదుపాయాలను కల్పించాలని కోరారు.

సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం లబ్దిదారులను ఎంపిక చేశారని, కొందరికి ఇంటి తాళాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా వారు మాత్రం ఇండ్లలోకి వెళ్లకుండా అక్కడ సెక్యూరిటీ గార్డులు అడ్డుకుంటున్నారని తెలిపారు. లబ్దిదారుల సమస్యలను అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి లబ్దిదారులకు ఇండ్లను స్వాధీనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు మహేందర్, కేఎస్ రాజన్న, కె.నాగలక్ష్మి, నాయకులు ఆర్.వెంకటేశ్, ఎం.అజయ్ బాబు, ఆర్.అశోక్, జీ.కిరణ్, జీ.నరేష్‌తోపాటు డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సమస్యల వలయంలో జూడాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిర్దేశిత సమయంలో ఉపకారవేతనాల విడుదల, పెండింగ్ స్టైపెండ్ విడుదల, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లకు గతంలో ఒప్పుకున్న మేరకు స్టైపెండ్, ఆంధ్రప్రదేశ్ సీట్లలో తెలంగాణ విద్యార్థులకు 15 శాతం రిజర్వేషన్ వంటి కీలక డిమాండ్లతో రాష్ట్రంలోని జూనియర్ డాక్టర్లు ఆందోళన బాట పట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఉన్నతాధికారుల నుంచి మంత్రి వరకు వారు పదే పదే గోడు వెళ్లబోసుకున్నా స్పందన కరువైంది. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత జనవరి నుంచి పదే పదే వినతులు చేస్తున్నా సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోవడం, డిమాండ్లు పరిష్కరించకపోవడం జూనియర్ డాక్టర్లలో అసంతృప్తిని పెంచింది. ప్రభుత్వాస్పత్రుల్లో భద్రత, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు సరిపడేలా కొత్త హాస్టళ్ల నిర్మాణం, ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి కొత్త భవన నిర్మాణం తదితర డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని వారు కోరుతున్న సంగతి తెలిసిందే. ఇవే అంశాలపై గత కొంతకాలంగా వివిధ రూపాల్లో నిరసనలు తెలిపిన వారు సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. అత్యవసర, ఆపరేషన్ సేవలు మినహా ఓపీ సేవలను బహిష్కరించి రాష్ట్రంలోని ఉస్మానియా, గాంధీ, ఎంజీఎం (వరంగల్) తదితర బోధనాస్పత్రుల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఉపకారవేతనాల విడుదలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాదిరిగా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలనేది జూడాల ప్రధాన డిమాండ్లలో ఒకటి. దీనితో పాటు ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణం ఆలస్యం చేస్తుండటంతో గాంధీ ఆస్పత్రిలో రోగుల రద్దీ పెరిగిపోతున్నదనీ, కాకతీయ మెడికల్ కాలేజీలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు. మెడికల్ సీట్లు పెరిగిన కాలేజీల్లోనూ అందుకు తగ్గట్టు హాస్టళ్ల వసతి పెంచకపోవడం కూడా జూడాల ఆగ్రహానికి కారణమైంది. 150 అండర్ గ్రాడ్యుయేట్ సీట్ల కెపాసిటీ ఉన్న మెడికల్ కాలేజీల్లో వాటి సంఖ్య 250 సీట్లకు పెరిగినా హాస్టల్ వసతుల్లో మాత్రం మార్పు రాలేదు. ఇదే విషయంపై వారు ప్రభుత్వానికి పదే పదే విన్నవించుకుంటున్నా అటువైపు నుంచి మాటలే తప్ప చేతలు కనిపించకపోవడంతో నిరాశకు గురయ్యారు. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు తర్వాత తాముంటున్న చోటుకు 10 కిలోమీటర్ల దూరం ఉంటే రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తానని గతంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. సీనియర్ రెసిడెంట్ డాక్టర్లకు సంబంధించి పీజీ పూర్తి చేసిన వారికి, సూపర్ స్పెషాలిటీ పూర్తి చేసిన వారికి ఒకే రకమైన వేతనం నెలకు రూ.92 వేలు మాత్రమే ప్రభుత్వం ఇస్తున్నది. అయితే నియామక సమయంలో సూపర్ స్పెషాలిటీ చేసిన సీనియర్ రెసిడెన్సీలకు రూ.1,25,000 చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పిందని జూడాలు చెబుతున్నారు. వీటికి తోడు ప్రభుత్వాస్పత్రుల్లో కనీస వైద్య వసతుల కల్పన విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని జూడాలు ఆరోపిస్తున్నారు. నామమాత్రపు రోగ నిర్ధారణ పరీక్షలకు మాత్రమే అవకాశముండి, ప్రత్యేక పరీక్షలు లేకపోవడంతో రోగులను బయటికి పంపించాల్సి వస్తున్నది. గత రెండు నెలల నుంచి మందులకు తీవ్ర ఇబ్బందిగా ఉందని జూనియర్ వైద్యుల వాదన. సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచి అంతకు ముందు రెగ్యులర్‌గా వచ్చే మందులు కూడా రావడం లేదు. నీరు లీకవుతూ, పెచ్చులూడుతున్న ఉస్మానియా ఆస్పత్రి భవనంలో వైద్యం చేయడమంటే డాక్టర్లకు, తీసుకునే రోగులకు కూడా దుస్సాహసంగా మారిందని వారు వాపోయారు. ఆ ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు జూనియర్ డాక్టర్ల డిమాండ్లపై సోమవారం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జూడాల నేతలతో చర్చలు జరిపారు. అవి ఫలప్రదం కాకపోవడంతో తాము సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. అయితే వారిని బుజ్జగించేందుకు వైద్యవిద్యా సంచాలకులు డాక్టర్ వాణి రంగంలోకి దిగారు. కోఠిలోని డీఎంఈ కార్యాలయంలో రాత్రి పొద్దుపోయే వరకు ఈ చర్చలు కొనసాగాయి. అనంతరం తమ సమ్మె కొనసాగిస్తామని జూడాలు ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రతి సారి ఒప్పించలేరు :డాక్టర్ ఎల్.సాయి సృజన

జూనియర్ డాక్టర్లుగా మేం మా సమస్యల కోసమే కాకుండా రోగులు, ప్రజారోగ్య వ్యవస్థ మెరుగుదల కోసమే నిరసనలు చేపట్టాం. పేద రోగులకు వైద్యం చేయాలనే ఆశతోనే ప్రభుత్వాస్పత్రుల్లో ఉంటున్నాం. అలాంటి మాకు వైద్యం చేసేందుకు అవసరమైన పరిస్థితులు కల్పించకుంటే ఎలా? ప్రతిసారి చర్చల పేరుతో ప్రభుత్వం మమ్మల్ని ఒప్పించలేదు. సరైన వసతులు లేకుండా పెరిగిన రోగుల రద్దీని భరించలేం. డిమాండ్లను నెరవేర్చేవరకు సమ్మె కొనసాగిస్తాం.

నూతన భవనం నిర్మిస్తామంటే నమ్మేదెలా? :డాక్టర్ లౌక్య

ప్రత్యేక పరీక్షలు చేసే అవకాశం లేదు. సర్జికల్ బ్రాంచ్‌లలో కూడా తప్పనిసరిగా ఉండాల్సిన పరికరాలకు కొరత వేధిస్తున్నది. జనవరి నుంచి సమస్యలు వెంటాడుతున్నా ఓపికపట్టాం. ఎన్నికల కోడ్ అన్నారు. విన్నాం. వేచిచూశాం. ఇక మా వల్ల కావడం లేదు. ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవనం నిర్మిస్తామనే చెబుతున్నారు. కానీ నమ్మేదెలా?. టైంబాండ్‌తో స్పష్టమైన హామీ ఇవ్వాల్సిందే.

సకాలంలో ఇవ్వాలి :డాక్టర్ సులామాన్ మొహసిన్

ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నది. ఉపకార వేతనాలనూ ఇస్తున్నది. కానీ అవసరమైన సమయంలో అవి చేతికి అందకపోతే ప్రయోజనం ఏంటి? పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఉపకార వేతనాల కోసం గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు. మన రాష్ట్రంలో అదేవిధంగా చేస్తే నష్టమేంటి? దీంతో అదనంగా పడే ఆర్థిక భారం కూడా లేదు. ప్రతిసారి ఇదిగో...అదిగో అయిపోయింది..అంటారు. కానీ మళ్లీ, మళ్లీ అదే పరిస్థితి. డీఎంఈకి రూ.400 కోట్లకు పైగా విడుదల చేయడం సంతోషమే. కానీ సమయానికి అవసరాలకు ఉపయోగపడాలనేదే మా డిమాండ్. అవి నెరవేరే వరకు సమ్మెలో ఉంటాం.

అధిష్టానంపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అలక

(మొదటిపేజీ తరువాయి)

మలుపు తిరుగుతుందోనన్న చర్చ సర్వత్రా నెలకొంది.

తొలి నుంచి కాంగ్రెస్‌లోనే ఉన్న జీవన్‌రెడ్డి 1983 నుంచి జగిత్యాలలో ఓటమెరుగని నేతగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మధ్యలో 1985, 1994, 2009, 2018 ఎన్నికల్లో మాత్రమే ఓటమి చవిచూశారు. అయినప్పటికీ 2018 ఓటమి తరువాత వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి ప్రస్తుతం శాసనమండలి సభ్యునిగా కొనసాగుతున్నారు. అయితే ఈయనకు తొలి నుంచి టీడీపీ పోటీగా నిలబడగా.. తరువాత 2014 నుంచి బీఆర్ఎస్ ప్రత్యర్థిగా ఉంటూ వచ్చింది. 2014లో గెలిచినప్పటికీ 2018లో బీఆర్ఎస్ చేతిలో ఓటమి తప్పలేదు. ప్రధాన ప్రత్యర్థి పార్టీగా బీఆర్ఎస్‌కు ఆయనే గట్టిపోటీనిస్తూ కాంగ్రెస్ క్యాడర్‌ను, పార్టీని కాపాడుకుంటూ వస్తున్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లోనూ తన అసెంబ్లీ సెగ్మెంట్ భాగమైన నిజామాబాద్ లోక్‌సభకు పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అయినప్పటికీ తొలి నుంచి జగిత్యాల అంటేనే జీవన్‌రెడ్డి అన్న రీతిలో తన చరిష్మాను చాటుకుంటూ వస్తున్న ఆయనకు.. తన సెగ్మెంట్‌లో తనపై పోటీ చేసి గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ని కాంగ్రెస్‌లోకి చేర్చుకుంటున్న విషయం కనీస సమాచారం లేకుండా పోయింది. దీంతో జీవన్ రెడ్డి పార్టీ అధినాయకత్వంపై అలకబూనడం, ఆగ్రహం వ్యక్తం చేయడం వంటి పరిణామాలు తెలిసిందే.

పార్టీకి రాజీనామా.. బీజేపీలో చేరుతారనే ప్రచారం...

ఇన్నాళ్లూ పార్టీ కోసం అహర్నిశలూ కష్టపడ్డ తనకు ప్రత్యర్థిగా ఉన్న ఎమ్మెల్యే సంజయ్‌ని కాంగ్రెస్‌లో చేర్చుకునే విషయాన్ని చెప్పకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తికి గురైన జీవన్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేస్తారనే ప్రచారం నడిచింది. అందులోనూ సంజయ్ చేరికకు ముందు రోజే పార్టీ ఫిరాయింపులపై జీవన్‌రెడ్డి పలు వ్యాఖ్యలు చేశారు. 'ఏ రాజకీయ పార్టీ అయినా సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుంది.

రాష్ట్రంలో 65 మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంది. ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవాల్సిన అవసరం ఉందని తాను భావించడం లేదు. ఇలాంటి వాటిని నేను వ్యక్తిగతంగా ప్రోత్సహించను' అంటూ మాట్లాడారు. ఆ మర్నాడు ఆదివారం సాయంత్రమే తన ప్రత్యర్థిగా ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ని సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నారు. ఆ ఫొటోలు, వార్తలు వచ్చేవరకూ జవన్‌రెడ్డికి సమాచారం లేని అనూహ్య పరిణామంతో ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తన అనుచరుల ఫోన్లూ ఎత్తకుండా అలకబూని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సంజయ్ చేరికపై ఆయన అభిప్రాయం తెలుసుకునేందుకు ప్రయత్నించిన మీడియా ప్రతినిధులకూ అందుబాటులోకి రాలేదు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ పదవికి జీవన్‌రెడ్డి రాజీనామా చేయనున్నట్టు వార్తలు గుప్పుమన్నాయి. కాగా, బీజేపీలో చేరుతున్నారంటూ ప్రచారం మొదలైంది. అందుకు జీవన్‌రెడ్డిని కరీంనగర్, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీలు బండి సంజయ్, ఈటల రాజేందర్ కలుస్తారని వార్తలు షికారు చేశాయి. జీవన్‌రెడ్డిని బీజేపీలోకి ఆహ్వానించే అవకాశం ఉందని జోరుగా చర్చలు మొదలయ్యాయి. ఈ వార్తలపై జీవన్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించకపోవడం అందుకు బలం చేకూర్చింది.

బుజ్జగించే పనిలో సీనియర్ నేతలు

ప్రభుత్వ విప్‌లు.. ధర్మపురి, వేములవాడ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్ సోమవారం ఉదయమే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేసే క్రమంలో అప్పటికే కాంగ్రెస్ శ్రేణులు, జీవన్‌రెడ్డి క్యాడర్ పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. సంజయ్ చేరికను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. పరిస్థితి చేజారుతుందనగా.. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సైతం సాయంత్రం జీవన్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఆయననూ పార్టీ క్యాడర్ అడ్డుకునే ప్రయత్నం చేసింది. అయినప్పటికీ ఆయన జీవన్‌రెడ్డితో మాట్లాడే ప్రయత్నం చేశారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఫోన్‌లో జీవన్‌రెడ్డితో మాట్లాడనున్నట్టు తెలిసింది. ఏదేమైనా ఈ ఎపిసోడ్ మొత్తంలో జీవన్‌రెడ్డి అలకవీడుతారా? లేక పార్టీ మారుతారా? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. మరోవైపు తల్లిలాంటి పార్టీని మోసం చేశారంటూ ఎమ్మెల్యే సంజయ్‌పై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆయన దిష్టిబొమ్మలు దహనం చేశారు.

సింగరేణి ఉత్తర తెలంగాణ గుండెకాయ

టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణి ఉత్తర తెలంగాణకు గుండెకాయ లాంటిదని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 1973లో ఇందిరా గాంధీ బొగ్గు తవ్వకాలను జాతీయం చేశారని చెప్పారు. విపరీతమైన దోపిడీ, పర్యావరణ విధ్వంసం జరుగుతుందని గ్రహించి ఆనాడు ఆ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. ప్రయివేటీకరణ వల్ల విపరీతంగా అక్రమాలు జరుగుతున్నాయనీ, దాన్ని నియంత్రించేందుకు వేలం పద్ధతిని అమలు చేయాలని సుప్రీం కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. అయితే కచ్చితంగా వేలం వేయాలని ఆ న్యాయస్థానం చెప్పలేదన్నారు. సింగరేణి ఎంతో సమర్థవంతంగా బొగ్గు తవ్వకాలు చేస్తోందని వివరించారు. సుమారు రూ. 7 వేల కోట్ల వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. వేలం వేయడం కంటే సింగరేణి ద్వారానే ఆదాయం ఎక్కువగా వస్తుందని చెప్పారు. సింగరేణి పరిధిలో ప్రజలు ఆర్థికంగా ఎదిగారనీ, అది సామాజికమార్పుకు కారణమయ్యిందని చెప్పారు. అందువల్ల వేలం నుంచి సింగరేణికి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గనులు సింగరేణికి ఇవ్వకపోతే పదేండ్లలో ఆ సంస్థ తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

చెంచు మహిళపై దాడి దురదృష్టకరం

- నిమ్స్‌లో ఈశ్వరమ్మకు పరామర్శ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ - బంజారాహిల్స్

చెంచు మహిళపై దాడి జరగడం దురదృష్టకరమని, ఇలాంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మను శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగిరి బీరప్పతో మాట్లాడి.. మెరుగైన వైద్యం అందించాలని, పూర్తిగా నయమైన తర్వాతే డిశ్చార్జి చేయాలని వైద్యులను ఆదేశించారు. బాధితురాలి భర్త ఇదన్నకు ధైర్యం చెప్పారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. చెంచు గిరిజన జాతి మహిళపై దాడి ఘటన మనం తలదించుకునే విషయం అన్నారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి జూపల్లి నాగర్‌కర్నూల్ ఆస్పత్రిలో బాధితురాలిని చేర్పించారని, అనంతరం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చినట్టు చెప్పారు. ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని, బాధితురాలికి మెరుగైన చికిత్స అందించే అన్ని చర్యలు చేపట్టామన్నారు. నింది తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తామని, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్లో ఉచితంగా విద్య అందిస్తామని తెలిపారు. వారికి ఇల్లు కేటాయిస్తామని, వ్యవసాయం చేసుకుంటామంటే పరిసర ప్రాంతంలో పరిసర భూమి కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

మెరుగైన వైద్యాన్ని అందించాలి:మంత్రి దామోదర రాజనర్సింహ

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్, మొలచింతలపల్లికి చెందిన గిరిజన మహిళ ఈశ్వరమ్మ (25)కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం నిమ్స్ డైరెక్టర్‌కు ఫోన్ చేసిన మంత్రి ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈశ్వరమ్మ వైద్యానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి భరోసానిచ్చారు. పాశవికంగా జరిగిన దాడిలో ఈశ్వరమ్మ తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను అక్కడి డాక్టర్ల సూచనల మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి సోమవారం పరామర్శించారు.

వికారాబాద్ జిల్లా ఖాసీంపేటలో అత్యంత భారీ వర్షం

- వచ్చే రెండ్రోజులు వర్షాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. ఒక్కటెండ్రు చోట్ల భారీ వర్షం పడే సూచనలున్నాయి. ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు అక్కడక్కడా పడొచ్చు. ఈ నేపథ్యంలో ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రంలో సోమవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 21 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా బషీర్‌బాద్ మండలం ఖాసీంపూర్‌లో అత్యంత భారీ వర్షం కురిసింది. అక్కడ 19.84 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టొద్దు

- సింగరేణికి గనులను కేటాయించాలి: సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బొగ్గు గనుల ప్రయివేటీకరణను మానుకొని సింగరేణికి గనులను కేటాయించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు గనుల ప్రయివేటీకరణలో భాగంగా తెలంగాణకు ఆయువుపట్టుగా ఉన్నటువంటి సింగరేణిని కేంద్ర ప్రభుత్వం నష్టాల్లోకి నెట్టడానికి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. సింగరేణికి బొగ్గు గనులను కేటాయించకుండా ఓపెన్ టెండర్లలో సింగరేణి కూడా పాల్గొనాలని చెప్పడం అంటే ఉద్దేశపూర్వకంగా దాన్ని నష్టాలపాలు చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి తెలంగాణ నుంచి ఎన్నికై రాష్ట్రానికి చేయాల్సింది పోయి కార్పొరేట్ కంపెనీలకు సహజ వనరులను కట్టబెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో ఉచిత విద్యుత్తు అందుతుందన్నా. వేలాది మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయన్నా. దానికి సింగరేణి లాంటి బొగ్గు గనులే కారణమని తెలిపారు. అలాంటి సింగరేణికి బొగ్గు గనులను కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగించే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. అదానీ నుంచి అత్యధిక ధరలను చెల్లించి బొగ్గును దిగుమతి చేసుకుంటున్నారని, దాంతో వేలకోట్ల రూపాయల ప్రజాధనం కార్పొరేట్ కంపెనీలకు కట్ట పెట్టాల్సి వస్తుందని తెలిపారు. అంతేకాదు, కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం బొగ్గు గనుల వేలాన్ని నిర్వహిస్తున్నారని, దీన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నదని అన్నారు. బొగ్గు గనుల ప్రయివేటీకరణను నిరసిస్తూ 28, 29 తేదీల్లో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, జిల్లా కమిటీ సభ్యులు సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మీడియా కీలక పాత్ర

- సోషల్ మీడియా ప్రవేశంతో జర్నలిజంలో భారీ మార్పులు : ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్ గోయెల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజాభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్ గోయెల్ అన్నారు. శ్రీలంక మీడియా ప్రతినిధుల కోసం హైదరాబాద్‌లోని ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌సీలో సోమవారం 'మీడియా మేనేజ్‌మెంట్' పై రెండు వారాల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజల గొంతుకగా పని చేస్తూ, పాలనలో పారదర్శక కోసం పాటుపడతారని ప్రశంసించారు. సోషల్ మీడియా ఆవిర్భావం తర్వాత మీడియా రంగంలో అనేక మార్పులు సంభవించాయని వ్యాఖ్యానించారు.ఖండాతరాల్లో ఎక్కడ ఏ సంఘటన జరిగినా క్షణాల్లో సమచారాన్ని ప్రేక్షకులకు అందిస్తున్నదని గుర్తు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా మీడియా ల్యాండ్‌స్కేప్‌ను మార్చిందని వివరించారు. ఇది మీడియా ప్రపంచంలో ఊహించని పరివర్తనను తీసుకొచ్చిందని పేర్కొన్నారు. దీనికి తోడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వార్తా పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించండి

16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి వినతి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో రీజినల్ రింగ్ రోడ్డును నిర్మించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో సుస్థిర పాలన అందిస్తున్నామని, ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంపై కృషి చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం యుటిలిటీ చార్జీలు కట్టమని కేంద్రానికి లేఖ రాయడంతో ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు వెనక్కి వెళ్లిందని, తమ ప్రభుత్వం వచ్చిన తరువాత తాను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి యుటిలిటీ చార్జీలు కడతామని లేఖ ఇచ్చామన్నారు. దీంతోపాటు రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులను నితిన్ గడ్కరీ వివరిస్తే, ఆయనే స్వయంగా యుటిలిటీ చార్జీలు చెల్లిస్తామని చెప్పారు. దీంతో ప్రాజెక్టు ముందుకు కదిలిందని అన్నారు. ఎన్నికల వల్ల ఆర్‌ఆర్‌ఆర్, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు లైన్లగా మార్చే పనులు కాస్త ఆలస్యం అయ్యాయని అన్నారు.

టోల్ రోడ్డు పనులు 2024 నాటికి పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, జీఎంఆర్ సంస్థ ఇప్పటికీ వివిధ కారణాలు చూపించి పనులు పూర్తిచేయలేదన్నారు. దీనివల్ల ప్రతీరోజు అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని, వికలాంగులుగా మారుతున్నారని తెలిపారు.

రూ. 375 కోట్లు కేంద్రం మంజూరు చేసినప్పటికీ, పనులు చేయాల్సిన జీఎంఆర్ సంస్థ రెండుసార్లు కోర్టుకు వెళ్లి పనులు చేయలేదని అన్నారు. మూడోసారి టెండర్ పిలిచి ఆదివారమే పనులు ప్రారంభించామని, డిసెంబర్ లోపు టెంపరరీ రిలీఫ్ కోసం పనులు పూర్తి చేస్తామని తెలిపారు. బ్లాక్ స్పాట్స్ రిపేర్లు మాత్రమే కాకుండా ఆరు లైన్ల రోడ్డును నిర్మించాలనికేంద్ర మంత్రి గడ్కరీకి కోరినట్లు చెప్పారు.

రీజినల్ రింగ్ రోడ్డు కోసం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సమీక్షిస్తానని కేంద్ర మంత్రి గడ్కరీ చెప్పారని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు మరోసారి విన్నవించానన్నారు. అందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, భారతమాల కింద మంజూరు చేస్తామని చెప్పారు. ఉప్పల్ - ఘట్ కేసర్ ఫ్లైఓవర్ పనులు నాలుగేండ్లుగా నత్తనడకన సాగుతున్న విషయం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. కేంద్రమంత్రి గడ్కరి తక్షణం స్పందించి, కాంట్రాక్టర్ సంస్థను టెర్మినేట్ చేసి కొత్త టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అలాగే రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి కావల్సిన అటవీ అనుమతుల కోసం కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలవనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, జి. కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవనున్నట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)


హస్త కళల ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యను పోస్టింగ్ ఇచ్చింది. హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్ ఎమ్‌డీగా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు. యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శిగా వాణి ప్రసాద్‌ను నియమించగా, సంజయ్ కుమార్‌కు కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. హౌసింగ్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ముఖ్య కార్యదర్శిగా జ్యోతి బుద్ధప్రసాద్‌కు అవకాశం కల్పించిన ప్రభుత్వం, విద్యుత్ శాఖ కార్యదర్శిగా రొనాల్డ్ రోస్‌కు పోస్టింగ్ ఇచ్చి, జెన్‌కో, ట్రాన్స్‌కో అదనపు బాధ్యతలను అప్పగించింది. ఐపీఎస్ అధికారి ఎవి.రంగనాద్‌ను జీహెచ్‌ఎంసీ, విజిలెన్స్, విపత్తు నిర్వహణ కమిషనర్‌గా, అక్కడ పని చేస్తున్న ఎస్.ప్రకాష్‌రెడ్డి పర్యాటక అభివృద్ధి సంస్థ ఎమ్‌డీగా నియమించింది

రాష్ట్రంలో బదిలీ అయిన ఐఏఎస్ అధికారుల వివరాలు

క్రస అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
1). సవ్యసాచి ఘోష్	యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యదర్శి	పశు సంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శి
2). సందీప్ కుమార్ సుల్తానియా	ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి	(ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు)
3). శైలజా రామయ్యర్	చేనేత, హస్తకళల ముఖ్యకార్యదర్శి	(హ్యాండ్లూమ్స్,టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్ ఎండీగా అదనపు బాధ్యతలు)
4). సంజయ్ కుమార్	(వెయిటింగ్)	కార్మిక, ఉపాధి శిక్షణశాఖ ముఖ్య కార్యదర్శి
5). ఏ. వాణిప్రసాద్	అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి	యువజన,పర్యాటక,క్రీడలశాఖ ముఖ్య కార్యదర్శి
6). అహ్మద్ నదీమ్	ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి	అటవీ, పర్యావరణశాఖ ముఖ్యకార్యదర్శి
7). సయ్యద్ అలీ రిజ్వి	ఇందన శాఖ ముఖ్యకార్యదర్శి	వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ ముఖ్యకార్యదర్శి
8). సుదర్శన్‌రెడ్డి	హెచ్‌ఎమ్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ ఎమ్‌డీ	జీఏడీ ముఖ్యకార్యదర్శి
9). జ్యోతి బుద్ధప్రసాద్	రవాణా శాఖ కమిషనర్	హౌసింగ్,రిజిస్ట్రేషన్ల శాఖ ముఖ్యకార్యదర్శి
10). సోనీ బాలాదేవి	వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి	స్పోర్ట్స్ అథారిటీ ఎమ్‌డీ
11). కె.ఇలంబరితి	వేయిటింగ్	రవాణాశాఖ కమిషనర్
12). రొనాల్డ్ రోస్	జీహెచ్‌ఎంసీ కమిషనర్ (జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీగా అదనపు బాధ్యతలు)	విద్యుత్‌శాఖ కార్యదర్శి
13).ఎవి.రంగనాథ్	ఐజీ మల్టీజోన్-1 (ఐపీఎస్ అధికారి)	జీహెచ్‌ఎంసీ విజిలెన్స్, విపత్తు నిర్వహణ కమిషనర్
14). శ్రీదేవసేన	పాఠశాల విద్యా డైరెక్టర్	కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్
15). సర్ఫరాజ్ అహ్మద్	రాష్ట్ర సంయుక్త ఎన్నికల అధికారి	హెచ్‌ఎండీఏ కమిషనర్
16). డి.దివ్య	మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (ప్రజావాణి నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలు)	సెర్ప్ సీఈవో
17. ఆమ్రపాలి కాట		జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు
18).హరిచందన దాసరి	వెయిటింగ్	రోడ్లు, భవనాలశాఖ ప్రత్యేక కార్యదర్శి
19). ఎన్.ప్రకాష్‌రెడ్డి	జీహెచ్‌ఎంసీ విజిలెన్స్, విపత్తు నిర్వహణ కమిషనర్	పర్యాటక అభివద్ధి సంస్థ ఎమ్‌డీ
20). అలుగు వర్షిణి		ఎస్సీ గురుకులాల కార్యదర్శి
21). వి.పి.గౌతమ్		గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి (పురపాలక శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు)
22). ఎస్. కృష్ణ ఆదిత్య		ఉపాధి, శిక్షణ శాఖల డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
23). కె.అశోక్‌రెడ్డి	ఉద్యానవన శాఖ డైరెక్టర్	జలమండలి ఎమ్‌డీ
24). అనురాగ్ జయంతి	వెయిటింగ్	జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్
25). భవేష్ మిశ్రా	వెయిటింగ్	ఐటీ ఉపకార్యదర్శి
26). జి.రవి	వెయిటింగ్	కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి
27).యాస్మిన్ బాషా	వెయిటింగ్	ఉద్యానవన డైరెక్టర్ (ఆయిల్‌ఫెడ్ ఎమ్‌డీగా అదనపు బాధ్యతలు)
28). కె.నిఖిల	డైరెక్టర్ టూరిజం	గ్రామీణాభివద్ధి సీఈవో
29). బి. గోపి		పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
30). ఎస్.వెంకట్రావు	వెయిటింగ్	ప్రొటోకాల్ డైరెక్టర్
31). జి.ఉదయ్‌కుమార్	వెయిటింగ్	వ్యవసాయ,సహకార సంయుక్త కార్యదర్శి
32). ప్రియాంక అల	వెయిటింగ్	ఫిషరీస్ డైరెక్టర్
33). ఐలా త్రిపాఠి	వెయిటింగ్	టూరిజం డైరెక్టర్
34). స్నేహా శబరీష్	జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్	జీహెచ్‌ఎంసీఅదనపు కమిషనర్
35). పి. కాత్యాయని దేవి		రాష్ట్ర ఆర్థికసంఘం ఎమ్‌డీ
36). ఈవి. నర్సింహారెడ్డి	గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్	పాఠశాల విద్యా డైరెక్టర్ (సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు)
37).బిహెచ్. సహదేవరావు	వెయిటింగ్	వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివద్ధి సంస్థ ఎండీ
38). హెచ్.కె. పాటిల్	అదనపు కలెక్టర్, హైదరాబాద్	జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్
39). అపూర్వ్ చౌహాన్	జోగులాంబ గద్వాల అదనపు కలెక్టర్	జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్
40). అభిషేక్ అగస్త్య	మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్	ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్
41).బి. రాహుల్	మంచిర్యాల అదనపు కలెక్టర్	భద్రాచలం ఐటీడీఏ పీవో
42).పి.గౌతమి	రాజన్న సిరిసిల్ల అదనపు కలెక్టర్	మూసీ అభివృద్ధి జేఎమ్‌డీ
43).పి.ఉపేందర్‌రెడ్డి (నాన్‌క్యాడర్)	జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్	జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్
44). నిఖిల్ చక్రవర్తి		టీజీ ఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
45) సుధేంద్ర	ఏసీబీ జాయింట్ డైరెక్టర్	హైదరాబాద్ నగర టాస్క్‌ఫోర్స్ డీసీపీ
46). సీతారామ్	వెయిటింగ్	తెలంగాణ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో
47). రమేశ్ నాయుడు	టూరిజం కార్పొరేషన్ ఎమ్‌డీ	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశం

జూనియర్ డాక్టర్ల నిరవధిక సమ్మె

- ఓపీ సేవలు బహిష్కరణ
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



నవతెలంగాణ- విలేకరులు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు సోమవారం నుంచి నిరవధిక సమ్మెలోకి దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓపీ సేవలను బహిష్కరించారు. వైద్య విద్యార్థుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు ఓపీ సేవలు, తాత్కాలిక ఓటీ సేవలను బహిష్కరించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులకు వెంటనే స్టైఫండ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్లే నిరవధిక సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్ల నిరవధిక సమ్మె ప్రారంభమైంది. ఆస్పత్రి ముందు జూనియర్ డాక్టర్లు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అత్యవసర సేవలు మినహా ఓపీ, వార్డు విభాగాల వైద్య సేవలు నిలిపివేశారు. ఆస్పత్రిలో మౌలిక వైద్య సదుపాయాలు మెరుగు పర్చాలని, నూతన వసతి గృహాల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా తమ సమస్యలను పట్టించుకోవట్లేదన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ కె.అబ్దుల్ సమద్, జనరల్ కార్యదర్శి డాక్టర్ గగన్ మాట్లాడుతూ.. గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతినెలా స్టైఫండ్ చెల్లించాలని కోరారు. వైద్యకళాశాలల్లో 15 శాతం సీట్లలో ఏపీ విద్యార్థులకు అవకాశం ఇవ్వకూడదని, వైద్యులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో జూడాలు ఓపీ సేవలను బహిష్కంచి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా రిమ్స్ జూనియర్ డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్‌చారి మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నుంచి ఓపీ సేవలను బహిష్కరించి, సమ్మెలో పాల్గొన్నామని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, సంగారెడ్డిలోని వైద్య కళాశాలల ముందు జూనియర్ డాక్టర్లు సమ్మె చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు వచ్చే స్టైఫండ్ ప్రతినెలా ఇవ్వాలని, ఉస్మానియా ఆస్పత్రిని ఆధునీకరించాలని, అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు అన్ని రకాల మెడిసిన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. సౌకర్యాలు లేక, మందులు లేక జూనియర్ డాక్టర్లపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలా జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పెండింగ్ పనుల్ని క్లియర్ చేయండి

- వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో పీఎంజీఎస్‌వై ద్వారా రోడ్ల నిర్మించండి : కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రాష్ట్రమంత్రి సీతక్క వినతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో పెండింగ్ పనులను వెంటనే క్లియర్ చేయాలని రాష్ట్ర పంచాయితీ రాజ్,గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క కోరారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ కేంద్ర కేంద్రగ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను రాష్ట్ర మంత్రి సీతక్క కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద రోడ్లు నిర్మించాలని కోరారు. పీఎంజీఎస్‌వైలో కనెక్టివిటీ లేని 1,270 ఆవాసాలకు సంబంధించి కేంద్రానికి అన్ని వివరాలు అందజేశారు.

రోడ్డు మార్గం లేని 164కు పైగా ఆదివాసి గిరిజన గూడాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అన్ని మారుమూల ఆవాసాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసి ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం అటవీ శాఖ అనుమతులు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఆదివాసి ప్రాంతాలకు, మారుమూల ప్రాంతాల రోడ్డు నిర్మాణం కోసం తక్షణ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారని, నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని మంత్రి సీతక్క తెలిపారు.

బేగంపేట ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

- మెయిల్ రావడంతో పోలీసుల ముమ్మర తనిఖీలు



నవతెలంగాణ-బేగంపేట్

హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. సోమవారం ఉదయం బేగంపేట్ విమానాశ్రయానికి గుర్తు తెలియని వ్యక్తులు నుంచి ఓ ఈ మెయిల్ వచ్చింది. అందులో బేగంపేట్ విమానాశ్రయంలో బాంబు ఉందని పేర్కొంటూ వారు బెదిరించారు. దాంతో అప్రమత్తమైన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అయితే, తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని మెయిల్ ఐడీ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. ఈ తనిఖీల్లో బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్య, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- ఇంటర్ విద్యా డైరెక్టర్‌కు టీజీజేఎల్‌ఏ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ విద్యలో అధ్యాపకులు, సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్‌ఏ-475) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇంటర్ విద్యా డైరెక్టర్ శృతి ఓజాను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి శ్రీనివాస్, కొప్పిశెట్టి సురేష్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇంటర్ విద్యలో 26 జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి (డీఐఈవో) పోస్టులను మంజూరు చేయాలని కోరారు. మేలో వేసవి సెలవుల్లో పార్లమెంటు ఎన్నికల విధులు నిర్వహించిన ఇంటర్ విద్యా సిబ్బందికి ఈఎల్ ప్రొసీడింగ్ ఇవ్వాలని తెలిపారు. అనంతరం ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి జయప్రద బాయిని కలిశామని పేర్కొన్నారు. ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణలో పాల్గొన్న అధ్యాపకులకు సకాలంలో రెమ్యూనరేషన్ అందేటట్టు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నవీన్ రెడ్డి, ఉదయభాస్కర్, చిట్టిమల్ల భాస్కర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం హైడల్ నాలుగో యూనిట్‌కు టెండర్లు పిలవండి

- టీజీఎస్‌జెన్‌కో అధికారులకు మంత్రి భట్టి ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రెండు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే నిర్ణయం కోసం రూ.60 కోట్లు పోగొట్టుకోవడం అర్థం లేని పని అని డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శ్రీశైలం లెఫ్ట్‌బ్యాంక్ హైడల్‌పవర్ జనరేషన్ ప్రాజెక్ట్‌లోని నాల్గవ యూనిట్ గతంలో షార్ట్ సర్క్యూట్‌కు గురైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆ యూనిట్‌కు మరమ్మతులు చేయలేదు. సోమవారం ఆ ప్రాజెక్ట్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇంధనశాఖ సీఎమ్‌డీ ఎస్ఏ రిజ్వీ, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. అనంతరం అక్కడే ఉన్నతాధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. షార్ట్‌షర్క్యూట్ వల్ల మరమ్మతుకు గురైన యూనిట్ 4 పనులకు త్వరగా టెండర్లు పిలిచి, పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని చెప్పారు. ఒక సీజన్లో మూడు నెలల్లో రూ.60 కోట్ల విలువైన విద్యుత్‌ను ఇక్కడ ఉత్పత్తి చేస్తామనీ, రూ.2 కోట్ల ఖర్చుతో పూర్తయ్యే మరమ్మతు పనులను ఇప్పటికీ చేపట్టకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతికంగా ప్రసిద్ధిగాంచిన హిటాచి సంస్థ ఈ ప్రాజెక్టును నిర్మించిందనీ, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందే అవకాశం ఈ ప్రాజెక్టులో ఉన్నదని చెప్పారు. 2020 సంవత్సరంలో ఈ ప్రాజెక్టులో చోటు చేసుకున్న దుర్ఘటన అందరికీ బాధాకరమైందని అన్నారు. జెన్‌కో ప్రాజెక్టులకు సంబంధించి ఎంత త్వరగా నిర్ణయాలు తీసుకుంటే అంత మంచిదని, దీనివల్ల తక్కువ ధరకే విద్యుత్ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్లాంట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్లాంట్‌లోకి వచ్చే ప్రతి మనిషికి చిన్న ఆక్సిజన్ సిలిండర్ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. భద్రతా చర్యల విషయంలో నిధుల సమస్య లేదనీ, ప్రాణాలు అత్యంత విలువైనవనీ, స్వీపర్ నుంచి సీఈ వరకు అందరికీ ఇదే సూత్రం వర్తిస్తుందన్నారు. ప్లాంట్‌లో భద్రతా చర్యల పర్యవేక్షణ కోసం కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. తెగిపోయిన టేల్‌పాండ్ మరమ్మతులు చేపట్టాలని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మంత్రిని కోరారు. దానికాయన సానుకూలంగా స్పందించారు. ఆర్టిజన్ల రెగ్యులరైజేషన్, ఉద్యోగులకు డిమోషన్స్ వంటి అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

బీమా పాలసీని అమ్ముకోలేరు : ఎల్‌ఐసి వెల్లడి

భారతీయ జీవన బీమా నిగమ్ LIC LIFE INSURANCE CORPORATION OF INDIA

హైదరాబాద్ : తాము జారీ చేసిన జీవిత బీమా పాలసీని ఇతర ఏ సంస్థలకు అమ్ముకోవడానికి లేదా బదిలీ చేసుకోవడానికి గానీ వీలుండదని ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) స్పష్టం చేసింది. సంస్థకు సరెండర్ చేయడం తప్పా మరో సంస్థకు విక్రయించడానికి అనుమతించలేదని పేర్కొంది. "లైఫ్ ఇన్సూరెన్స్ సెటిల్మెంట్‌లో భాగంగా పాలసీని సరెండర్ చేయకుండా సెకండరీ లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌లో అమ్ముకోవడానికి వీలుంది. సరెండర్ చేయడం కన్నా పాలసీని అమ్ముకోవడం ద్వారా అధిక మొత్తాన్ని పొందవచ్చు. ఆ తర్వాత పాలసీ ప్రీమియంలన్నీ కూడా దాన్ని కొన్నవారే చెల్లిస్తారు. మరణం లేదా మెచ్యూరిటీ బీమా ప్రయోజనాలు వారికే దక్కుతాయి." అని ఇటీవల పలు మీడియాల్లో రిపోర్టులు వచ్చాయి. కాగా.. దీనిపై స్పందించిన ఎల్‌ఐసి అది అవాస్తవమని స్పష్టం చేసింది. తాము ఎలాంటి థర్డ్ పార్టీ సంస్థతో ఒప్పందం చేసుకోలేదని.. తాము జారీ చేసిన పాలసీలను ఎవరికీ విక్రయించుకోవడానికి వీలు లేదని వెల్లడించింది.

ట్రాఫిక్ డీసీపీకి ఘన సన్మానం



నవతెలంగాణ-సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం ట్రాఫిక్ డీసీపీ వి.శ్రీనివాసులు నూతనంగా బాధ్యతలు చేపట్టగా ఆయనను సంతోష్ నగర్, ఐఎస్ సదన్, మాదన్న పేట్ సౌత్ ఈస్ట్ జోన్ పీస్ కమిటీ సభ్యులు, జర్నలిస్టులు సింగ్, మహమ్మద్ ముస్తాక్, స్థానిక నాయకులు అరుణ్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పూలుమాలలు వేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ మాట్లాడుతూ.. ప్రధాన రహదారులకు రాకపోకలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని, ట్రాఫిక్ సిబ్బంది పర్యవేక్షణలో ప్రజలు పోలీసులకు సహకారం అందించా లన్నారు. రోడ్డుపై ట్రాఫిక్ నివారణకు ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు.

రోడ్డుపై నీరు పరుగు



నవతెలంగాణ-సంతోష్ నగర్

చంపాపేట్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ కమాన్ వద్ద ఎదురుగా సామా నరసింహ రెడ్డి గార్డెన్ సమీపంలో రోడ్డుపై నీరు పారుతూ అక్కడి వీధులను దుర్గంధం తో ముంచెత్తుతోంది. వాటర్ ట్యాంకర్లు నింపాక నీరు నిండి తరువాత రోడ్డు పై పారుతున్నది. ఈ మురుగు ప్రవహంతో నడవటానికి ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు, పాదచారులు వాపోతున్నారు. కాలనీ వీధుల్లో పారుతున్న మురుగు ఇక్కడి నుంచి పక్కనే ఉన్న సాంబ నరసింహారెడ్డి గార్డెన్ ఎదురుగా ఉన్న రోడ్డుపైకి చేరడంతో అక్కడా ఇదే దుస్థితి నెలకొంది. ఎమ్మెల్యే, కార్పొరేటర్, అధికారులు దీనిపై దష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

మీర్ పేట్ డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం..

- కలెక్టర్‌కు నోటీసు అందజేసిన కార్పొరేటర్లు

నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ పై అవిశ్వాస నోటీసును రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్‌కు సోమవారం కార్పొరేటర్లు అందజేశారు. మీర్ పేట్ కార్పొరేషన్ డీప్యూటీ మేయర్‌ను దించేందుకు అన్ని పార్టీల (బీజేపీ, బీఆర్ఎస్(అసమ్మతి కార్పొరేటర్లు),కాంగ్రెస్) కార్పొరేటర్లు పావులు కదుపుతూ రంగం సిద్ధం చేశారు. దాంట్లో భాగంగా నే ఈరోజు 32 మంది కార్పొరేటర్లు కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. అవిశ్వాస నోటీసు కలెక్టర్‌కు అందజేసిన వారిలో కార్పొరేటర్లు వేముల నర్సింహా, లీలా రవి నాయక్, జిల్లెల అరుణ ప్రభాకర్ రెడ్డి, మద్ది సబితా రాజశేఖర్ రెడ్డి, గౌరి శంకర్ తదితరులున్నారు.



ఎమ్మెల్యే ఆదేశాలతో గుడిసె వాసులకు భోజన వసతి

నవతెలంగాణ-హాయత్‌నగర్

వేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించగా కొన్ని రోజులుగా తిండి తిప్పలు లేకుండా ఇబ్బందులు పడుతున్న వారికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుదీర్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ హాయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగొని శ్రీధర్ గౌడ్ సోమవారం భోజన వసతి కల్పించారు.హయత్ నగర్ రేడియో స్టేషన్ సమీపంలో గత కొన్ని సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని జీవనోపాధి పొందుతున్న నేపథ్యంలో రెండు,మూడు రోజుల క్రితం రహదారి విస్తరణలో భాగంగా వారి గుడిసెలు తొలగించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని వారు కలిసి తమ గోడు విన్నపించుకున్నారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అట్టి ప్రదేశంలో పర్యటించి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దానిలో భాగంగా వారికి భోజన సౌకర్యం కల్పించాలని స్థానిక నాయకులకు సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సహకారంతో వారికి భోజన సౌకర్యాలు కల్పించామని శ్రీధర్ గౌడ్ తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.



మలిదశ ఉద్యమకారుడు జనగాం భూపాల్ రెడ్డి కన్నుమూత

నవతెలంగాణ-ఎల్బీనగర్



ఎల్బీనగర్‌లో తెలంగాణ ఉద్యమ పోరాటంలో పాల్గొన్న జనగాం భూపాల్ రెడ్డి కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు శనివారం నాగోల్‌లో నిర్వహించారు. కెవి రంగారెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు, ఉద్యమకారులు పాల్గొని వారి నాయకత్వాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్ల జాతీయ నాయకులు మాట్లాడుతూ వత్తి రీత్యా ఎల్ఐసి పాలసీదారులకు, హైదరాబాద్ డివిజన్ అధ్యక్షులుగా తోటి ఏజెంట్ మిత్రులకు ఎనలేని సేవలు చేశారని, గొప్ప ఆలోచనలతో మంచి మనసున్న వ్యక్తి తమకు దూరం కావడం దురదష్టకరం అని ఘనంగా నివాళులర్పించారు. ఏజెంట్లకు ఆర్థిక భద్రత కావాలని గ్రూప్ ఇన్సూరెన్స్, మెడికల్ ఇన్సూరెన్స్, బెనెవలెంట్ ఫండ్ వంటి ఎన్నో పథకాలను కొట్లాడి సాధించిన వ్యక్తి భూపాల్ రెడ్డికి డివిజన్ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. ఏజెం ట్ల ప్రతినిధులు సింగారపు శ్రీనివాస్, వెంకటరెడ్డి, సుదర్శన్, మీడియా ఇన్‌చార్జి జన్నెపల్లి శ్రీనివాస్ రెడ్డి, బొగ్గుల మాధవరెడ్డి, కోటయ్య ,సుబ్బారావు సీనయ్య, అభిమానులు పాల్గొన్నారు.

పలు కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేష్ గుప్తా నగర్,విరాట్ నగర్, వెంకట్ సాయి కాలనీ, డీఆర్‌డీఎల్ కాలనీలలో శానిటైజేషన్ డి. ఈ వెంకటేశ్వర్లుతో కలిసి స్థానిక కార్పొరేటర్ సుజాత నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛ ఆటో సేవలను ఉపయోగించుకోవాలని, కాలనీ రోడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. తడి, పొడి చెత్త, ఇతర వ్యర్థాలను రోడ్లపై వేయకూడదని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. డివిజన్‌లో నెలకొన్న పలు రకాల మౌలిక సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని సుజాత నాయక్ అన్నారు. కార్పొరేటర్‌తో పాటు జి.హెచ్.ఎం.సి శానిటైజేషన్ సిబ్బంది, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు వెంటనే వేతనాలివ్వాలి

- సీఐటీయూ నాయకులు దాసరి బాబు

నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్‌లో పనిచేస్తున్న దాదాపు 50మంది పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ బాలాపూర్ మండల సీనియర్ నాయకులు దాసరి బాబు డిమాండ్ చేశారు. 5 నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కార్మికులు దాదాపు 300 మంది పనిచేస్తున్నారని తెలిపారు. దాదాపు 50 మంది కార్మికులకు ప్రతి నెలా వేతనం ఇవ్వడం లేదని అన్నారు. అసలే తక్కువ వేతనం రూ 12 వేలు మాత్రమే ఇస్తున్నారని.. అది కూడా దాదాపు 5 నెలలుగా ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వేతనాలు ఇవ్వాలని కార్మికులు ఎన్ని సార్లు మొరపెట్టుకున్న ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) బాలాపూర్ మండల నాయకులు యాదయ్య, సీఐటీయూ బాలాపూర్ మండల కన్వీనర్ శేఖర్ యాదవ్, పారిశుధ్య కార్మికులు ఆంజనేయులు, నరసింహ, ఈశ్వరమ్మ, మల్లమ్మ, సరిత, సుధా కార్మికులు పాల్గొన్నారు.



జేబు దొంగను పట్టించిన ఆర్టీసీ డ్రైవర్

నవతెలంగాణ-హాయత్‌నగర్

ఆర్టీసీ డ్రైవర్ తన విధులను నిర్వహించడంతో పాటుగా ఒక జేబు దొంగను పట్టుకుని శభాష్ అనిపించుకున్నాడు. ఎల్బీనగర్ క్రైమ్ ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హాయత్ నగర్ 1 డిపో లో ఆర్టీసీ డ్రైవర్ గా పనిచేస్తున్న రాపోలు చక్రపాణి ఈనెల 22న రోజు మాదిరిగానే చౌటుప్పల్ నుండి ఎల్బీ నగర్ వరకు విధులు నిర్వహిస్తున్నాడు. ఎల్బీ నగర్ బస్ స్టాప్ వద్ద చౌటుప్పల్‌కు వెళ్లేందుకు బస్‌ను ఆపగా ఒక్కసారిగా జనం గుంపులో కొందరు జేబు దొంగలు రావడం గమనించిన చక్రపాణి.. వారిని తన ఫోన్ లో వీడియో తీయసాగాడు. అందులో ఒకరు గమనించి అతని ఫోన్ లాక్కున్నారు. దీంతో చక్రపాణి అతన్ని పట్టుకుని ఎల్బీనగర్ పోలీసులకు అప్పగించారు. ఈనెల 19న కూడా అబ్దుల్లాపూర్ మెట్ దాటాక తుర్కాన్ పేటలో ఇదే బస్సులో ఇదే గ్యాంగ్ ఓ వద్దుడి వద్ద నుండి 50వేలు అపహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అతనితో పాటు విధులు నిర్వహిస్తున్న కండక్టర్‌ను సైతం ప్రయాణికులు అభినందించారు.



ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి

నవతెలంగాణ-ఎల్‌బీనగర్

జీహెచ్ఎంసీ ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి హేమంత కేశవ్ పాటిల్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం హేమంత కేశవ్ పాటిల్ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన పంకజంను జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. ఇదిలా ఉండగా హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్.తిప్పర్తి యాదయ్య మర్యాద పూర్వకంగా నూతన జోనల్ కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.



మా భూములు మాగ్గావాలి

- 2014లో పేదలకు భూదాన్‌బోర్డు పట్టా
- ప్లాట్ స్థలాన్ని రేణుక వెంచర్ ఆక్రమిస్తోందంటూ బాధితుల ఆవేదన



నవతెలంగాణ-పెద్ద అంబర్‌పేట్

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో తమ భూములు తమకు కావాలంటూ పేదలు వేడుకుంటున్నారు. 2014లో భూదాన్ బోర్డుకు చెందిన స్థలంలో పేదలకు పట్టాలు మంజూరు చేశారని.. అయితే ఆర్థిక స్థోమత లేక, పైగా పక్కనే దుర్గంధం వెదజల్లే కాల్వ ఉండడంతో అప్పట్లో ఇండ్లు కట్టుకోలేదని వారు చెబుతున్నారు. అయితే ఇప్పుడు ఇండ్లు కట్టుకుంటుంటే రియల్టర్స్ బెదిరిస్తున్నారని వారు వాపోతున్నారు. పేదలకిచ్చిన భూదాన భూమిని కాజేయాలని రేణుకా వెంచర్ యజమానులు చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన పేదలపై రౌడీయిజం, బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకోని తమకు న్యాయం చేయాలని పేదలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని భూధాన్ కాలనీలో సర్వే నెంబర్ 281/1లో ఉన్న భూదాన్ బోర్డుకు చెందిన భూమిలో 2014లో అప్పటి భూదాన్ బోర్డు చైర్మెన్ రాజేందర్‌రెడ్డి హయాంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలను మంజూరు చేశారు. జయప్రకాశ్‌గనర్ కాలనీలో 100 గజాల చొప్పున పేదలకు పట్టాలిచ్చారు. పట్టాలు పొందిన పేదలకు అప్పట్లో కరెంట్ మీటర్లు కూడా మంజూరయ్యాయి. పట్టాలిచ్చిన స్థలంలో ఇండ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో పాటు అప్పట్లో పక్కనే ఉన్న మురికి కాల్వ ఇబ్బందిగా ఉండేది. భరించలేనంతగా దుర్గంధం వెదజల్లే పెద్ద మురికి కాల్వ ఉండడం వల్ల అక్కడ నివాసం ఉండలేకపోయారు. దాంతో అప్పట్లో పేదలు అక్కడ ఇండ్లు నిర్మించుకోలేక పోయారు. రాజీవ్ గహకల్ప ఇండ్లలో కిరాయికి ఉంటూ జీవనం సాగించారు. ఇంటి అద్దెలు భరించలేక తమ ప్లాట్‌లోనే చిన్నపాటి ఇండ్లు కట్టుకునేందుకు సిద్ధపడ్డారు. సర్వే నెంబర్ 281/1లో ఇచ్చిన 100 గజాల ప్లాట్లల్లో రేకుల ఇండ్లు కట్టుకునేందుకు ప్రయత్నించారు. రేకులతో ఇండ్లు కట్టుకోగా అట్టి స్థలాన్ని కాజయాలని రియల్టర్లు చూస్తూ బెదిరింపులకు దిగుతున్నారు. రేకుల ఇండ్లు కట్టుకుంటే కూల్చివేశారు.

పేదల స్థలం పక్కనే 278 సర్వే నెంబర్‌లో రేణుక వెంచర్ ఉంది. ఆ వెంచర్‌కు చెందిన వ్యక్తులు భూదాన్ బోర్డు వాళ్ల ఇచ్చిన ఇంటి భూమిని కాజేయాలని చూస్తున్నారు. భూదాన్ బోర్డు ఇచ్చిన ప్లాట్ స్థలంలో ఇండ్లు కట్టుకోకుండా అడ్డగిస్తూ రౌడీలతో బెదిరిస్తున్నారు. స్థలం తమదంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఆరు నెలలుగా దౌర్జన్యం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతుండడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. రౌడీయిజం చేస్తూ బెదిరిస్తున్న వ్యక్తులపై చట్ట పరంగా చర్యలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

15 రోజుల్లో హద్దులు చూపిస్తాము

సర్వేనెంబర్ 278/1, భూధాన్ పట్టా ఉన్నది, 278/2, 277. వీరికి హద్దులు తెలియక కొట్లాడుకుంటున్నారు. సీఐ, నేను భూమి దగ్గరికి వెళ్ళాము. సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేసేంతవరకు భూమి పైకి ఎవరూ వెళ్లొద్దని చెప్పాము. 15 రోజులలో వారికి బార్డర్స్ చూపిస్తాము.

-అబ్దుల్లాపూర్‌మెట్ ఎమ్మార్వో రవీందర్

ఇండ్లు కట్టుకుంటుంటే బెదిరిస్తున్నారు



భూదాన్ బోర్డు చైర్మెన్ రాజేందర్‌రెడ్డి ఉన్నప్పుడు 2014లో మాకు ఇంటి స్థలం మంజూరు చేశారు. అప్పటి నుంచి ఆ ప్లాట్‌లో మేమే ఉంటున్నాం. అప్పట్లో మురికి కాల్వ వల్ల ఇండ్లు కట్టుకోలేకపోయాం. ఆరు నెలల క్రితం నుంచి మా ప్లాట్‌లో ఇండ్లు నిర్మించుకుంటుంటే రేణుక వెంచర్ వాళ్లు కూల్చి వేస్తున్నారు. రాంబాబు, లక్ష్మణ్ అనే వ్యక్తులు రౌడీలను తోలి బెదిరిస్తు న్నారు. మాపై దౌర్జన్యం చేసి మా స్థలాన్ని కాజేయాలని చూస్తున్న వారిపై చట్ట రీత్య చర్యలు తీసుకోవాలి. పేదలమైన మాకు న్యాయం చేయాలి.

-బీమనపల్లి యాదయ్య

వేగం ముఖ్యం కాదు దిశ ముఖ్యం..

- రాంగ్ సైడ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తే భారీ జరిమానా
- జి. శంకర్ రాజు

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట



వేగం ముఖ్యం కాదు దిశ ముఖ్యమని అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్సిట్యూట్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సోమవారం జి. శంకర్ రాజు, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్సిట్యూట్, బేగంపేట సిబ్బంది తపస్య జూనియర్ కాలేజ్, ఖిల్వత్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో 2023లో రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసినందుకు 5,23,382 కేసులు నమోదు అయ్యా యన్నారు. 2022తో పోలిస్తే ఈ సంఖ్య 86శాతం పెరిగిందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ. 5వేల వరకు జరిమానా, మూడు నెలల జైలు శిక్షను కూడా విధిస్తారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాల నడుపుతూ అనేక నేరాలకు, దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి వాహనానికి నెంబర్ స్పష్టంగా కనిపించే విధంగా నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని, లేనియెడల సెక్షన్ 80 (ఎ) 177 ఎంవీ ఆక్ట్ క్రింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు . ఎక్కువగా యువత ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారన్నారు. ద్విచక్రవాహనం నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. 2023 నాటికి హైదరాబాద్‌లో దాదాపు 56.9 లక్షల ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, అందులో 18 లక్షల మందికి పైగా హెల్మెట్ ధరించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ తబస్సుమ్ ఫాతిమా, వైస్ ప్రిన్సిపాల్- సిద్దు వారి సిబ్బంది ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్, మహమ్మద్ అయాన్-పీసీ శ్రీ.కృష్ణ, హెచ్ అధికారి (టీటీఐ బేగంపేట) హీరో మోటార్ శ్రావణ్ కుమార్, సుమారు 250 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఐదేండ్ల జైలు శిక్ష

నవతెలంగాణ-హాయత్‌నగర్

పోక్సో కేసులో నిందితుడికి 5సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నేరస్తుడు పంచాయతీ రాజ్ కాలనీ, గుర్రంగూడ, బాలాపూర్ మండలానికి చెందిన బి.మల్లికార్జున్‌పై మీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చిన తదనంతరం కోర్టు ముందు తగిన ఆధారాలు సమర్పించ గా పోక్సో చట్టం ప్రకారం శిక్ష విధించారు. ఎల్.బి.నగర్‌లోని ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి నిందితుడిని సోమవారం దోషిగా నిర్ధారించి కేసులో నిందితు డికి 5 సం.కఠిన కారాగార శిక్ష, రూ. 10,000/- జరిమానా విధించబ డింది. బాధితురాలికి నష్టపరిహారం రూ. లక్ష ప్రభుత్వం నుంచి అందించారు.

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

నవతెలంగాణ-మీర్‌పేట్

ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్లో మునిగి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందిన ఘటన మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీమవరం చెందిన శ్రీనివాస్ రావు కొడుకు సంపత్ కుమార్ (26) ఆర్ఎన్ రెడ్డి నగర్‌లోని హాస్టల్లో ఉంటూ టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి నాదర్ గుల్‌లోని జీఎస్ఆర్ స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లాడు. స్నేహితులు చూసే లోపే పూర్తిగా మునిగి చనిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపారు.

పొంగిన డ్రయినేజీతో వ్యాధుల ముప్పు

నవతెలంగాణ-కొత్తపేట

కొత్తపేటకు చెందిన ఫ్రూట్ మార్కెట్ గోడ ప్రాంగణంలో ఒక అపార్ట్మెంట్ ముందు ఉన్న డ్రయినేజీ ఉప్పొంగడంతో గోడకు అనుకొని నిలిచి ఉన్న వ్యర్థాలలో మురుగునీరు చేరింది. దాంతో దోమలు ఈగలు చేరి స్థానికులు డెంగ్యూ మలేరియా మొదలగు వ్యాధులకు గురి అయ్యే అవకాశం ఉంది. అలాగే ఈ వ్యర్థాలను మూగజీవులు తింటున్నాయి. అవి తినడంతో రోగాలకు గురై మరణించే అవకాశం ఉంది. కావున దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఫ్లైఓవర్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-వనస్థలిపురం

ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని పనామా వద్ద నూతనంగా జరుగుతున్న ఫ్లైఓవర్ పనులను ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చింతలకుంట దాటాక 150 మీటర్ల అనంతరం ఇట్టి ఫ్లైఓవర్ ప్రారంభం అయ్యి సుష్మ జంక్షన్ ఇవతల వరకు ముగుస్తుందని తెలిపారు. దాదాపు 850 మీటర్ల మేర ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఇట్టి ఫ్లైఓవర్ సకాలంలో పూర్తయితే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని తెలిపారు. అలాగే చంపాపేట డిమార్ట్ దగ్గర ఒక ఫ్లై ఓవర్, బి.ఎన్.రెడ్డి.నగర్ సర్కిల్ వద్ద మరో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే ప్రధాన ట్రాఫిక్ సమస్యలు ఉన్న ప్రదేశాల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాసులు నిర్మించి తీవ్రమైన ట్రాఫిక్ సమస్యల నుంచి ప్రజలకు విముక్తి చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, భద్రత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నడిరోడ్డుపై స్కూల్ బస్సులు..!



నవతెలంగాణ-కొత్తపేట

కొత్తపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం పక్కన ఉన్న నారాయణ స్కూల్ క్యాంపస్ చెందిన స్కూల్ బస్సులు నడిరోడ్డుపై నిలిపి పిల్లలను దింపుతుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దాంతో ఇబ్బందులు పడుతున్నామని అటువైపు నాగోల్‌కు వెళ్తున్న ద్విచక్రవాహనదారుల, పాదచార్లు వాపోతున్నారు. స్కూల్ యాజమాన్యం తగు జాగ్రత్తలు పాటించాలని వాహనదారులు కోరుతున్నారు.

పార్కులో పనికిరాని చెట్లు

నవతెలంగాణ-కొత్తపేట



కొత్తపేట్ సత్యా నగర్ పరిహార క్షేత్రం దగ్గరలో గల పార్కు స్థలంలో వార్డు నెంబర్ 21 సర్కిల్ నెంబర్ 5 పార్కులో పనికిరాని చెట్లు మొలుస్తున్నాయి. వర్షాకాలం మొదలవటంతో పార్క్ లోపల కాంపౌండ్ గోడ చుట్టూ విపరీతమైన చెట్లు, ఓపెన్ స్థలంలో గడ్డి పిచ్చి చెట్లు మొలవటంతో పిల్లలకుచ పెద్దలకు ఇబ్బందికరంగా మారింది. దీని ద్వారా పాములు తేలు మొదలగు విష కీటకాలు చేరే అవకాశం ఉంది. కావున దీనిపై జీహెచ్ఎంసి సిబ్బంది పట్టించుకోని శుభ్రపరచాలని సత్యానగర్ కాలనీవాసులు విన్నవించుకుంటున్నారు.

ఆదిత్య భారత్ బజార్‌ను ప్రారంభించిన దేప భాస్కర్ రెడ్డి



నవతెలంగాణ-చైతన్యపురి

రామకష్ణాపురం డివిజన్ అల్కాపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య భారత్ బజార్‌ను కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి సోమవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులను అందిస్తే వినియోగదారులు ఆదరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, పున్న గణేష్ నేత, గట్ల రవీంద్ర, జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్, సైదులు, శ్రీధర్,శ్రవణ్, శశి యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, విప్లవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్

నవతెలంగాణ-వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్ లోని సుష్మ వద్ద భూగర్భ డ్రయినేజీ మాన్ హోల్ నుంచి రోడ్డు మురుగు నీరు ప్రవహిస్తుంది. సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి స్వయంగా దగ్గర ఉండి సంబంధిత సిబ్బందితో సమస్యను పరిష్కరించారు.



ప్రజావాణితో ప్రజలకు ఎంతో మేలు : కమిషనర్



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు అన్నారు. సోమవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతి పత్రాలను స్వీకరించారు. సుమారు 33 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. ప్రజావాణిలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ భిక్షపతి, టీపీవో అలీ పాషా, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా : కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

కాప్రా పరిధిలోని చర్లపల్లి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. సోమవారం శ్రీ విఘ్నేశ్వర డబల్ బెడ్ రూం అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా తమ కాలనీలో మౌలిక సదుపాయాలే కల్పించాలని వినతి పత్రం అందజేశారు. కరెంటు లిఫ్ట్ వాటర్ ఎలక్ట్రిసిటీ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో కార్పొరేటర్ డబుల్ బెడ్ రూం ఏఈతో పాటు వివిధ శాఖల అధికారులను సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. 10 నుంచి 15 రోజుల వ్యవధిలో పనులు కంప్లీట్ చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేష్, వైస్ ప్రెసిడెంట్ హిమబిందు, జాయింట్ సెక్రటరీ మధు, ట్రెజరర్ సయ్యద్ జహంగీర్ పాష, ఆర్గనైజర్ మహేష్, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-ఉప్పల్

రామంతాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్‌లో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే నెహ్రూ నగర్‌లో అధికారులతో కలిసి పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్‌రావు, మహిపాల్‌రెడ్డి, సంక్షేమ సంఘం ప్రతినిధులు జి.నర్సింగ్‌రావు, కృష్ణ, ఉపేందర్, నరసింహ, బాలకృష్ణ గౌడ్, రాము, సేనాపతి తదితరులున్నారు.

పరిశుభ్రత పాటించని, ఆస్పత్రి, హోటళ్లపై చర్యలు తీసుకుంటాం

- ఉప కమిషనర్ ఆంజనేయులు



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ సర్కిల్ పరిధిలో పరిశుభ్రత పాటించని ఆస్పత్రులు, హోటల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు అన్నారు. సోమవారం తమ సిబ్బందితో కలిసి పలు ఆస్పత్రులు, హోటళ్లల్లో ఆకస్మి క తనిఖీ చేశారు. ఇందులో భాగంగా టీఎక్స్ ఆస్పత్రిలో తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రిలోని రోగులకు సప్లై చేయడానికి ఉపయోగించే కిచెన్ తనిఖీ చేయగా కిచెన్ అన్ హైజినిగా ఉండడం, కిచెన్ వెంటిలేషన్ సిస్టం సరిగా లేనందున రూ.50 వేల జరిమానా విధించారు. ప్రతి ఆస్పత్రిని, హోటల్స్, ఫంక్షన్ హాల్స్‌లో తనిఖీ చేయాలని పారిశుధ్య విభాగం సెక్షన్ హెడ్ చందనను, సానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించినారు. పరిశుభ్రత పాటించని హోటల్స్‌పై, ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆహార పదార్థాలను తినుబండారాలను తయారు చేసే హోటల్స్, బేకరీలు, స్వీట్‌హౌస్, ఫంక్షన్ హాల్స్, లాడ్జింగ్స్, టిఫిన్ సెంటర్స్‌ను తనిఖీ చేయాలని సూచించారు. వ్యాపార స్థలాల నుంచి వెలువడే చెత్తాచెదారాన్ని మున్సిపల్ స్వచ్ఛ ఆటోకు అందజ సేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త వేసినందుకు ప్రతి నెలా స్వచ్ఛ ఆటో వారికి డబ్బు చెల్లించాలని పేర్కొన్నారు. వర్ష కాలం కావడంతో ఆహార పదార్థా లను నాణ్యతగా ఇవ్వాలన్నారు. ఎవరూ నిల్వ చేసిన ఆహార పదార్థాలు విక్రయించవద్దని తెలిపారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను కస్టమర్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ



నవతెలంగాణ-కాప్రా

సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయిరాం నగర్ కాలనీలో ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ ప్రారంభోత్సవానికి వినూత్న సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఎండీ నామిని వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ అనంతరం కుట్టు మిషన్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ నల్లబోతుల నిత్యానంద, ట్రైనర్స్ మమత, కాలనీ మెంబర్స్ సౌజన్య, శిరీష, శ్రీదేవి, అబ్రహం పాల్గొన్నారు.

సీఐ అంజయ్యను కలిసిన పత్తి కుమార్



నవతెలంగాణ-కాప్రా

కుషాయి గూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై సీఐ అంజయ్యను మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు, కాప్రా డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పత్తి కుమార్, సింగం కిరణ్, సతీష్ యాదవ్, సందీప్ రెడ్డి సాయికుమార్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం సహాయనిధి ఎల్‌వోసీ చెక్కు అందజేత



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ డివిజన్ సూర్యనగర్ కాలనీకి చెందిన జి. సంవృత్తి అనారోగ్యానికి గురైంది. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించడానికి కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు సాయిగౌడ్, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద రూ.2,50,000 వేలు విలువ చేసే ఎల్‌వోసీ పత్రాన్ని బాధితురాలి కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్వతాలు, బజారు జగన్నాథ్‌గౌడ్, విఠల్ నాయక్ పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ప్రజావాణికి 15 ఫిర్యాదులు



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ జలమండలి కార్యాలయంలో సోమవారం జీఎం సంతోష్ కుమార్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్లు సత్యనారాయణ, ఆసిఫ్ అలీ, రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణికి చిల్కానగర్, ఉప్పల్ ప్రజల నుంచి 15ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కాలనీల్లో డ్రయినేజీ, వాటర్ లికేజీలు సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

బడ్జెట్ కేటాయించకుండా ..

నాణ్యమైన భోజనం ఎలా సాధ్యం





- సీఐటీయూ రాష్ట్ర నాయకులు డీజీ.నర్సింహారావు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ప్రజావాణిలో వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

బడ్జెట్ కేటాయించకుండా నాణ్యమైన భోజనం అందించాలంటే ఎలా సాధ్యమని సీఐటీయూ రాష్ట్ర నాయకులు డీజీ.నర్సింహరావు ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఉన్నికృష్ణన్ అధ్యక్షతన వహించి.. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, గుడ్ల బిల్లు వెంటనే విడుదల చేయాలనీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేలు ఇవ్వాలని కోరారు. డీజీ.నరసింహరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయనీ, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, వంట చేసి పెడుతున్నారని తెలిపారు. దీంతో కార్మికులు అప్పులపాలౌతున్నారనీ, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పాఠశాలలు పునర్:ప్రారంభం అయ్యాయనీ, ఇప్పటికే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనీ, పైగా రాగి జావ పోయాలి, బిల్లులు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. బిల్లులు విడుదల చేయకుండా వండటం సాధ్యం కాదనీ, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని కోరారు. పెరిగిన వేతనం కొన్ని జిల్లాలు, కొన్ని మండలాల్లో మాత్రమే ఇచ్చారనీ, అది కూడా నెల నెలా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఒకపక్క ధరలు ఆకాశాన్నంటుతున్నాయనీ, పెరిగిన ధరలకనుగుణంగా పిల్లలకిచ్చే మెనూ ఛార్జీలు పెంచడం లేదన్నారు. కార్మికుల వేతనాలు పెరగకపోగా ఉన్న వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయనీ, కార్మికులకు ఇచ్చే వేతనమే తక్కువ అనీ, అది కూడా రాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదనీ, మెనూ ఛార్జీలు పెంచాలనీ, కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేసి వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని కోరారు. వారానికి 3 కోడిగుడ్లు పెట్టాలనీ, రాగి జావ పోయాలని ఒత్తిడి చేస్తున్నారనీ, గుడ్డుకు కేటాయించిన బడ్జెట్ రూ.2 సరిపోవడం లేదనీ, 3 గుడ్లు పెట్టడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలనీ, లేదా అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసినట్టుగా మధ్యాహ్న భోజన పథకానికి కూడా సప్లయ్ చేయాలని కోరారు. రాగి జావ ఖర్చులకు డబ్బులు ఇవ్వాలనీ, కార్మికులకు అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రమంతటా గృహలక్ష్మి పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనానికి కూడా గ్యాస్ సిలిండర్ రూ.500 ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం వెంటనే అమలు చేయాలనీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎ.అశోక్, ఉపాధ్యక్షుడు కిష్టప్ప, ఎస్.శ్రీనివాస్, మధ్యాహ్న భోజన జిల్లా అధ్యక్షురాలు ప్రేమలత, నాయకులు సువర్ణ, పద్మ, భాగ్య, విజయలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

నీట్ సమస్యపై కిషన్‌రెడ్డి చొరవ చూపాలి

- సోషలిస్టు పార్టీ (ఇండియా) రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్రారెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

నీట్ పరీక్షలో నష్ట పోయిన తెలుగు విద్యార్థులకు న్యాయం చేసేందుకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి చొరవ చుపాలని, లేని పక్షంలో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని సోషలిస్ట్ రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి అన్నారు. సోమవారం పీర్జాదిగూడ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకల కారణంగా తెలుగు విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ..మెడికల్ విద్య కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ (అండర్ గ్రాడ్యుయేషన్) పేపర్ అవకతవకలు జరగడం దారుణమన్నారు. ఈ పరీక్షను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్.టీ.ఎ) వ్యవహరించిన తీరు అనుమానాలకు తావు ఇస్తుందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రోజున నీట్ ఫలితాలు విడుదల చేయడం, హర్యానాలో ఒకే సెంటర్ లో 08 మందికి టాప్ ర్యాంక్‌లు రావడమే అనుమానాలకు నిదర్శనం అన్నారు. తెలంగాణ 7 లక్షలపైగా విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. గ్రేస్ మార్కులు పేరుతో ఎంత సమయం లేట్‌గా విద్యార్థులు పరీక్ష రాసారో అంతే మార్కులు ఇచ్చారని తెలిపారు. అందుకే నీట్ పరీక్ష అవకతవకలుపై సుప్రీంకోర్టు జడ్జీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం స్పందించేలా ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి సోషలిస్ట్ పార్టీ (ఇండియా) రాష్ట్ర కార్యదర్శి రాజేష్ అధ్యక్షత వహించారు.

సోషలిస్టు పార్టీ (ఇండియా)లో చేరికలు

కాంట్రాక్ట్ మున్సిపల్ సిబ్బంది, సర్వే డిపార్ట్మెంట్ సిబ్బంది 100 మంది సోషలిస్టు పార్టీ (ఇండియా) పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి పార్టీ కండవా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ రాజేష్, కల్చరల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ కాశీం, రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు శివరాత్రి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన్ వర్మ, సంతోష్, మోహన్, సుమంత్, మురళి, మధు, లికిత, ఎస్ రాజేశ్వరి, ఎం. ప్రియాంక, వై. సౌజన్య, జి ఝాన్సీ, విశాల్ తదితరులున్నారు.

సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అల్వాల్ డివిజన్ ప్రజల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మాజీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దండుగుల వెంకటేష్, మల్కాజిగిరి కోకన్వీనర్ మల్లికార్జున గౌడ్ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వల్లభ్ నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ను అల్వాల్ ప్రాంతానికి తరలించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతి మండలంలో సబ్ రిజిస్ట్రార్ ఉంటుందని, కేవలం అల్వాల్‌లోనే లేకపోవడం శోచనీయమన్నారు. అల్వాల్ ప్రాంతం వారికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కొంత మందికి ఎక్కడుందో కూడా తెలియదని తెలిపారు. తక్షణమే సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ను అల్వాల్‌కు తరలించే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఎంసీ నర్సింహారెడ్డి, స్వామి నారాయణ, సాంబయ్య, మల్లికార్జున యాదవ్, పద్మిని, అజిత్ సాయి, జేఏసీ నాయకుడు సురేందర్‌రెడ్డి, ఆనంద్, జస్వంత్, ప్రదీప్, రమేష్, సుజాత, పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులపై కేసు నమోదు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రాంగ్ రూట్‌లో వెళ్తున్న 12మంది ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనదారులు నంబర్ ప్లేట్ తప్పనిసరిగా కనపడేలా చూసుకోవాలన్నారు. మధ్యలో ఒక నంబర్ తీసేయడం, స్టిక్కర్లు అతికించడం, చెరిపి వేయడం లాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపి ప్రమాదాలను కోరి తెచ్చుకోవద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, వారు పట్టుబడితే వాహన యజమానికి లేదా సంబంధిత వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా పడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ ఏర్పాటు చేయాలి

- ప్రజావాణిలో సీఐటీయూ మెమోరండం



నవతెలంగాన-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణ, ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ ప్రజావాణిలో మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా కె.ఉన్నికృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజా సమస్యలపై నిరసన తెలుపడానికి ధర్నా పాయింట్ లేదనీ, కలెక్టరేట్ గేట్ ఎదుటే ధర్నా చేస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. ప్రజాసమస్యలపై నిరసన చేయడానికి వచ్చేవారు కూడా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే ధర్నా పాయింట్ ఏర్పాటు చేయాలనీ, మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని కోరారు.

ప్లాట్ల వివాదమే ప్రాణాలు తీసింది



మృతుడు మహేష్ (ఫైల్)

నవతెలంగాణ-ఘట్కేసర్

ప్లాట్ల వివాదంలో జోక్యం చేసుకొని తమ ఆస్తిని కాజేసేందుకు యత్నిస్తున్నాడని కక్షపెంచుకున్న ఇద్దరు వ్యక్తులు ఘట్కేసర్ మాజీ ఎంపీటీసీ గడ్డం మహేష్‌ను హత్య చేసి డంపింగ్ యార్డులో పాతిపెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్కేసర్ మున్సిపాలిటీ అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన మాజీ ఎంపీటీసీ గడ్డం మహేష్ అదే కాలనీకి చెందిన శ్రీనివాస్(36) అలియాస్ చిన్న, కడుపోల్ల ప్రవీణ్(24)లకు ప్లాట్ల వివాదం ఉంది. తాము కబ్జాలో ఉన్న ప్లాట్లను కొనుగోలు చేసుకోని న్యాయస్థానం ద్వారా స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నాడని కక్షతో మహేష్‌ను చంపాలని శ్రీనివాస్, ప్రవీణ్ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈనెల 14న ఘట్కేసర్ బైపాస్‌లోని మహేష్ రియల్ ఎస్టేట్ కార్యాలయానికి వస్తే ప్లాట్ల వివాదం చర్చించుకుందామని మహేష్‌కు చెప్పాగా అతను నగరంలో ఉన్నానని తెలిపారు. మరుసటి రోజు (ఈనెల 15న) మహేష్ ఆఫీస్‌లో వారు కూర్చొని మాట్లాడుతూ మహేష్ కళ్లలో కారం చల్లి కర్రలతో దాడి చేయడంతో మృతిచెందాడు. చనిపోయాక ఆఫీస్ షెట్టర్ వేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. శ్రీనివాస్, ప్రవీణ్‌లు మరో ఇద్దరి సహాయంతో రాత్రికి తిరిగి వచ్చి మృతదేహాన్ని కొండాపూర్ సమీపంలోని డంపింగ్‌యార్డులో పాతిపెట్టారు. ఆరు రోజులైనా తన అన్న రాలేదని మహేష్ తమ్ముడు గడ్డం విఠల్ ఈ నెల 21న ఘట్కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ పుటేజీలు, మహేష్ కాల్ లిస్టు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారని తెలుసుకున్న నిందితులు ఆదివారం రాత్రి మల్కాగిరి డీసీపీ పద్మజారెడ్డి నేరం అంగీకరించి లొంగిపోయారు. ఘట్కేసర్ సీఐ సైదులు నిందితులను అదుపులోకి తీసుకోని హత్య జరిగిన తీరు, శవాన్ని పాతిపెట్టిన ప్రదేశాన్ని పరిశీలించారు. సోమవారం ఉదయం మల్కాజిగిరి ఏసీసీ చక్రపాణి ఆధ్వర్యంలో శవాన్ని వెలికితీశారు. డిప్యూటీ తహసీల్దారు సందీప్‌రెడ్డి సమక్షంలో శవానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం చేశాక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. హత్యకు పాల్పడిన ఇద్దరితో పాటు పాతిపెట్టడానికి సహకరించిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ హత్యతో సంబంధం ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

'ఎంఎల్‌ఆర్ఐటీ'ని సందర్శించిన

డీకేపీటీఓ, ఎంఎస్‌ఎంఈ ప్రతినిధులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

డానిష్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీస్ (డీకేపీటీఓ), మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఎంఎల్‌ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు, కిర్‌స్టెన్ క్లైర్ స్కాట్, డికెపీటీఓ ప్రిన్సిపల్ అడ్వైజర్, దహలేర్ప్ పల్సన్ డీకేపీటీఓ ప్రిన్సిపల్ అడ్వైజర్, డాక్టర్ లూయిస్ బోయిసెన్, భారతదేశానికి ఐపీఆర్ కౌన్సెలర్, డెన్మార్క్ రాయబార కార్యాలయం, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్ కుమార్, నితిన్ కుమార్ శర్మ అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ. 2019లో ఎంఎల్‌ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో స్థాపించిన మేథో సంపత్తి ఫెసిలిటేషన్ సెంటర్ గురించి పూర్తి అవగాహన పొందడం వీరి సందర్శన లక్ష్యం. దీనికి ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ, ఈ కేంద్రం దేశంలోని ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌లు, విద్యావేత్తలు,పరిశోధన సంస్థలు, వ్యవస్థాపకులు, పరిశోధకులకు అంకితం చేయబడింది. డ్రాఫ్టింగ్ నుంచి ఐపీఆర్‌ల మంజూరు వరకు ఉత్తమ ఐపీ సేవలను అందించడం, ఆలోచనలను సురక్షితమైన మార్కెట్ ఉత్పత్తులుగా మార్చడానికి సాంకేతిక సంప్రదింపులు అందించడం ద్వారా మేథో సంపత్తిని రక్షించడానికి కేంద్రం సహాయపడుతుంది. ఎంఎల్‌ఆర్ఐటీ చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రతినిధులను సాదరంగా స్వాగతించారు. ఆవిష్కరణలను పెంపొందించడం, మేథో సంపత్తిని రక్షించడంలో సంస్థ నిబద్ధతను వివరించారు. ప్రొఫెసర్, ఐపీఎఫ్‌సీ హెడ్ డాక్టర్ ఎ. వివేక్ ఆనంద్ ఐపీఎఫ్‌సీ కేంద్రం ముఖ్య కార్యకలాపాలు, విజయాలను అందించారు. ఎంఎస్ఎంఈ, డానిష్ ప్రతినిధులు ఎంఎల్‌ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి సౌకర్యాలను సందర్శించారు. వారు ఐపీఎఫ్‌సీ లబ్దిదారులతో సంభాషించారు. ఐపీఎఫ్‌సీ ముఖ్య కార్యక్రమాలు, కార్యకలాపాలపై అంతర్దృష్టులను పొందారు. పరిశోధన, వ్యవస్థాపక స్ఫూర్తి, ఉత్తమ ఐపీ సేవలను అందించడంలో నిబద్ధత ప్రాక్టికల్ అప్లికేషన్‌లపై ఇనిస్టిట్యూట్ ప్రాముఖ్యతను ప్రతినిధి బృందం ఆకట్టుకుంది. ఎంఎల్‌ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్కాజిగిరి మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆవిష్కర్తలకు ఆదర్శప్రాయమైన సేవ చేసినందుకు మొత్తం ఐపీఎఫ్‌సీ బృందాన్ని అభినందించారు. 'ఎంఎల్‌ఆర్ఐటీలోని ఐపీఎఫ్‌సీ బృందం ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడంలో, మేథో సంపత్తి హక్కులను పరిరక్షించడంలో విశేషమైన పని చేసింది. వారి ప్రయత్నాలు అవగాహనను పెంపొందించడమే కాకుండా మా స్థానిక ప్రతిభావంతులకు గుర్తింపు, రక్షణను అందేలా చేశాయి' అని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
మంగళవారం | జూన్ 25, 2024 | www.navatelangana.com



శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీష్ గౌడ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండి, కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్ గూడలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో నిధులు మంజూరు చేసిన నిధులతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన పైఅంతస్తు భవనాన్ని సోమవారం స్టాండింగ్ కమిటీ సభ్యులు, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి నూతన పైఅంతస్తు భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యారులు అరుణ, జ్యోతి, సత్యమ్మ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ మందడి సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహ మ్మద్ ఖాజా, స్థానిక నాయకులు పంజా రాంచందర్ ముదిరాజ్, ఎర్ల ప్రభాకర్, పాల్గొన్నారు. నవతెలంగాణ-బాలానగర్

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి



- కార్పొరేటర్ రషీదా మహ్మద్ రఫీ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ ప్రాంతంలో గల సర్వే నెంబర్ 155లో ప్రభుత్వ స్థలము కాపాడాలని స్థానిక కార్పొరేటర్ రషీదా మొహమ్మద్ రఫీ అన్నారు. ఈ మేరకు సోమవారం గాజులరామారం సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో స్థానిక బస్తీ వాసులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో అధికారులు సర్వే చేసిన ప్రకారం 3500 గజాలు ఉండేదని దాని ప్రకారం 26 లక్షలు నిధులు నిధులు మంజూరు చేయించామని తెలిపారు. కానీ ఇప్పుడు 1200 గజాలు తక్కువ చేసి ప్రహరీ గోడ ఎ ప్రకారం కడుతున్నారని ఉప కమిషనర్ మల్లారెడ్డిని ప్రశ్నించారు. స్కేచ్ మ్యాప్‌ను డీసీ ఆమెకు చూపించారు. కానీ దానిలో ఎలాంటి కొలుతలు లేవని రెవిన్యూ వారి స్టాంప్ లేవు కానీ మీరు ఎలా కడుతున్నారని నిలదీశారు. 2018లో సర్వే చేసినప్పుడు 3500 గజాలు వుంది. కానీ ఇప్పుడు సర్వే ఎలా మారిందన్నారు. బస్తీ ఏర్పడ్డ అప్పటినుంచి ఈ స్థలం 3500 గజాలు వుంది కానీ ఇప్పుడు ఎందుకు మారుతుందన్నారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల కానీ, హాస్పిటల్ కట్టాలని కేటాయించడం జరిగిందన్నారు. కబ్జాకు గురి కాకుండా ఆ స్థలాన్ని కాపాడుతామని అన్నారు. తక్షణమే పనులను నిలిపివేయాలని ఆమెతోపాటు స్థానికులు కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు మహమ్మద్ రఫీ, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించండి..



- లేదంటే ఆందోళన ఉధృతం చేస్తాం : ఏఐటీయూసీ

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట

సమస్యలు పరిష్కరించండి లేదంటే ఆందోళన ఉధృతం చేస్తాం అని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిల్స్ నందు విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య మహిళలను నైట్ డ్యూటీలు, చెత్త పాయింట్స్ వద్ద వేయడం తక్షణమే ఆపాలని ఏఐటీయూసీ తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్‌ని కలసి వినతి పత్రం అందజేశారు. నైట్ డ్యూటీలు ఆపనిపక్షంలో పెద్ద ఎత్తున మహిళా కార్మికులతో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఏసు రత్నం, మున్సిపల్ సంగం జిల్లా అధ్యక్షులు డి.రాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాసులు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వి.హరినాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సోమవార కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను కలిసి పలు వినతులు, ఆహ్వానాలు అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సంక్షేమ సంఘాలె కాలనీల అభివృద్ధికి వారధులు....

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధిలో భాగ్య లక్ష్మి కాలనీ సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి, కాలని వాసులు సోమవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్‌ని తన నివాసం వద్ద కార్యాలయంలో కలిసిన సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలియచేసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ సంఘం సభ్యులందరు ఐకమత్యంగా ఉంటూ కాలని అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.రాములు యాదవ్, బుచ్చి రెడ్డి, నరేందర్ రెడ్డి, నాగి రెడ్డి, గంగాధర్, బాలాచారి, మహేష్, రఘు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సూచించారు. వెక్టార్ వ్యాధుల నివారణ, దోమల నియంత్రణ కార్యకలాపాల కోసం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం డ్రై యాక్టివిటీ, వారం వారం డ్రైడే కార్యక్రమాల గురించి ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ సంధ్యారాణి సవివరంగా వివరించారు. ప్రతి శుక్రవారం తప్పకుండా ఇంటింటికి వెళ్లి జ్వరసంబంధమైన కేసులను ముందుగానే గుర్తించడం, స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యకలాపాలు, వ్యాధులు మరింత వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి సానుకూల కేసులు గుర్తించిన ప్రాంతాల్లో తక్షణమే స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. దోమల లార్వాల నివారణకు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, బయో-ఫ్రెండ్లీ నివారణ చర్యలను పాటించాలనీ, పారిశుధ్య ప్రయత్నాలను మెరుగుపర్చాలని మున్సిపల్ కమిషనర్‌లకు సూచించారు. మలేరియా నిరోధక మాసం, డెంగ్యూ నిరోధక మాసాలను పాటించి అవగాహన పెంచడానికి, నివారణ వ్యూహాలను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇద్దరు డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జిల్లా పబ్లిక్ రిలేషన్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిషరీస్, డిప్యూటీ డైరెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' అర్జీలను త్వరగా పరిష్కరించాలి



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
- ప్రజావాణికి 121 అర్జీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి లో అదనపు కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలసి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటి ఫిర్యాదులను అప్పుడే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి 121 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎనిమిదేండ్ల పాపకు దెబ్బతిన్న లిగమెంట్

- ఆటల్లో మోకాలికి దెబ్బ.. పూర్తిగా చిరిగిపోయిన ఏసీఎల్
- ఆర్థోస్కోపీతో నయం చేసిన కిమ్స్ కొండాపూర్ వైద్యులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎనిమిదేండ్లు.. అంటే ఆటపాటలతో సరదాగా గడిపేసే వయసు. ఎగురుతూ, దూకుతూ ఉంటారు. అలా స్కూల్లో కుంగ్‌ఫూ నేర్చుకుంటున్న సమయంలోనే ఓ పాపకు మోకాలికి దెబ్బ తగిలింది. కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన ఆ పాప తల్లిదండ్రులు నాలుగు రోజుల పాటు నగరంలోని పలు ఆస్పత్రుల్లో చూపించారు. చివరకు కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు. ఇక్కడ ఆమెకు శస్త్రచికిత్స చేసిన కన్సల్టెంట్ ఆర్థోస్కోపీ, స్పోర్ట్స్ మెడిసిన్ సర్జన్ డాక్టర్ ప్రతాప్ పర్వతనేని వివరాలను వెల్లడించారు. "ఎనిమిదేండ్ల పాపకు అనుకోకుండా మోకాలికి గాయం కావడంతో నడవడం, మెట్లు ఎక్కడం లాంటి విషయాల్లో ఇబ్బంది ఏర్పడింది. వెంటనే దగ్గరలోని వైద్యులకు చూపిస్తే ఎంఆర్ఐ తీయించారు. అందులో యాంటీరియర్ క్రూషియేట్ లిగమెంట్ (ఏసీఎల్) చిరిగినట్టు తెలియడంతో ఆపరేషన్ చేయాలని సూచించారు. దీంతో పాప తల్లిదండ్రులు కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు. ఆ పాపకు అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాత మోకాలిలోని ఏసీఎల్ పూర్తిగా టేర్ అయ్యిందని గుర్తించాం. ఆర్థోస్కోపీ అనే శస్త్రచికిత్స చేశాం. ఆస్పత్రికి చెందిన ఫిజియోథెరపిస్టుల బందం పూర్తిస్థాయిలో ఫిజియోథెరపీ సేవలు అందించారు. దాంతో ఇప్పుడు ఆ పాప మళ్లీ స్కూలుకు వెళ్తూ, మెట్లు ఎక్కడమే కాకుండా.. ఇంతకు ముందు లాగే ఆటల్లో కూడా పాల్గొనగలుగుతోంది. ఎనిమిదేండ్ల వయసులోనే ఇలా జరగడంచాలా అరుదు. ఏడాదికి ఒకటి లేదా రెండు కేసులు మాత్రమే ఇలాంటివి వస్తాయి. కిమ్స్ హాస్పిటల్స్‌లో ఎనిమిదేండ్ల వయసున్న పిల్లలకు ఏసీఎల్ టేర్ శస్త్రచికిత్స చేయడం ఇదే మొదటి సారి. ఎదుగుదల, ఫిజియోథెరిపీల కోసం ప్రతి ఏడాదీ పాపాను డాక్టర్ కి తప్పకుండా చూపించాలి. ఈ కేసులో మాత్రం పాప పూర్తిస్థాయిలో కోలుకుందని" తెలిపారు.

పండగ సాయన్న జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా జరపాలి



- చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి ఉదయ్ ముదిరాజ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ముదిరాజ్ కులస్తులకు సరైన ప్రాధాన్యత ఇవ్వాలని పండగ సాయన్న జయంతి, వర్ధంతిని అధికారికంగా జరపాలని చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి ఉదయ్ ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకునగరంలోని బి.సి.సి.ఈ.భవన్‌లో ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో 'ముదిరాజుల సామాజిక న్యాయం కోసం-హక్కుల కోసం దిశ-దశ' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మ్యానిఫెస్టోలో ముదిరాజ్‌లకు సంబంధించి ఏవైతే డిమాండ్లను చెప్పిందో, వాటిని వెంటనే అమలు చేసే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలి పేర్కొన్నారు. ముదిరాజ్‌లను(బీసీ-డి నుంచి బీసీ -ఎ) లోకి మార్చే ప్రక్రియను వేగవంతం చెయ్యాలన్నారు. గత ప్రభుత్వం ముదిరాజులకు కోకాపేటలో కేటాయించిన ముదిరాజ్ కుల భవనానికి సంబంధించిన సమీక్ష చేసి, ఆ నిర్మాణానికి నిధులు కేటాయించాలని తెలిపారు. ముదిరాజ్ లకు 8 నామినేటెడ్ చైర్మెన్ పదవులను కేటాయించాలని కోరారు. ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు మొర రవికాంత్ ముదిరాజ్, అనిల్ కుమార్ ముదిరాజ్, శ్రీహరి ముదిరాజ్, నరసింహులు ముదిరాజ్, శివ ముదిరాజ్, ఉదయ్ ముదిరాజ్, బ్రహ్మ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ ప్రజల సహకారాలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. ఈ మేరకు సోమవారం డివిజన్ పరిధిలోని సంజయ్ పురి కాలనీలో దాదాపు రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం తాను శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, భూగర్భ డ్రయినేజీ తదితర మౌలిక వసతుల కల్పన కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా సీసీ రోడ్ల పనులు నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు సుదగాని మల్లేష్ గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అప్పల శ్రీనివాస్, కిరణ్, లక్ష్మణరావు, యాదగిరి, మాణిక్ చంద్, రవికుమార్, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమమహేష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రెగ్యులర్ తహసీల్దార్‌ను వెంటనే నియమించాలని కుత్బుల్లాపూర్ మండల సీపీఐ కార్యదర్శి ఈ.ఉమామహేష్ ఉన్నతాధికారులకు కోరారు. కుత్బుల్లాపూర్ మండల తహసిల్దార్‌గా రెహమాన్ వచ్చినప్పటి నుంచి ఎన్నికల పని అంటూ కార్యాలయానికి రాకుండా తాత్సారం చేయడంతో పాటు, గత రెండు నెలల నుంచి ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం జగద్గిరిగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడు నాలుగు నెలల క్రితం ఎన్నికలు ఉండడంతో ఆ సమయంలో కార్యాలయానికి రాలేదని.. ఇప్పుడేమో సెలవుల్లో ఉండటం వల్ల ఇన్‌చార్జి తహసిల్దార్‌ను నియమించడం వల్ల ప్రజలకు వివిధ రకాల పత్రాల మంజూరులో ఇబ్బందులకు గురవుతున్నారని పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలు అయిపోయి ప్రభుత్వం పూర్తిగా ప్రజా సంక్షేమ పథకాలు అమలులో నిమగ్నమై ఉండాలని, అదే విధంగా భూములు కబ్జాలు చేసిన వారి నుంచి భూమిని స్వాధీనం చేసుకోవాలని, వెంటనే అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో గత సంవత్సరం వర్షాల వల్ల మునిగిపోయిన ప్రాంతాల్లో ఈ సారి అలా జరగకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గాజులరామరం రావినారాయన రెడ్డి నగర్‌లో ఉన్న ఓపెన్ నాలలపై స్లాబులు వేయాలని, గతంలో జరిగిన ప్రాణ నష్టాల నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఇప్పటి నుంచే పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, డ్రయినేజీ పొంగకుండా పైకప్పులను తీసివేయ్యాలని తెలిపారు.

ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రం సోమవారం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో బోయినపల్లి కి చెందిన శ్రీ రాఘవేంద్ర హాస్పిటల్ వారి సౌజన్యంతో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లోని ప్రతివారం బస్తీలలో వారం నుంచి పది రోజులకు ఒకసారి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలకు అవసరమైన బి.పి, షుగర్ థైరాయిడ్, కంటి వివిధ రకాల వంటి సమస్యలను పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైతే రుచికిత కూడా చేపించే ఏర్పాట్లు చేయించడం జరుగుతుందని, కాబట్టి ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఆరోగ్య కేంద్రం శిబిరంలో దాదాపు 180 మంది పలు సమస్యలకు చికిత్సలో చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర హాస్పిటల్ ప్రతినిధి సునీల్, శశి, బాగయ్య, సురేందర్ నాయుడు, సలావుద్దీన్, బాలమణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి



- డివైఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పసుల అంజయ్య



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పసుల అంజయ్య అన్నారు. షాపూర్ నగర్ ప్రభుత్వ పాఠశాలను ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, మహిళా సంఘ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ...షాపూర్ నగర్ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలో చాలా సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. పాఠశాలలు ప్రారంభమై 12 రోజులు అవుతున్నప్పటికీ కనీస సౌకర్యాలైన విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, లైట్లు, ఫ్యాన్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కొరత.. పరిశుధ్య సిబ్బంది కొరత వల్ల, పాడైపోయిన మూత్రశాలలు పోగా, ఉన్న మూత్రశాలలను శుభ్రం చేసేవారు లేరు. వాష్ రూమ్‌ల పరిస్థితి దారుణంగా పేర్కొన్నారు. విద్యార్థులు సూక్ష్మజీవుల బారినపడి అనారోగ్యాలకు గురవుతున్నారని మండిపడ్డారు. వర్షాలు కురిస్తే పాఠశాల భవనాలు ఊరుస్తుండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తరగతి గదులు సక్రమంగా లేవని, పదో తరగతి చదివే విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువాయాయని విచారం వ్యక్తం చేశారు. గతంలో పాఠశాలను ప్రజా ప్రతినిధులు సందర్శించారని... అందులో ఒక ప్రజాప్రతినిధి ఏకంగా పాఠశాలను దత్తత తీసుకుంటున్నానని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలలో కనీస మౌలిక వసతులైన తాగు నీరు, టాయిలెట్లు, లైట్లు తదితర అవసరాలను సమకూర్చేందుకు "అమ్మ ఆదర్శ పాఠశాలల" పథకానికి శ్రీకారం చుట్టినప్పటికీ పాఠశాలలో ఏ ఒక్క పని కూడా ప్రారంభం కాలేదు.. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ, అటెండర్, పిటి సార్ నియమాకాలను వెంటనే చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికై నూతన ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించి, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యలపై స్పందించని పక్షంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షులు స్వాతి, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే రైతు పక్షపాతి ప్రభుత్వం



- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు పక్షపాతి ప్రభుత్వం అని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం మంత్రివర్గ సమావేశం ఏర్పాటుచేసి ఏకగ్రీవంగా రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని తీర్మానం చేశారు. దీనికి హర్షం వ్యక్తం చేస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు షేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి రైతు బజార్‌లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి రైతులు కాంగ్రెస్ నేతలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి 2 లక్షల రుణమాఫీ చేయించడం ఇది చరిత్రలో సురిస్థిరమన్నారు. గత ఎన్నికల్లో రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తానని మ్యానిఫెస్టోలో పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తూ వారికి ఇబ్బందులు తలెత్తితే ఆదుకునే ప్రభుత్వమని ఈ సందర్భంగా తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అయినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని పేర్కొన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తరచు విమర్శలు చేస్తూ ప్రజలకు దూరమవుతున్నారని ఇక ఆ పార్టీ దుకాణం బంద్ అవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసలైన నిరుపేదల కోసం పనిచేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేసే కాంగ్రెస్ పక్షాన ప్రజలు ఉన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య బదిలీ

- దాదాపు రెండేండ్లపాటు జిల్లాకు సేవలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అభిషేక్ అగస్త్య బదిలీ అయ్యారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2020 బ్యాక్‌కు చెందిన అభిషేక్ అగస్త్య దాదాపు రెండేండ్లపాటు జిల్లాకు సేవలందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
మంగళవారం | జూన్ 25, 2024 | www.navatelangana.com

బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసు అధికారులు, వివిధ శాఖలు, ఆలయాల కమిటీ సభ్యులు, అధికారులతో హిందీ నగర్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు అందరూ సమన్వయంతో బోనాల పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆయా డివిజన్ ల కార్పొరేటర్లు లాల్ సింగ్, రాకేష్ జైస్వాల్, డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, నాంపల్లి మండల తహసీల్దార్ ప్రేమ్ కుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్, అబిడ్స్ ఏసీపీ ఏ చంద్రశేఖర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజనీర్ ఏ నాగమణి, అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ రెడ్డి, ఎండోమెంట్ అధికారి బి సురేఖ, బేగంబజార్ డి ఈ ఎల్ నెహ్రూ నాయక్, జలమండలి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-ముషీరాబాద్



కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం చిక్కడపల్లి అశోక్ నగర్ సెంట్రల్ లైబ్రరీ చౌరస్తాలో నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్‌తో గ్రూప్ 2,3 పోస్టుల సంఖ్యను పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా జాబ్ క్యాలెండర్, పోస్టులు పెంపు విషయంలో ఎలాంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెంటనే మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులకు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- పార్టీని నమ్ముకున్న వారికి తగిన ప్రాధాన్యత
- వీహెచ్ హనుమంతరావు



నవతెలంగాణ-అంబర్‌పేట

కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఎల్లప్పుడూ లభిస్తుందని మాజీ పీసీసీ అధ్యక్షులు మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంతరావు అన్నారు. సోమవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని రెడ్ బిల్డింగ్ వద్ద వీహెచ్ హనుమంతరావు నివాసంలో ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా తోలుపునూరి కృష్ణగౌడ్ మర్యాదపూర్వకంగా విహెచ్ హనుమంతరావుని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాలకు కాంగ్రెస్‌లో అధిక ప్రాధాన్యత లభిస్తుందని పార్టీ పదవులు పొందిన వారు భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి లకుపతి యాదగిరి గౌడ్, మాజీ లేబర్ బోర్డ్ వైస్ ఛైర్మన్ నాగభూషణం, గడ్డం లక్ష్మణ్, సత్తిబాబు, పంజాల వెంకట్ గౌడ్, కిషోర్ కుమార్, దిలీప్ నేత, గడ్డం శశి గౌడ్, నరేష్, విజయ్ కుమార్, జితేందర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టరేట్‌లో శానిటేషన్, కార్యాలయాల నిర్వహణ బాగుండాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి, ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును త్వరితగతిన పరిష్కారం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 76 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ ప్రజా ప్రతినిధులు సమర్పించిన దరఖాస్తులు, ప్రజా దర్బార్, మిస్లేనియస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 76అర్జీలు స్వీకరించారు. 28 గృహ నిర్మాణ శాఖవి.. కాగా, 9 హైదరా బాద్ ఆర్డీవో, 6 సికింద్రాబాద్ ఆర్డీవో, 3 జిల్లా సంక్షేమ అధికారి, 2 డీఈవో, 28 ఇతర శాఖలకు సంబంధించినవి వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్లలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఒక వరం

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్



ప్రతి పేదింటి ఆడపిల్లకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఒక వరమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాంనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ కమిటీ హాల్‌లో లబ్ధిదారులకు ముషీరాబాద్, హిమాయత్‌నగర్ మండల్ కార్యాలయానికి సంబంధించిన 136 కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి పేదింటి ఆడపిల్ల పెద్దన్నగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి చెక్కులను అందించే వారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు ముఠా జై సింహ, డివిజన్ ప్రెసిడెంట్‌లు ఆర్.మోజెస్, కొండ శ్రీధర్ రెడ్డి, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, ముదారపు రాకేష్ కుమార్, వల్లాల శ్యామ్ యాదవ్, మీడియా ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్ , హిమాయత్ నగర్ డిప్యూటీ ఎంఆర్‌ఓ రఘు విష్ణు, మండల్ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీలపైన కేంద్ర ప్రభుత్వ మొండివైఖరి విడనాడాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

వచ్చే కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.2లక్షల కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణముఖ్య అతిథిగా హాజరై సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపులో బీసీలు విస్మరిస్తే దేశ వ్యాప్తంగా బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం బీసీ అభివృద్ధి సంక్షేమానికి బడ్జెట్ కేటాయించకుండా అన్యాయం చేస్తుందని ఆయన ఆరోపించారు. కాలేజీ విద్యార్థులకు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ స్కీము, ఫీజు రియంబర్స్మెంట్ స్కీమ్ దేశంలోని అన్ని రాష్ట్రాలలో ప్రవేశ పెట్టాలని కేంద్రమంత్రికి సూచించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘంరాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, సూర్యనారాయణ, కోల జనార్ధన్, నందగోపాల్, వంశీ కృష్ణ, జయంతి, వేణు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి మండలం పరిధిలోని లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్ చెక్కులను పంపిణీ చేశారు. వారి వెంట నాంపల్లి మండల తహసీల్దార్, ఎం.ప్రేమ్ కుమార్, కార్పొరేటర్లు లాల్ సింగ్, డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, రాకేష్ జైస్వాల్, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండు యాదవ్, అనిల్ తదితరులు

కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలి



- ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ

నవతెలంగాణ-ముషీరాబాద్

కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) ఆధ్వర్యంలో కార్మిక భవన్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం రాష్ట్ర లేబర్ అసిస్టెంట్ కమిషనర్ గంగాధర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలను మరింత వేగవంతం చేసిందన్నారు. మొదటి మీటింగ్ లోనే గతంలో అక్రమంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ ను అమలుకు పూనుకుందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశ కార్మిక వర్గం పోరాటం చేస్తుంటే దానిని పట్టించుకోకుండా కార్మికుల శ్రమను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే కార్మికులు వారి హక్కులు కోల్పోతారన్నారు. లోయర్ ట్యాంక్ బండ్ లో ఉన్న డీబీఆర్ మిల్లు కార్మికులు న్యాయంగా వాళ్లకు రావాల్సిన నష్టపరిహారం, గ్రాటిట్యూటి కోసం 30 సంవత్సరాలుగా అడుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం కానీ, లేబర్ కమిషనర్ కానీ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కోర్టుల్లో కేసులు ఉన్నాయని కాలయాపన చేయడం తగదన్నారు. న్యాయం గా వాళ్లకు రావలసిన గ్రాటిట్యూటీ వెంటనే చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అరుణ, మల్లన్న, ఉపాధ్యక్షులు మనమ్మ, మంగ్ల, సహాయ కార్యదర్శి సత్యనారాయణ కోశాధికారి కుమార్ నాయకులు సత్యనారాయణ సరోజ, లీల, మంజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'27న బొజ్జా తారకం 85వ జయంతి పుస్తకాల ఆవిష్కరణ సభ'

- బొజ్జా తారకం ట్రస్ట్ సమన్వయకర్త గనుమల జ్ఞానేశ్వర్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

హక్కుల దిక్సూచి, పీడిత ప్రజల గొంతుక, హైకోర్టు సీనియర్ న్యాయవాది బొజ్జా తారకం 85వ జయంతి-పుస్తకాల ఆవిష్కరణ సభ ఈ నెల 27వ తేదీ సాయంత్రం 6 గంటలకు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహిస్తున్నామని బొజ్జా తారకం ట్రస్ట్ సమన్వయకర్త గనుమల జ్ఞానేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ జి.చంద్రయ్య, విశిష్ట అతిథులుగా ప్రొఫెసర్ జి.సత్యనారాయణ, ప్రొఫెసర్ ఈ.సుధారాణి, మాజీ జిల్లా జడ్జి, హైకోర్టు న్యాయవాది నిమ్మ నారాయణ, ప్రముఖ స్త్రీవాద రచయిత్రి కొండవీటి సత్యవతి పాల్గొంటారని, సభకు ప్రముఖ కవి, విమర్శకులు డాక్టర్ శిఖామణి అధ్యక్షత వహిస్తారని ఆయన చెప్పారు.ఈ సభలో 'బుద్ధుని ప్రవచనం', 'బొజ్జా తారకం వ్యాసాలు', 'స్వతంత్ర భారతదేశం స్త్రీలకు గుప్పెడు ధూళినే మిగిల్చిందా?' అనే పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుందని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు రావడం అభినందనీయం..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఉపాధ్యాయులకు పదోన్నతులు రావడం అభినందనీయమని ఎస్వీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సదానంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజాకుమారిలు అన్నారు. పురానాపూల్ ఎస్వీనగర్‌లోని అఫ్జల్ గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు పండితులు డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, పీఈటీ శ్రీనివాస్‌లకు పదోన్నతులు రావడంతో పురానాపూల్ ఎస్వీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సదానంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజా కుమారి అసోసియేషన్ సభ్యులు సోమవారం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్టర్.ఎస్.విజయ భాస్కర్‌కు స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) శ్రీనివాస్‌కు ఫిజికల్ డైరెక్టర్‌గా పదోన్నతులు రావడం పట్ల సంతోషం వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రద్యుమ్న రెడ్డి, బల్వంత్ రెడ్డి, డాక్టర్.సురేష్ కుమార్, కౌసర్ ఫాతిమా, జూనియర్ అసిస్టెంట్ మోహినుద్దీన్ ఎస్వీ.నగర్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు పెద్ద యెత్తున పాల్గొన్నారు.

బోనాల పండుగకు అందరూ సహకరించాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



బోనాల పండుగ ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా అంగర వైభవంగా ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా జరుపుకోవాలని అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి అన్నారు. సోమవారం కాచిగూడ తుల్జా భవన్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కాచిగూడ ఏసీపీ రఘు పోలీసు ఉన్నతాధికారులు డిప్యూటీ కమిషనర్ దివాకర్ బాబు, ఎండోమెంట్ అధికారి బాలాజీ, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆలయాల కమిటీలు వారు ఎప్పటికప్పుడు స్థానిక అధికారులతో జీహెచ్ఎంసీ సిబ్బంది శానిటేషన్ ట్రాఫిక్ పోలీసులు లాండ్ ఆర్డర్ వాళ్లతో అవసరమైన సమాచారాన్ని ఇవ్వాలని ప్రజల కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు కూడా ఆలయాల వద్ద క్రమశిక్షణ పాటించి అధికారులకు సహకరించాలని సూచించారు.

విద్యార్థుల భవిష్యత్తుతో మోడీ ప్రభుత్వం ఆటలు సరికాదు

యువజనుల సమస్యలపై డీవైఎఫ్ఐ కమిటీ సర్వే.. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్

నవతెలంగాణ-ధూల్‌పేట్



మోడీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటం సరికాదని డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ అన్నారు. జంగంమెట్ డివిజన్‌లో యువజనుల సమస్యలపై డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామాలలో, పట్టణాలలో, బస్తీలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం యువత ఉపాధి లేక నష్టపోతున్నారు. పీజీ లు, డిగ్రీలు, ఇంటర్మీడియట్, టెన్త్ చదువుకొని నేడు షాపిం గ్ మాల్‌లో స్విగ్గి, జొమాటోలు, ఓలా, ఉబర్ లతో రోడ్డున పడుతున్నారన్నారు. ఇలా చిన్న చిన్న పనులు చేసుకుంటున్న పరిస్థితి నెలకొందన్నారు. తెలంగాణ రాష్ట్ర భారత ప్రజాతంత్ర యువజన సమైక్య(డీవైఎఫ్ఐ), సర్వేలలో వచ్చిన సమస్యలపై పోరాటల రూపకల్పన చేసేందుకు రాష్ట్ర కమిటీ కార్యాచరణ తీసుకుందని ఆయన తెలిపారు. దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే విద్యార్థుల పరీక్షలలో ఈ పద్ధతులు వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. బీజేపీ అధికారంలో ఉన్నంటి రాష్ట్రాల్లోనే ఎందుకు పేపర్ లీకేజీలు అవుతాయని ఆయన ప్రశ్నించారు. ఈ సర్వేలో భాగంగానే డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ విద్యార్థులను, యువకులను చైతన్యవంతం చేస్తూ హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించా లని, డ్రగ్స్ మాఫియాని అంతం చేసేవరకు డీవైఎఫ్ఐ కృషి ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శ్రీను, మహేష్, రాజేష్, స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్



యువత మత్తు పదార్థాలకు గంజాయికి దూరంగా ఉండాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సూచించారు. సోమ వారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత జీవితాలు దుర్భరమవుతున్నాయన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. ఇప్పటికే బృందాలుగా ఏర్పడి ప్రత్యేక తనిఖీలు చేపట్టామన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురి కాకుండా చూడాలని కోరారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందు కొచ్చి గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలన్నారు.

'సహజ యోగ ద్వారా మనిషికి ప్రశాంతత'

- ఈ నెల 26 నుంచి 30 వరకు 'హైదరాబాద్ రియలైజేషన్ టూర్'
- సహజ యోగ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు గౌరు కృష్ణ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రతి మనిషికి సహజ యోగ ద్వారా మనసుకు ప్రశాంతత, ఆనందం కలుగుతాయని సహజ యోగ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు గౌరు కృష్ణ తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'సహజ యోగ మహోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరు కృష్ణ మాట్లాడుతూ పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి స్థాపించిన సహజ యోగ నేడు సుమారు 170 దేశాల్లో వ్యాపించి, సహజ యోగ ధ్యాన కేంద్రాలుగా స్థాపించబడ్డాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది కుల, మత, ప్రాంత, భాష, వయస్సుతో నిమిత్తం లేకుండా సహజ యోగ సాధన చేస్తూ దైనందిన జీవితంలో తాము ఎదుర్కొంటున్న శారీరక, మానసిక, భావోద్వేగ సమస్యలను పరిష్కరించుకుంటూ, ఆధ్యాత్మికమైన సంతృప్తిని పొందుతున్నామన్నారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు 'హైదరాబాద్ రియలైజేషన్ టూర్' పేరుతో 'సహజ యోగ మహోత్సవాన్ని' పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు 500 మంది ప్రతినిధులు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు, విదేశాల నుండి హాజరవుతారని చెప్పారు. వీరందరూ ఈ నాలుగు రోజులు ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు సహజ యోగా పరిచయ కార్యక్రమాలు, స్ట్రెస్ మానేజ్‌మెంట్ సెషన్స్‌ను వివిధ కళాశాలలు, పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం మెగా సహజ యోగ పరిచయ, సంగీత కార్యక్రమాలు నిర్వహించబడతా యని చెప్పారు. ఈ నెల 28న సాయంత్రం 5 గంటలకు సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, 29న సాయంత్రం 5 గంటలకు నిజాం కాలేజ్ గ్రౌండ్స్, పీజేఆర్ స్టేడియం చందానగర్ లో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమాలు నిర్వహించబడుతాయని ఆయన తెలిపారు. సహజ యోగ అభ్యాసం ఇప్పుడు, ఎప్పుడైన ఉచితం అని, ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వివరాల కోసం ఫోన్: 8988 982200లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.సుబ్బిరెడ్డి, రామ్మోహన్ రావు, మల్లారెడ్డి, సుప్రజ, సునీల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య పార్క్ నిర్వాహణను మెరుగుపర్చాలి

- హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య
- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం



నవతెలంగాణ-ముషీరాబాద్



సుందరయ్య పార్క్ నిర్వాహణను మెరుగుపరచాలని హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.వీరయ్య మాట్లాడుతూ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్‌ను గత సంవత్సరం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ఆధునీకరించారు. మరమ్మతులు చేశారు కానీ పార్కు వాకింగ్ ట్రాక్ వర్షం వచ్చిన ప్రతిసారీ నీటితో నిండిపోతుందన్నారు. పార్క్‌లోని ఓపెన్ జిమ్‌లో జిమ్ పరికరాలు విరిగిపోయి నెలలు గడుస్తున్నా రిపేర్లు చేయలేదని అన్నారు.మరికొన్ని పరికరాలు మరమ్మతులకు నోచుకోవడం లేదని, పిల్లల ఆట స్థలంలో కూడా కొన్ని పరికరాలు విరిగిపోయి ఉన్నాయని పార్క్‌లో కొన్నిచోట్ల మొక్కలు ఎండిపోతున్నాయని, గడ్డి పైన ఆటలు ఆడుతున్నా పట్టించుకునే వారు లేరని కొన్ని చెట్లకు రెగ్యులర్‌గా నీటి సరఫరా చేయటం లేదని తెలిపారు. జిమ్ పరిసరాలలో రెగ్యులర్‌గా క్లీన్ చేయడం లేదని, మూత్రశాలలను సక్రమంగా క్లీన్ చేయడం లేదన్నారు. అనేక సమస్యలతో రోజూ పార్కు కు వచ్చే వేలాది మంది సందర్శకులు ఇబ్బందులకు గుర వుతున్నారు. పార్కు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్ని వసతుల తో ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. సహాయ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, నాయకులు కె.రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జి.అనూహ్య రెడ్డికి ప్రతిష్టాత్మక 'సేవారత్న అవార్డు'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



హైదరాబాద్ నగరానికి చెందిన కోవిధ సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ సంఘ సేవకురాలు, కళాబంధు డాక్టర్ జి.అనూహ్య రెడ్డికి ప్రతిష్టాత్మక అరుదైన 'సేవారత్న' అవార్డు లభించింది.సేవా రంగంలో విశేషమైన సేవలు అందించినందుకుగాను యూకే పార్లమెంట్ ఆమెను 'సేవారత్న-2024' (జ్యూవెల్ ఆఫ్ సర్వీసు)అవార్డుతో సత్కరించింది. గతంలో ప్రతిష్టాత్మకమైన 'ప్రైడ్ ఆఫ్ ఇండియా', 'సేవా సామాగ్రి', 'సేవా కౌముధి', 'సేవా భూష ణ్' వంటి అవార్డులను సైతం అనూహ్య రెడ్డి అందుకు న్నారు. సోమవారం లండన్ పార్లమెం ట్ వేదికగా హౌజ్ ఆఫ్ లార్డ్‌లో వరల్డ్‌కప్ క్రికెట్ కౌన్సిల్ (డబ్ల్యూసీసీ) యూకే ఛైర్మన్ డాక్టర్ హరి ఓమ్‌త్యాగి, లండన్ మాజీ ఎంపీ పాల్ స్కలీలు, పార్లమెంట్ బృందం అనుహ్య రెడ్డికి ఈ అవార్డు లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అనూహ్య రెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా పేదలకు నిజాయితీగా సేవలు అందించినందుకు తనకు ఈ గుర్తింపు దక్కింద న్నారు. ఈ అవార్డు పేద ప్రజలకే అంకితం అంటూ అనూహ్య రెడ్డి తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేయాలి

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎంలో పనిచేసు న్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రామ రాజేష్ ఖన్నా అన్నారు. కోఠి డీఎం హెచ్ఎస్ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ.. కరోన సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రోగులకు వైద్య సేవలు అందించామన్నారు. ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. బేసిక్-పే, హెచ్ఆర్ఎండిఎం పాలసీ అమలు చేయాల న్నారు. ఎన్‌హెచ్‌ఎం ప్రతి ఉద్యోగికీ సంవత్సరానికి 35 క్యాజువల్ సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళా ఉద్యోగస్తులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు 180 రోజుల ఇవ్వాలని డిమాండ్ చేశారు. 7 నెలలు పీఆర్‌సీ బకాయిలు వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరిని రెగ్యులర్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ను కోరారు.

ఫీజుల దోపిడి అరికట్టాలి

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని ప్రయివేటు విద్యా సంస్థల్లో అత్యధిక ఫీజుల బహిరంగ దోపిడిని తక్షణమే అరికట్టాలని సామాజిక కార్యకర్త తెలంగాణ శేఖర్ చారి అన్నారు. సోమవారం ఆయన అబిడ్స్ లో ఆయన మాట్లాడుతూ.. ప్రయివేట్ విద్యా సంస్థల యాజ మాన్యాలు అడ్మిషన్ల సందర్భంగా ట్యూషన్, పాఠ్య పుస్తకాల కొనుగోళ్ల ముసుగులో నిరుపేద, బడుగు, బలహీన, సామాన్య, మధ్య తరగతి విద్యార్థుల నుండి లక్షల్లో ఫీజుల దోపిడి చేస్తున్నాయని, జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేట్ విద్యా సంస్థల ప్రభుత్వ గుర్తింపును రద్దు చేయాలని, సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

బోనాల ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు..

నవతెలంగాణ-ధూల్ పేట్

రానున్న బోనాల ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేస్తామని ఫలక్‌నామా సర్కిల్-10 డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, బహదూర్ పుర తహసీల్దార్ కె.చంద్రశేఖర్లు అన్నారు. రానున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ దేవాలయ కమిటీ ప్రతినిధులతో సోమవారం బహదూర్ పుర మండల తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. బహదూర్ పుర, చార్మినార్ వివిధ దేవాలయ కమిటీ ప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పలు అంశాలపై వారితో చర్చించారు. వారు మాట్లాడుతూ.. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

11

నవతెలంగాణ

హైదరాబాద్

HMDA

మంగళవారం | జూన్ 25, 2024 | www.navatelangana.com

బోనాల జాతర ఏర్పాట్ల సమావేశానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-బేగంపేట్

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై జరిగే సమావేశానికి హాజరు కావాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను దేవాదాయ శాఖ అధికారులు ఆహ్వానించారు. సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయ ఈఓ మనోహర్ రెడ్డి సోమవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని నివాసంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. ఈ నెల 26న ఉదయం 10.00 గంటలకు మహంకాళి అమ్మవారి ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటు చేసినట్టు ఈఓ వివరించారు. ముందుగా ఆలయ పండితులు ఎమ్మెల్యేకు ప్రసాదాలు అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ రాంగోపాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

బోనాల పండుగకు కంటోన్మెంట్‌కు అధికంగా నిధులివ్వండి

- జంపన్న ప్రతాప్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఈసారి బోనాల పండుగకు భారీగా నిధులివ్వాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నగరంలో జరగనున్న బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం 20 కోట్ల నిధులను మంజూరు చేయడం అభినందనీయమన్నారు. నిధుల కేటాయింపుల్లో ఇతర నియోజకవర్గాలకు ఇచ్చిన మాదిరిగానే కంటోన్మెంట్‌కు కూడా అదేవిధంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తమ ఆలయాల నిధులకు సంబంధించిన విషయంలో దేవాదాయ శాఖ అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యేకు నిధుల విషయం వివరించాలన్నారు. ఈ ప్రాంతంలోని అన్ని ప్రముఖ దేవాలయాలకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు.

వైద్య విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలి



ఉస్మానియా ఆస్పత్రిలో



గాంధీ ఆస్పత్రిలో

- జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్..
- విధులు బహిష్కరించి ధర్నా..

నవతెలంగాణ - ధూల్ పేట్

వైద్య విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉస్మానియా ఆస్పత్రి ముందు జూనియర్ డాక్టర్లు ధర్నా చేపట్టారు. సోమవారం ఓపీ సేవలు, తాత్కాలిక ఓటీ సేవలను బహిష్కరించి ఉస్మానియా ఆస్పత్రి, కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. వైద్య విద్యార్థులకు వెంటనే స్టై ఫండ్ చెల్లించాలని, గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి, వైద్య విద్యార్థులకు ప్రతి నెలా స్టైఫండ్ చెల్లించాలని...మా వేతనం మా హక్కు అంటూ పెద్దపెట్టున నినా దాలు చేపట్టారు.

ఈ సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసి యేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐజాక్ న్యూటన్, ఉస్మానియా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ దీపాంకర్, ప్రధాన కార్యదర్శి చంద్రి కారెడ్డి తదితరులు మీడియాతో మాట్లాడారు. పెండింగ్లో ఉన్న స్టైఫండ్ వెంటనే చెల్లించాలని గత ఆరు నెలులుగా ప్రభుత్వానికి విన్నవించినా పట్టిం చుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు, తాత్కాలిక ఓటీ సేవలను బహిష్కరించి నిరవధిక సమ్మెకు పూనుకు న్నట్టు తెలిపారు. జూడా ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరుపుతున్నా ఆందోళన విరమించమని చెప్తాన్నారే తప్ప తమ డిమాండ్లపై స్పష్టత లభించలేదన్నారు. గత ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ పూర్తయిన పీజీ వైద్యులకు రూ.2.05 లక్షల వేతనం చెల్లించాలని నిర్ణయించగా, ప్రస్తుత ప్రభుత్వం రూ.92వేలు చెల్లిస్తామని పేర్కొనడాన్ని తీవ్రంగా వ్యతిరేకి స్తున్నట్టు తెలిపా రు. ఎన్ఎంసి గైడెన్స్ ప్రకారం హాస్టల్ వసతి, పని ప్రదేశాల్లో భద్రత పెంచాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో భద్రత పెంచడంతో పాటు పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేసి భద్రతను మరింత పటిష్టం చేసి ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ కల్పించాలన్నారు. గత ఆరేండ్లుగా ప్రభుత్వం ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనం నిర్మిస్తామంటూ జాప్యం చేస్తున్నదని, దీంతో రోగులతో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది కూడా ఇబ్బందులకు గురవుతున్నారని, రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వెంటనే ఉస్మానియా ఆస్పత్రి కొత్త భ వనంపై స్పష్టత ఇవ్వడంతో పాటు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు తక్షణమే స్టైఫండ్ బకాయిలు చెల్లించడంతో పాటు స్టైఫండ్ను రెగ్యుల రైజేషన్ చే సి. ఆర్థిక శాఖ నుండి ఖచ్చిత మైన స్పష్టత ఇవ్వాలని, ప్రతి నెలా ఏ తేదీన చెల్లిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2024-25 సంవ త్సరం మొత్తానికి బడ్జెట్ కేటాయించినట్లు ప్రభు త్వం చెబుతుందని, తాము స మ్మె చేపట్టడంతో ఈ సంవత్సరానికి బడ్జెట్ కేటాయించడం కాదని, ప్రతీ సంవత్సరం స్టైఫండ్ కోసం రెగ్యులర్‌గా బడ్జెట్ కేటాయిస్తామని ప్రభుత్వం స్ప ష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు, ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బేగంపేట : ఇక గాంధీ ఆస్పత్రిలోనూ జూనియర్ డాక్టర్ల నిరవధిక సమ్మె ప్రారంభ మైంది. అత్యవసర సేవలు మినహా ఓపీ,వార్డు విభాగాల వైద్య సేవలు నిలిపి వేసినట్టు జూనియర్ డాక్టర్లు తెలి పారు. సోమవారం గాంధీ ఆస్పత్రిలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ సకాలంలో స్టైఫండ్ చెల్లించడం,సూపర్ స్పెషాలిటీ సీనియర్ వైద్యులకు గౌరవ వేతనం, ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల భద్రత, నీట్ లో 15 శాతం రిజర్వేషన్ తెలంగాణ విద్యార్థులకు కేటాయిం చడం, ఆస్పత్రిలో మౌలిక వైద్య సదు పాయాలు మెరుగు పర్చడం,నూతన వసతి గృహాల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వేతనాల్లో కోతలెలా

- కోత పెట్టిన డబ్బులు వెంటనే ఇవ్వాలి
- సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ - బంజారా హిల్స్..

పారిశుధ్య కార్మికులకు వేతనాల్లో కోతలేంటని..వారికి వేతనాల్లో కట్టైన డబ్బులు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జీహెచ్ఎంసీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నగరంలో ఖైరతాబాద్ సర్కిల్ 18 సర్కిల్ 13 సర్కిల్ 12 లలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనం పూర్తిగా రావడం లేదని తెలిపారు. రూ. 4000 నుంచి రూ. 5000 వరకు వేతనం కట్ అవుతున్నదన్నారు. కొంతమంది కార్మికులకు ఈనెల 2000 నుంచి 3000 వేతనం వచ్చిందని, కొంతమంది కార్మికులు అనారోగ్యంతో మరణిస్తే వారి ప్లేసుల్లో ఇప్పటివరకు ఫిలప్ చేసే పరిస్థితి లేదని అన్నారు. మరి కొంతమంది కార్మికులు అనారోగ్యంతో బా ధ వ డు తు న్నా ర ని తెలిబీపాఎరు. వీరి వల్ల ఉన్నటువంటి కార్మికులకు పని ఒత్తిడి ఎక్కువ కావడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కావున వెంటనే ఖాళీలను పూర్తి చేయాలని కోరారు. అలాగే కార్మికులకు పనిముట్లు సరిగా ఇవ్వడం లేదని, చీపిళ్ళు మూడు నుంచి నాలుగు నెలల వరకు వస్తున్నాయని, రిక్షాలు లేవని.. గంపలు పారలు లేవని.. కొత్తవి ఇవ్వడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు 26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంత మంది కార్మికులకు ఈఎస్, పీఎఫ్ లో ఇబ్బందులు ఉన్నాయని వాటిని సక్రమంగా అమలు చేయాలని కోరారు. పాయింట్స్‌లో అవినీతికి పాల్పడుతున్న సూపర్వైజర్లపై స్వల్ప కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి విట్టల్,నగర కార్యదర్శి ఎం వెంకటేష్, జీహెచ్ఎంసీ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కార్యదర్శి జి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో అమ్మాయిలదే పైచేయి

- ఫస్ట్, సెకండియర్‌లో 75వేల మంది విద్యార్థులకు 34వేల మంది పాస్
- సెకండియర్ ఫలితాల్లో 32.69 శాతం ఉత్తీర్ణత
- ఫస్టియర్ ఇయర్‌లో 55.77శాతం ఉత్తీర్ణత నమోదు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు సోమవారం ఇంటర్ బోర్డు విడుదల చేసింది. ఇందులో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో హైదరాబాద్ జిల్లాలో బాలురకంటే అమ్మాయిలే పైచేయి సాధించారు. ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు మే 25 నుంచి ఈనెల 3వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా పరిధిలో మొత్తం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సంబంధించి జిల్లావ్యాప్తంగా 75,062 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా.. 34,239 మంది పాసై.. 45.61 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలుల విభాగంలో ఫస్టియర్, సెకండియర్ కలిపి 45,274 మంది విద్యార్థులకుగాను 18,482 ఉత్తీర్ణత సాధించారు. ఇక బాలిక విభాగంలో 29,788 గాను 15,757 మంది ఉత్తీర్ణులయ్యారు.

వొకేషనల్ విభాగంలో హైదరాబాద్ 54శాతం..

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ వొకేషనల్ సెకండియర్ విభాగంలో హైదరాబాద్ జిల్లా 54.02 శాతం ఉత్తీర్ణత నమోదు అయ్యింది. ఇక జిల్లావ్యాప్తంగా మొత్తం 3,006 మంది విద్యార్థులు పరీక్షకు హజరు కాగా, 1624 మంది ఉత్తీర్ణత సాధించారు.

కాలనీల్లోనే బ్యాంకుల ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన సేవలు

- జెట్టి గోపీచంద్



నవతెలంగాణ-బంజారా హిల్స్...

వ్యాపార వాణిజ్య ప్రాంతాల్లో కాకుండా కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఉండే నివాసితులకు బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ఈనాడు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ చైర్మెన్ జెట్టి గోపీచంద్ తెలిపారు. కాలనీల్లోనే బ్యాంకులు ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. సంస్థ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా షేక్‌పేట ఓయూ కాలనీలో నూతన బ్రాంచీని సోమవారం ఆయన కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తాము ముందు నుంచి కూడా కమర్షియల్ ప్రాంతాల్లో కాకుండా కాలనీలకు దగ్గరగానే శాఖలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పుడు ఏర్పాటు చేసింది 7వ బ్రాంచీ అని మరో 20 రోజుల్లో నగరంలో కొత్తగా రెండు బ్రాంచీలు ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. 2900 మంది షేర్ హోల్డర్లు, 20 వేల మంది ఖాతాదారులతో తమ బ్యాంకులు నడుస్తున్నాయని, 80 సంవత్సరాల వయసు దాటిన వద్ధులకు సాధారణ వడ్డీతో పాటు అదనపు 1 శాతం వడ్డీని సైతం తాము అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రెహమాన్, డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు, సీనియర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుమార్తెకు ఆర్థిక సహాయం



- రూ. 35వేల చెక్కు అందజేసిన డాక్టర్ ముజీబ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

అకాల మరణం చెందిన చిన్ననాటి స్నేహితుడి కుమార్తె దివ్యకు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్) సోమవారం నాంపల్లి గృహకల్పలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ తన చిన్ననాటి స్నేహితుడు రఘు రెండేండ్ల క్రితం అనుకోని పరిస్థితులలో మృతిచెందాడని, గతేడాది అతని భార్య మరణించడంతో వారి ఏకైక కుమార్తె దివ్య అనాథగా మారిందని గుర్తుచేశారు. మిత్ర ధర్మం ఆచరించి దివ్య ఆలనాపాలనాను తనతో పాటు తన కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకుంటామని భరోసానిచ్చారు. అలాగే దివ్య చదువుతో పాటు వివాహ బాధ్యతనూ తమదేనని అభయం ఇచ్చారు. ఈ సందర్భంగా ఒవైసీ కాలేజీలో చదువుతున్న దివ్య సెకండ్ సెమిస్టర్ ఫీజు రూ.35వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్‌తో పాటు కేంద్ర సంఘం నాయకులు, జిల్లా సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి'



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోనాల ఉత్సవాలు జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19 పరిధిలో ఘనంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని, ప్రజలకు అధికారులు పూర్తిగా సహకరించాలని డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ అన్నారు. సోమవారం యూసుఫ్ గూడాలోని డిప్యూటీ కమిషనర్ ఆఫీసులో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ అధికారుల సూచనల మేరకు ఉత్సవ కమిటీ మెంబర్లు ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మార్వో, జిహెచ్‌ఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఇంజినీర్, ఏఎంఓహెచ్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ, ఈఈ ఎలక్ట్రికల్స్ ,అసిస్టెంట్ ఇంజినీర్లు, పోలీస్ ఆఫీసర్లు ,అన్ని ఆలయాల కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

'గ్రూప్ 2,3 పోస్టులు పెంచాలి'



నవతెలంగాణ-ఓయూ

కాంగ్రెస్ ప్రభుత్వము ఏర్పడిన వెంటనే గ్రూప్ 2, 3 పోస్టులను పెంచి జాబ్ క్యాలెండర్ రూపొందిస్తామని నిరుద్యోగులకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని దక్షిణ భారత జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం తార్నాక లోని ఆయన కార్యాల యంలో ఆయనను నిరుద్యోగ నేతలు కలిసి గ్రూప్ 2,3 పోస్టులు పెంచేలా చూడాలని, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థి ఉద్యమానికి ఎలాగైతే అండగా నిలిచానో అలాగే నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకూ మీతో కలిసి ఉద్యమిస్తానని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో ఏ జనార్ధన్, ఇంద్ర, ప్రసాద్ నాయక్, సిహెచ్ చంద్రశేఖర్, యుగంధర్, మహేష్ కుమార్, చంద్రకుమార్ ఉన్నారు.

ప్రజావాణికి వెల్లువెత్తిన దరఖాస్తులు

- టౌన్ ప్లానింగ్, డబుల్ బెడ్ రూం విన్నపాలే అధికం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్‌ఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్, డబుల్ బెడ్ రూం, ఇంజినీరింగ్ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి ధరఖాస్తులు అధికంగా వచ్చాయి. ప్రజావాణిలో నగరంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలకు చెందిన అధికారులకు పంపించారు. ఈ ప్రజావాణిలో అడిషనల్ కమిషనర్లు కే.శ్రీనివాస్, సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, నళిని పద్మావతి, చంద్ర కాంత్ రెడ్డి, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్ ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్, డబుల్ బెడ్ రూం, ఇంజినీరింగ్ శాఖలకు సంబంధించిన ఎక్కువగా వచ్చాయి. మొత్తం 137 భౌతికంగా విన్నపాలు రాగా 15 విన్నపాలు ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా స్వీకరించారు. భౌతికంగా మొత్తం 137 లలో హౌసింగ్ 53 విన్నపాలు వచ్చాయి. అదే విధంగా టౌన్ ప్లానింగ్ 42, ఇంజినీరింగ్ 15, అడ్మిన్ 6, ఎస్టేట్ 5, ఎలక్ట్రికల్ 2, ట్యాక్స్ 8, ఎంటమాలజీ 1, ట్రేడ్ లైసెన్స్ 1 విన్నపాలు వచ్చాయి. ఇక జీహెచ్‌ఎంసీ పరిధిలో 6 జోన్లలో 105 విన్నపాలు రాగా చార్మినార్ జోన్‌లో 9, సికింద్రాబాద్ జోన్‌లో 12, కూకట్ పల్లి జోన్ లో 49, శేరిలింగంపల్లి జోన్ 21, ఖైరతాబాద్ జోన్ 4, ఎల్బీనగర్ జోన్‌లో 10 విన్నపాలు వచ్చాయి. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన విన్నపాలు ఎక్కువగా వచ్చాయి. టెలిఫోన్ ద్వారా 15 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్, రేషన్ కార్డు, జీహెచ్‌ఎంసీకి సంబంధించినవి కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇతర శాఖలకు చెందిన సమస్యలను ఆయా శాఖలకు పంపించారు. టెలిఫోన్ ద్వారా వచ్చిన సమస్య అతని పేరు మొబైల్ నెంబర్ సమస్య గురించి తెలుసుకొని అడిషనల్ కమిషనర్ సేకరించి సంబంధిత విభాగం ఉన్నతాధికారులకు పరిష్కారం కోసం పంపించారు. ఈ ప్రజావాణిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజీ డా.రాంబాబు, హౌసింగ్ ఎస్ఈ విద్యాసాగర్, డిప్యూటీ సిఈ కె.ఎస్.రెడ్డి, కంట్రోల్ రూం ఓ ఎస్ డి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కాట ఆమ్రపాలి.. ఐఏఎస్ 2010 బ్యాచ్

- అతి చిన్నవయస్సులో ఐఏఎస్‌కు ఎంపికైన వారిలో ఆమ్రపాలీ ఒకరు
- ఆల్ ఇండియా 39వ ర్యాంక్
- కేంద్ర, రాష్ట్ర సర్వీస్‌లల్లో కీలక పదవుల్లో ప్రశంసలు



ఆమ్రపాలి (ఫైల్‌ఫోటో)

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. ఒకేసారి 44 మంది అధికారులను ప్రభుత్వం బదిలీలు చేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం జీవో విడుదల చేశారు. ఈ బదిలీల్లో ఆమ్రపాలిని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా నియమించారు. ఇప్పటికే ఆమ్రపాలి జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్, మూసీ రివర్ ఫ్రంట్ మేనేజింగ్ డైరెక్టర్,'హెచ్‌జీసీఎల్' మేనేజింగ్ డైరెక్టర్, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ కమిషనర్‌గా కూడా ఉన్నారు.

ఐఏఎస్ ఆఫీసర్ కాట ఆమ్రపాలి సొంత గ్రామం ఒంగోలు నగర చివర్లోని ఎన్.అగ్రహారం. ప్రొఫెసర్ కాటా వెంకటరెడ్డి, పద్మావతిలకు మొదటి సంతానం. విశాఖలో ఉన్నత చదువులు చదివారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నోలజీ మద్రాస్ నుంచి ఇంజినీరింగ్‌లో పట్టాను అందుకున్నారు. బెంగుళూర్ నుంచి మాస్టర్స్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిచేసిన ఆమె, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో ఆల్ ఇండియా 39వ ర్యాంక్‌ను సాధించారు. ఐఏఎస్‌కు ఎంపికైన అతి చిన్నవయస్సులో అమ్రపాలీ ఒకరు.

ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో 2010 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారిణిగా విధుల్లో చేరారు. రాష్ట్ర విడిపోయాక తెలంగాణ రాష్ట్రంలో కలెక్టర్‌గా పనిచేశారు. రాష్ట్రంలో ఎంతో మంది సీనియర్ ఐఏఎస్ అధికారులు ఉన్నప్పటికీ ఆమ్రపాలికి కీలక పోస్టులను ప్రభుత్వం అప్పగించింది. 2013లో వికారాబాద్ సబ్‌కలెక్టర్‌గా పనిచేసి, ఆ తరువాత స్త్రీ, శిశు సంక్షేమ శాఖ హైదరాబాద్‌లో పనిచేశారు. 2015 జనవరి నుంచి ఆమె రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత 2016లో తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటుతో ఆమెకు పదోన్నతి కల్పిస్తూ వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల కలెక్టర్‌గా పని చేశారు. 2018 ఎన్నికల సమయంలో అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా పనిచేసిన ఆమ్రపాలి, కేంద్ర ప్రభుత్వంలోకి డిప్యూటేషన్‌పై వెళ్లారు. కేంద్ర సర్వీసులో మొదట కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డికి ప్రయివేటు సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రధాని డిప్యూటీ సెక్రటరీగా పదోన్నతి పొందారు. 2020 సెప్టెంబర్‌లో ప్రధాని కార్యాలయం డిప్యూటీ సెక్రటరీగా నియమితులయ్యారు. అప్పటి నుంచి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకు కేంద్ర సర్వీసుల్లోనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర సర్వీస్‌లో కీలక పదవుల్లో పనిచేసిన అమ్రపాలీ ప్రశంసలు పొందారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి..

- వాటర్‌బోర్డు ఎండీగా అశోక్ రెడ్డి
- భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. ఒకేసారి 44 మంది అధికారులను ప్రభుత్వం బదిలీలు చేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం జీవో విడుదలచేశారు. హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, జీహెచ్ ఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పనిచేసిన ఆమ్రపాలిని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఆ స్థానంలో కొనసాగిన రోనాల్డ్ రోస్‌ను విద్యుత్ శాఖ కమిషనర్‌గా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆయనకు జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీగా అదనపు బాధ్యతలు కేటాయించారు. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా స్నేహా శబరి నియమించారు. మల్టీ జోన్1 ఐజీగా పనిచేస్తున్న ఏ.వీ.రంగనాథ్‌ను జీహెచ్‌ఎంసీ విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్‌గా నియమించారు. జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా హేమంత కేశవ్ పాటిల్, జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అపూర్వ చౌహాన్, జీహెచ్‌ఎంసీ శేర్ లింగం పల్లి జోనల్ కమిషనర్‌గా (నాన్ క్యాడర్) పీ. ఉపేందర్ రెడ్డిని, మూసీ నదీ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పీ.గౌతమిని నియమించారు. ఇదిలావుండగా జలమం డలి ఎండీగా కే.అశోక్ రెడ్డిని నియమించారు. జలమండలి ఎండీగా పనిచేసిన సుదర్శన్ రెడ్డిని జీఏడీ ముఖ్యకార్యదర్శిగా నియమించారు.

సత్వరమే పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కంటోన్మెంట్

సత్వరమే పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం ఓల్డ్ బోయన్ పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, అధికారులతో కలిసి బోయన్ చెరువు మానస సరోవర్ హైట్స్ దగ్గర నాలా డ్రయినేజీ సమస్యలను ఎమ్మెల్యే పరిశీలించారు. అలాగే అధికారులందరితో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో స్థానిక కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదులపై ఎమ్మెల్యే స్పందించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎప్పుడూ లేని విధంగా బోయన్ చెరువులో గుర్రపు డెక్క పేరుకపోవడంతో దానిని అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు దోమల బారినపడి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన నాలా పనులను చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, డ్రయినేజీలు పొంగిపొర్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇలాగే జరిగుతే ప్రజలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ఇకనైనా అధికారులు స్పందించి బోయన్ చెరువులోని గుర్రపు డెక్కన్ నాలా పనులను డ్రయినేజీ, రోడ్లు పనులు చేపట్టాలని అన్నారు. అలాగే వీధి దీపాలు సరిగ్గా వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, విద్యుత్ పనులు కూడా వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, అదేవిధంగా నూతన పనులకు కావలసిన నిధులను, జిల్లా మంత్రులను కలిసి బడ్జెట్ తీసుకువస్తామని ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు అన్నారు .ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, ఇర్ఫాన్, నరేందర్ గౌడ్, మక్కాల నర్సింగ్, జంగయ్య, హరినాథ్, యాదగిరి పాల్గొన్నారు.

26న పాఠశాలలు బంద్

- ఏబీవీపీ

నవతెలంగాణ-ఓయూ

ఈ నెల 26న రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్టు ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ పృథ్వి తేజ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్టు చెప్పారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోవాలి



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-బేగంపేట్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన కార్యాలయం వద్ద 17 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాల కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఆడపడుచుల పెండ్లికి చేయూత అందించి అండగా నిలవాలనే ఆలోచనతోనే దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. లబ్ధిపొందిన వారు తమ పరిసరాలలోని అర్హులైన వారు ప్రతి ఒక్కరు ఉపయోగించుకొనే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, అమీర్ పేట మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, బీఆర్ఎస్ సనత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు అశోక్ యాదవ్, పి.శేఖర్, బలరాం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు కార్పొరేటర్ వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ఆదేశాల మేరకు లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అందజేయాలని కోరుతూ కార్పొరేటర్ సామల హేమ సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే పద్మారావు లెటర్ హెడ్ మీద సీతఫలమండి లోని సుభాష్ చంద్రబోస్ నగర్ లో ఉన్న ఖాళీగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్దిదారులకు అందజేయాలని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే పద్మారావు ఎస్సీ,ఎస్టీ సంఘం వారికి ఇచ్చిన హామీ ప్రకారం బాబు జగ్జీవన్ రామ్, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటుకు చొరవ తీసుకుని ప్రతిష్ఠించడానికి అనుమతించాలని, అలాగే ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ను కోరారు. విగ్రహం ప్రాంగణం చుట్టూ పచ్చదనాన్ని అభివద్ధి చేయడంతో పాటు క్రమనిర్వహణ, విగ్రహ అలంకరణ చర్యలు తీసుకోవాలని కోరినట్టు ఈ లేఖలో ఉన్నాయని కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదిప్ బీఆర్ఎస్ నాయకులు సాగర్,రవీందర్ పాల్గొన్నారు.

ఆదివాసి చిన్నారులకు విద్యాబుద్ధులు



- ఓయూ పూర్వ విద్యార్థులు దాతృత్వం
- ఓయూ రిజిస్ట్రార్ అభినందనలు

నవతెలంగాణ-ఓయూ

సమాజానికి దూరంగా అడవుల్లో జీవనం సాగిస్తున్న ఆదివాసి చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న భీమ్ చిల్డ్రెన్ హ్యాపినెస్ సెంటర్‌ను ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రో. పి. లక్ష్మీనారాయణ సోమవారం సందర్శించారు. అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ములుగు జిల్లా మేడారంకు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న సారలమ్మ గుంపు ఆదివాసీ గూడెంలో ఆయన పర్యటించారు. ఆడివాసీలు సంప్రదాయ నృత్యాలతో రిజిస్ట్రార్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఓయూలో చదువుకున్న విద్యార్థులు ఇస్రం సంతోష్, నరేష్, శిషిందర్ రెడ్డి, గుణమంతరావు మిత్రులతో కలిసి నాలుగేండ్లుగా ఆదివాసి విద్యార్థులకోసం పాఠశాలలు ఏర్పాటు చేయటం. వారికి సమాజం పట్ల ఉన్న బాధ్యతకు నిదర్శనమన్నారు. బి.సి.హెచ్.సి నాలుగో వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొ పి. లక్ష్మీనారాయణ నిర్వాహకులకు వ్యక్తిగతంగా 50 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు. చదువుకు దూరంగా, చదువుకుందామన్నా అవకాశం లేని చిన్నారులను ప్రోత్సహించి ఉన్నత చదవులు చదివేందుకు ప్రోత్సహిస్తున్న సంతోష్ మిత్ర బందాన్ని అభినందించారు. ప్రభుత్వం, పౌర సమాజం నుంచి అవసమరైన సహకారాన్ని తీసుకుని ఈ పాఠశాలలను మరింత అభివద్ధి చేయాలని సూచించారు. దాదాపు 9 ఆదివాసీ గూడాల్లో పాఠశాలలు ఏర్పాటు చేసి ప్రాథమిక విద్య అందజేసి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పేందుకు కషి చేస్తున్నామని ఈ సందర్భంగా సంతోష్ రిజిస్ట్రార్ కు వివరించారు. నాలుగైదు కిలోమీటర్లు నడిచి చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న టీచర్లకు రిజిస్ట్రార్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ నుంచి పలువురు పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు హాజరయ్యారు.

ప్రశాంతంగా కంటోన్మెంట్ బోర్డు సమావేశం...


- మీటింగ్‌కు హాజరైన ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సభ్యుల సమావేశం సోమవారం బోర్డు కార్యాలయంలో వాడివేడిగా జరిగింది. బ్రిగేడియర్ సోమశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఇటీవల నూతనంగా ఎన్నికైన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మొదటిసారి ముఖ్యఅతిథిగా పాల్గొని పలు అంశాలపై చర్చించారు. సమావేశం ప్రారంభం కాగానే బ్రిగేడియర్ సోమ శంకర్ ఆధ్వర్యంలో, సీఈఓ మధుకర్ నాయక్ అధ్యక్షతన అధికారులు నామినేటెడ్ సభ్యుడు ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం సమావేశం ప్రారంభం కాగానే అభివద్ధి పనులపై చర్చించారు . అనంతరం ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ పలు అభివృద్ధి పనులను అధికారుల దష్టికి తీసుకుపోయారు. ముఖ్యంగా తిరుమలగిరిలో గాంధీ కమ్యూనిటీ హాల్‌లో డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని కోరారు. అలాగే ఆ కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు ఉపయోగపడేలా మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌గా నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇంకా ఏ వార్డులోని చెత్త ఆ వార్డులోనే డంపు చేసుకునేదుకు వార్డుల వారీగా డంపింగ్ యార్డ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. బోర్డు పరిధిలోని అన్ని వార్డులలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపడతామని.. అందుకు తగిన స్థలాన్ని అధికారులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు.

శ్రీసాయి విద్యార్థి స్కూల్ విద్యార్థుల అత్యుత్తమ ఫలితాలు





విద్యార్థులకు డిజిటల్ క్లాసులు



ఉచిత భోజన సదుపాయం

- విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దుతున్నాం
- స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కె. ప్రసాద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్‌లోని తుకారంగేట్ వద్ద 1999లో ప్రారంభించిన శ్రీ సాయి విద్యార్థి స్కూల్ 25 ఏండ్లుగా ఎందరో విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దినట్టు స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కె.ప్రసాద్, అడ్మిన్ సావిత్రి తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించామని హర్షం వ్యక్తం చేశారు. తమ స్కూల్‌లో పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఫీజులు ఉంటాయని తెలిపారు. నవతెలంగాణతో వారి స్కూల్ గురించి పలు విషయాలను పంచుకున్నారు.

స్కూల్ ప్రిన్సిపాల్ దాతృత్వం

ప్రతి ఏడాదీ 100 మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు లేని, తండ్రి ఉండి తల్లి లేకపోయిన, ఇద్దరూ ఉండి నిరుపేదలైన విద్యార్థులకు బుక్స్‌తోపాటు మధ్యాహ్నం భోజనం కూడా అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

విలువలతో కూడిన విద్య

ఎలాంటి లాభాపేక్ష లేకుండా కార్పొరేట్ విద్యకు దీటుగా నైపుణ్యం గల ఉపాధ్యాయులతో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యా విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో టాప్ 10 స్కూల్స్‌లో ఒకటిగా తమ స్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్టు తెలిపారు. ఉన్నత ప్రమాణాలే పెట్టుబడిగా విద్యార్థుల మానసిక పరిస్థితులను బట్టి వారికి విద్యా బోధన అందిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. స్కూల్ వేళల అనంతరం ఉచిత ట్యూషన్స్ అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్వో పూరిఫైడ్ వాటర్‌ను అందిస్తామన్నారు.

ఆధ్యాత్మిక, సాంస్కృతిక క్రీడలు

నేటి కాలం విద్యార్థుల వింత పోకడలను దృష్టిలో ఉంచుకుని మొబైల్‌కు దూరంగా విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్దల పట్ల ఉపాధ్యాయులతో ఎలా మెలగాలో తెలియజేస్తున్నామని తెలిపారు. దేశభక్తి, దైవభక్తి, యోగా, మంచి క్రమశిక్షణ ఉండేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. సాంస్కృతిక రంగాలతో పాటు క్రీడలు నేర్పుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తున్నా మన్నారు. మానసిక ఉల్లాసం కోసం కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ క్రీడలల్లో తర్ఫీదునిస్తూ గతేడాది కబడ్డీలో స్టేట్ లెవెల్‌లో సెకండ్ బహుమతికి సాధించి స్కూల్ సత్తా చాటారు. తమ విద్యార్థులు ఆయా రంగాల్లో డాక్టర్లు, లాయర్లు, ఏఏఎస్, ఐపీఎస్ గా ఉన్నత శిఖరాలకు ఎదగడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు







మహిళల కోసం మొబైల్ అకాడమీ

ఉత్తరా నారాయణన్. చిన్నతనం నుండి ఆమె పెరిగిన వాతావరణం చుట్టూ ఉన్న సమస్యలను గుర్తించేలా చేసింది. ఆర్థిక అక్షరాస్యత, వాతావరణపై అవగాహన మహిళలకు చాలా అవసరమని గ్రహించారు. వీటిపై వారికి అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు బజ్ ఉమెన్ పేరుతో ఓ మొబైల్ అకాడమీ స్థాపించారు. దీని ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు ఆర్థిక అవగాహన, ఆరోగ్యం, పరిశుభ్రతతో పాటు నాయకత్వంలో శిక్షణనిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

కర్నాటకలోని కోలార్ జిల్లాలోని కదారిపుర గ్రామానికి చెందిన కాంతలక్ష్మి, కలుషితమైన మాంసం తినడం వల్ల కాలేయ ఇన్ఫెక్షన్ అయ్యి ఆమెకు గర్భస్రావం జరిగింది. దీంతో ఆమె గుండె పగిలిపోయింది. నాణ్యమైన ఆహారాన్ని కోసం చేయాల్సిన పోరాటంలో ఆమె ఒంటరిగా లేదని తక్కువ కాలంలోనే ఆమె గ్రహించింది. బజ్ ఉమెన్ అనే ఎన్జీవో నిర్వహించే బజ్ గ్రీన్ ప్రోగ్రామ్ ద్వారా దేశీ పౌల్ట్రీ, ఆర్గానిక్ ఫార్మింగ్ ప్రయోజనాలు తెలుసుకుంది. దీని ద్వారా హానికరమైన రసాయనాలు లేని గుడ్లు, మాంసం, ఇతర పంటలను ఉత్పత్తి చేయవచ్చు. దేశీ పౌల్ట్రీలో గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయకంగా పెంచే కోళ్ల అందుబాటులో ఉంటాయి. వీటి మాంసం, గుడ్లు హైబ్రిడ్ జాతుల కంటే ఎక్కువ రుచిగా ఉంటాయి.

తన వంతు కృషి

కాంతలక్ష్మి అందులో శిక్షణ తీసుకొని గతేడాది మేలో రూ.50 వేలు అప్పు చేసి ముప్పై కోళ్లు, నాలుగు మేకలు, రెండు ఆవులు, ఒక గేదెతో ఫారం ప్రారంభించింది. అలాగే బెండకాయ, ఆలూ, ఉల్లిగడ్డ, బీన్స్, మునగకాయలతో కిచెన్ గార్డెన్‌ను కూడా ప్రారంభించింది. సొంతంగా కూరగాయలు పండించడం వల్ల చాలా డబ్బు ఆదా అయ్యింది. పౌల్ట్రీ ఉత్పత్తులను అమ్ముతూ మరింత ఆదాయాన్ని పొందింది. ఇలా సేంద్రీయ వ్యవసాయ పద్ధతులతో ప్రజలకు పోషకమైన, సురక్షితమైన ఆహారాన్ని అందుబాటులో ఉంచింది. పర్యావరణం, సమాజం కోసం తన వంతు కృషి చేస్తోంది. వీటితో పాటు తన ఇంటి చుట్టూ మామిడి, బెల్ పత్ర, జామున్‌తో సహా వివిధ చెట్లను కూడా నాటింది. ఇంట్లో నీటి రీసైక్లింగ్ పద్ధతులను కూడా చేపట్టింది. బజ్ ఉమెన్‌తో కలిసి పని చేస్తున్న ఆరు లక్షల మంది మహిళల్లో కాంతలక్ష్మి ఒకరు.

శక్తివంతం చేసుకునేలా...

భారతదేశంలో మైక్రో-క్రెడిట్ బ్యాంక్ వ్యవస్థాపకుడు సురేష్ కృష్ణ సహాయంతో 2012లో ఉత్తరా నారాయణన్, దేవ్ జోంగెనెలెన్ దీన్ని ప్రారంభించారు. ఇది గ్రామీణ మహిళలకు ఆర్థిక, వాతావరణ మార్పు, వ్యవస్థాపకత, నాయకత్వంలో అవసరమైన శిక్షణను ఇంటి వద్దనే అందించే మొబైల్ అకాడమీ. 'లింగ పక్షపాతం, విశ్వాసం లేకపోవడం మహిళలను ఆర్థిక స్వాతంత్ర్యం లేనివారిగా చేస్తోంది. అందుకే మేము మహిళల్లో విశ్వాసాన్ని నింపి, ఆర్థికంగా నిలబెట్టడం,



దాని ద్వారా పర్యావరణం కోసం కృషి చేయడంలో శిక్షణ ఇస్తున్నాం. మహిళలకు మేము ఎలాంటి సాధికారతా కల్పించం. వారే తమను తాము శక్తివంతం చేసుకునేలా సహకరిస్తున్నాం' అంటూ ఉత్తర పంచుకున్నారు.

చిన్ననాటి అన్వేషణ

ఉత్తర చిన్నతనం నుండి ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. టీవీలో ఆర్థిక బడ్జెట్ ప్రవేశపెట్టేటపుడు తన తండ్రి ఇంటి బడ్జెట్‌ను ఆమెకు వివరించేవారు. తనకేమైన అవసరాలు ఉంటే చెప్పమని అడిగేవారు. తన తండ్రి బ్యాంకర్ల యూనియన్‌లో భాగమై ఉన్నందున తన తల్లి పొరుగువారికి అవసరమైన సహాయం చేస్తుండేది. వీరి ప్రభావంతోనే కాస్ట్ మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉత్తర జనగ్రహ అనే ఎన్జీవోలో చేరారు. ఆడపిల్లగా తాను సమాన అవకాశాల మధ్య పెరిగినా చుట్టూ ఉన్న సమాజం అలా లేదని ఆమె గ్రహించింది. తన తల్లి కూడా చిన్నతనంలో ఇలాంటి వివక్షను ఎదుర్కొందని తెలుసుకుంది. 'అందుకే నేను ఎక్కువ మంది మహిళలకు మద్దతు ఇవ్వాలనుకుంటున్నాను' ఆమె పంచుకున్నారు. 2011లో మహిళల సమస్యలపై అవగాహన కోసం కర్ణాటకలోని ఓ గ్రామాన్ని సందర్శించారు. అప్పుల భారంతో ఆ మహిళలు చాలా కష్టపడుతున్నారు. అందుకే ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభిం చేందుకు తన బడ్జెట్ నైపుణ్యా లను ఉపయోగించారు. ఈ ఆలోచనే చివరికి 2012లో బజ్ ఉమెన్ పుట్టుకకు దారితీసింది.

'నేను దీన్ని చేయడానికి ఎంపిక చేసుకున్నాను, నా సోదరీమణుల కోసం నిలబడతాను' అంటూ నమ్మకంతో చెప్పారు. కమ్యూనిటీ యాంకర్‌లు గ్రామాలలోని అన్ని ప్రోగ్రామ్‌లకు నాయకత్వం వహించేలా తీర్చిదిద్దాలని ఆమె ఆకాంక్షిస్తున్నారు. దీని ద్వారా మర్ని ప్రాంతాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అంగన్‌వాడీల సహకారంతో...

బజ్ పని స్వీయ శక్తి శిక్షణతో ప్రారంభమవుతుంది. మొబైల్ బస్సులు కర్ణాటక లోని మారుమూల గ్రామాలకు వెళ్లి రెండున్నర రోజుల పాటు శిక్షణా సెషన్‌లను నిర్వహిస్తాయి. సెషన్ల మధ్య వారం గ్యాప్ ఉంటుంది. ఈ సెషన్‌లు బడ్జెట్, రుణాలు, వడ్డీతో సహా ఆర్థిక అక్షరాస్యతలోని ప్రాథమిక అంశాలపై దృష్టి సారిస్తాయి. వాతావరణ మార్పులను కూడా స్పృశిస్తారు, వారిలో విశ్వాసాన్ని పెంచుతారు. బజ్ మహిళలు అంగన్‌వాడీ వర్కర్ల సహాయాన్ని తీసుకుంటారు. ప్రారంభంలో శిక్షణ పొందిన మొదటి 300 మంది మహిళలతో ఉత్తర వ్యక్తిగతంగా మాట్లాడేవారు. అయితే సంఖ్య పెరగడంతో ఇది సవాలుగా మారింది. దీన్ని పరిష్కరించడానికి బజ్ ఉమెన్ ప్రతి బ్యాచ్ నుండి ఒక మహిళను యాంకర్ ఉమెన్ లేదా 'గెలాతి'గా గుర్తించి నామినేట్ చేస్తుంది. ఈ యాంకర్ తన శిక్షణా బృందంతో నెలవారీ లెర్నింగ్ సెషన్‌లను నిర్వహిస్తుంది. కుటుంబ ఆదాయాన్ని నిర్వహిం చడం, వాతావరణ మార్పులను అర్థం చేసుకోవడం, పరిష్కరించడం, మానసిక ఆరోగ్యం, పరిశుభ్రత, సోదరభావాన్ని నిర్మించడం, వారి నైపుణ్యాలపై నమ్మకాన్ని పెంచుకోవడం వీరి ముఖ్య ఉద్దేశం.

ఇతర దేశాల్లోనూ...

బజ్ ఉమెన్ ప్రస్తుతం కర్ణాటకలోని 11 జిల్లాల్లో సుమారు 18,000 గ్రామాలతో పని చేస్తోంది. భారతదేశంలో 10,000 జిలాథిలను, 118 మంది శిక్షణ పొందిన ఫీల్డ్ అసోసియేట్‌లను కలిగి ఉంది. వారు దాదాపు ప్రతి నెల మూడో వారంలో గ్రామాలను సందర్శిస్తారు. ప్రతి నెలా గెలాథిలను కలుస్తారు. ప్రతి ఫీల్డ్ అసోసియేట్ దాదాపు 100 గ్రామాలకు అనుబంధంగా ఉంటుంది. ఈ సంస్థ గాంబియా, జార్జియా, టాంజానియా, ఉక్రెయిన్ దేశాల్లోని గ్రామీణ సంఘాలకు కూడా సహాయం చేస్తోంది. దీని కోసం సిటీ బ్యాంక్, ఆదిత్య బిర్లా గ్రూప్ వంటి సంస్థల నుండి నిధులను అందుకుంటుంది.

కుటుంబంతో పోరాడి

కర్ణాటకలోని పెరేసంద్ర గ్రామానికి చెందిన అమ్మాజాన్ ఇంజనీరింగ్ చదవాలనుకుంది. అయితే ఆమెకు 2018లో పెండ్లి చేసేశారు. దాంతో ఇంజనీరింగ్ పూర్తి చేయలేకపోయింది. ఏడాది తర్వాత ఓ బిడ్డకు జన్మనిచ్చింది. కొంతకాలానికి తన గ్రామంలో బజ్ ఉమెన్ శిక్షణ గురించి తెలిసింది. మొదటి సెషన్ ఆమెను ఎంతగానో ప్రేరేపిం చింది. తన చదువు కొనసాగించడం గురించి అత్తమామలతో మాట్లాడాలనుకుంది. కుటుంబంతో పోరాడి చివరకు డిగ్రీ పూర్తి చేసింది. అయితే ఇది ఆమె కుటుంబ సభ్యులకు మింగుడు పడలేదు. విడాకుల తీసుకొని బెంగళూరు వెళ్లిపోయింది. ఆమె ఇప్పుడు నగరంలోని ఓ ఏరోస్పేస్ కంపెనీలో క్వాలిటీ ఇంజనీర్‌గా పనిచేస్తుంది.



నేను నమ్మకంగా ఉన్నాను

గెలాతిగా కూడా ఉన్న అమ్మాజాన్ గ్రామం పట్ల తన బాధ్యతలపై రాజీపడదు. మహిళలందరూ కలిసి తమ సమస్యలపై చర్చించేందుకు, బాల్య వివాహాలు, కుటుంబ నియంత్రణ, రుతుక్రమ పరిశుభ్రత మొదలైన వాటిపై అవగాహన కల్పించాలని ఆమె కోరుకుంటుంది 'ఈ రోజు నేను నమ్మకంగా ఉన్నాను. బజ్ మహిళలు నా కోసం నిలబడటం వల్లనే ఇది సాధ్యం. ఇతర మహిళలకు మెరుగైన భవిష్యత్తు కోసం మద్దతు ఇవ్వడానికి వారు నన్ను ప్రేరేపించారు' అని ఆమె పంచుకుంది.

సవాళ్లు, ముందున్న మార్గాలు

ఉత్తరకు మొదట్లో కన్నడ మాట్లాడటం రాదు. దాంతో మహిళలతో కనెక్ట్ అవ్వడం సవాలుగా మారింది. భాషా అవరోధం ఉన్నప్పటికీ నిజాయితీగా సహనంతో పని చేశారు. ఆరు నెలల్లోనే కన్నడ నేర్చుకుని మహిళలతో బలమైన నమ్మకాన్ని ఏర్పరచుకున్నారు. మొదట్లో మహిళలను సమీకరించడంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి సహాయం అందిన తర్వాత పరిస్థితి మెరుగుపడింది. ఇన్ని సవాళ్లు ఎదురైనా ఉత్తర సంకల్పం ఎప్పుడూ వమ్ము కాలేదు. 'నేను దీన్ని చేయడానికి ఎంపిక చేసుకున్నాను, నా సోదరీమణుల కోసం నిలబడతాను' అంటూ నమ్మకంతో చెబుతున్నారు. కమ్యూనిటీ యాంకర్‌లు గ్రామాలలోని అన్ని ప్రోగ్రామ్‌లకు నాయకత్వం వహించేలా తీర్చిదిద్దాలని ఆమె ఆకాంక్షిస్తున్నారు. దీని ద్వారా మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

వీఆర్ఏల గోడు పట్టదా?

(మొదటిపేజి తరువాయి)

పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని ఆబిడ్స్‌లోగల భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం(సీసీఎల్ఏ) ముందు వీఆర్ఏలు ధర్నా చేశారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీసీఎల్ఏ ఇన్‌ఛార్జి (సీఎంఆర్ఓ) లచ్చిరెడ్డికి అందజేశారు. ఆయన స్పందిస్తూ వీఆర్ఏల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందనీ, రెవెన్యూ శాఖ మంత్రితో చర్చించి త్వరలోనే కొలిక్కి తెస్తామని భరోసానిచ్చారు. అంతకుముందు ధర్నానుద్దేశించి రాములు మాట్లాడుతూ..2020 సెప్టెంబర్ 9న అసెంబ్లీలో వీఆర్ఏలకు పేస్కేలు, వారసులకు ఉద్యోగాలు, అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు కల్పిస్తామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ హామీలను నెరవేర్చాలని కోరుతూ వీఆర్ఏలు చేసిన 80 రోజుల సుదీర్ఘ సమ్మె తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జేఏసీతో చర్చలు జరిపి జీవో నెంబర్ 81,85లను జారీ చేసిందని తెలిపారు. డిగ్రీ, ఆపైన చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్లుగా, ఇంటర్ చదివిన వారిని రికార్డ్ అసిస్టెంట్లుగా, పదో తరగతి లోపు చదివిన వారిని ఆఫీసు సబార్డినేటర్లుగా రెవెన్యూ శాఖలతో పాటు మున్సిపల్, ఇరిగేషన్, మిషన్ భగీరథ విద్య వైద్య తదితర శాఖలో ఉన్న ఖాళీల్లో 15,555 మంది వీఆర్ఏలను ప్రభుత్వం సర్దుబాటు చేసిందని గుర్తుచేశారు. ఉద్యోగ విరమణ చేసిన, మరణించిన వీఆర్ఏల స్థానంలో వారి వారసులకు ఇస్తామనే పదేండ్ల హామీపై ఇప్పటివరకూ గైడ్‌లైన్స్ ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. వేరే శాఖలకు, ఇతర జిల్లాలకు బదిలీ చేయడం వల్ల వీఆర్ఏల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. మున్సిపల్, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖలకు బదిలీ అయిన వీఆర్ఏలతో చెత్త ఏరించటం, పిచ్చిమొక్కలు పీకించటం, మురికి కాలువలు తీయించడం, రోడ్లు ఊడిపించటం వంటి పనులు చేయించడం దారుణమన్నారు. ఆ పనులు చేయలేక ఆ శాఖలను వదిలి తిరిగి తమను రెవెన్యూ శాఖలో కొనసాగించాలని ఆప్షన్లు పెట్టుకున్నారని చెప్పారు. అలాంటి వారిని రెవెన్యూ శాఖకు తిరిగి బదిలీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం నాయకులు ఎం.కరుణాకర్, భూషయ్య, నల్లగిరిరావు, ఎస్. నరసింహ, తిరుపతి, మల్సూర్, మల్లేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లు మంజూరు చేయండి

(మొదటిపేజి తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నిరుపేదలకు వారి సొంత స్థలాల్లో 25 లక్షల ఇండ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. సోమవారం నాడిక్కడ కేంద్ర మంత్రి ఖట్టర్‌ను ఆయన నివాసంలో సీఎం కలిశారు. రాష్ట్రంలో తాము నిర్మించాల్సిన 25 లక్షల ఇండ్లలో 15 లక్షల ఇండ్లు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి వస్తాయని, వాటిని లబ్ధిదారు ఆధ్వర్యంలోని వ్యక్తిగత ఇండ్ల నిర్మాణం (బీఎల్‌సీ) పద్ధతిలో నిర్మించనున్నట్టు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. 2024-25లో పీఎంఏవై (యూ) కింద మంజూరు చేసే ఇంటి నిర్మాణ వ్యయం నిధులు పెంచాలని, రాష్ట్రంలో తాము నిర్మించే ఇండ్లను పీఎంఏవై (యు) మార్గదర్శకాల ప్రకారం నిర్మిస్తామని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి వివరించారు. పీఎంఏవై (యూ) కింద ఇప్పటి వరకు తెలంగాణకు 1,59,372 ఇండ్లు మంజూరు చేసి రూ.2,390.58 కోట్లు గ్రాంటు కింద ప్రకటించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అయితే ఇందులో ఇప్పటి వరకు కేవలం రూ.1,605.70 కోట్లు మాత్రమే విడుదల చేశారని, మిగతా నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రి ఖట్టర్‌ను కోరారు.

స్మార్ట్‌సిటీ మిషన్ కాల పరిమితిని 2025 వరకు పొడిగించాలి

స్మార్ట్ సిటీ మిషన్ కింద చేపట్టే పనులు పూర్తి కానుందున మిషన్ కాల పరిమితిని 2025 జూన్ వరకు పొడిగించాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద తెలంగాణలో వరంగల్, కరీంనగర్ నగరాల్లో పనులు చేపట్టినట్టు ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ కింద వరంగల్‌లో 45 పనులు పూర్తయ్యాయని, రూ.518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతున్నాయని, కరీంనగర్‌లో 25 పనులు పూర్తయ్యాయని, రూ.287 కోట్ల వ్యయంతో చేపట్టిన 22 పనులు కొనసాగుతున్నాయని వివరించారు. స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితి ఈ ఏడాది జూన్ 30తో ముగుస్తోందని, ప్రజా ప్రయోజనార్థం పనులు ముగిసే వరకు మిషన్ కాలపరిమితిని మరో ఏడాది పొడిగించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.



వరంగల్ సైనిక స్కూల్ అనుమతులు పునరుద్ధరించండి

వరంగల్ నగరానికి గతంలోనే సైనిక్ స్కూల్ మంజూరు చేసినా గత రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణపరంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. వరంగల్ సైనిక్ స్కూల్ అనుమతుల గడువు ముగిసినందున అనుమతులు పునరుద్ధరించాలని, లేకపోతే తాజాగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యమంత్రి వెంట కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, రామసహాయం రఘురాం రెడ్డి, బలరాం నాయక్,సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి,కుందూరు రఘువీర్ రెడ్డి,కడియం కావ్య, గడ్డం వంశీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి ఉన్నారు.

2,450 ఎకరాల రక్షణ శాఖ భూములు బదలాయించండి

హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, ఇతర అవసరాలకు రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం నాడిక్కడ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. రావిరాల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వానికి చెందిన 2,462 ఎకరాల భూములను ఇమారత్ పరిశోధన కేంద్రం (ఆర్‌సీఐ) ఉపయోగించుకుంటున్న విషయాన్ని ముఖ్యమంత్రి రక్షణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంతో పాటు నగరం చుట్టు పక్కల ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రక్షణ శాఖ భూములు తమకు అవసరమని, ఆర్‌సీఐ రాష్ట్ర ప్రభుత్వ భూములు వినియోగించుకుంటున్నం దున రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలు తమకు అప్పగించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖ భూముల పరస్పర బదిలీకి అంగీకరించాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజప్తి చేశారు.

పార్లమెంట్‌కు ట్రాక్టర్‌పై సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్

(మొదటిపేజి తరువాయి)

ప్రారంభం అయ్యాయి. తొలిరోజు సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. అయితే రాజస్థాన్‌లోని సికార్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) తరపున గెలిచిన అమ్రారామ్ పార్లమెంట్‌కు ట్రాక్టర్‌పై వెళ్లారు. రైతులు తమ వ్యవసాయ పనుల్లో ట్రాక్టర్‌ను వాడుతారు. ఇప్పుడు ట్రాక్టర్ రైతు పని ముట్టుగా తయారు అయింది. ఇటీవలి కాలంలో దేశంలో జరిగిన చారిత్రాత్మక రైతు పోరాటంలో రైతులతో పాటు ట్రాక్టర్లు కూడా వేలాదిగా పాల్గొన్నాయి. రైతులు తమతో పాటు ట్రాక్టర్లు తీసుకొచ్చి ఆందోళనలు చేపట్టారు. రైతు ఉద్యమానికి ట్రాక్టర్లు కొండంత అండగా నిలిచాయి. అప్పుడు కొన్నాళ్లు ఢిల్లీలోని పార్లమెంట్, ఇండియా గేట్, కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యాలయాలున్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు నిషేధించారు. అప్పటి నుంచి మోడీ సర్కార్‌లో ట్రాక్టర్ అంటే భయం పట్టుకుంది. అలాంటి ట్రాక్టర్‌పై సీపీఐ(ఎం) లోక్‌సభ ఎంపీ అమ్రారామ్ పార్లమెంట్‌కు రావడం ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. అక్కడ ఉన్న అనేక మంది ట్రాక్టర్‌పై వచ్చిన ఎంపిని చూస్తూ అభినందనలు తెలిపారు. అయితే ట్రాక్టర్‌పై అమ్రారామ్ పార్లమెంట్‌కు చేరుకోగానే భద్రతా సిబ్బంది ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. పార్లమెంట్ లోపలకి వెళ్లడానికి లేదని పోలీసులు అడ్డుకుంటే, ఎంపి అమ్రారామ్ ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. ఒకప్పుడు నిరసన తెలుపుతూ పార్లమెంట్‌కు ఎడ్లబండి మీద వెళ్లిన ఘటనలు ఉన్నాయి. దేశంలోని రైతు ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న రోజుల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా ట్రాక్టర్‌పై పార్లమెంట్‌కు వచ్చారు. అయితే ఆయనను కూడా పార్లమెంట్ గేటు వద్దనే పోలీసులు అడ్డుకున్నారు.

కేరళ రాష్ట్రం పేరు కేరళం

(మొదటిపేజి తరువాయి)

చేయాలని తీర్మానం పిలుపిచ్చింది. గతేడాది కూడా ఇదే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానాన్ని పంపింది. కానీ అందుకు అనుసరించిన తీరు సరిగా లేదనే కారణంతో కేంద్రం వెనక్కి పంపింది. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషల్లోనూ కేరళ పేరును సవరించాలని తొలుత రాష్ట్రం కోరింది. అయితే, కేంద్ర హోం శాఖ నుంచి అందిన సూచనల మేరకు, ఫస్ట్ షెడ్యూల్‌లో సవరణపైనే దృష్టి కేంద్రీకరించింది. 2023 ఆగస్టు 9న అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని సవరించడానికి ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. కేరళం అనేది రాష్ట్రానికి సంబంధించి మలయాళం పేరని, అధికారికంగా కేరళ అనే కొనసాగుతుందని విజయన్ తెలిపారు. అధికారిక పేరును మలయాళం ఉచ్చారణతో సమం చేయడానికి ఈ తీర్మానం ఉద్దేశించబడింది.

వైద్య ఆరోగ్య వర్సిటీకి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణ..

అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడున్నర గంటల పాటు కొనసాగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సీఎం చేసిన ఐదు సంతకాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వైద్య ఆరోగ్య వర్సిటీకి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరించాలని నిర్ణయించింది.

మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, ఏప్రిల్ నుంచి పింఛను రూ.4వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొత్తగా టెట్ నిర్వహణ, టెట్ లేకుండా డీఎస్సీ నిర్వహణ ప్రతిపాదనలపై చర్చించారు. డీఎస్సీ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు క్యాబినెట్ ముందుంచారు. జులై ఒకటి నుంచి ప్రక్రియను ప్రారంభించి డిసెంబర్ 10లోపు 16,347 పోస్టులను భర్తీ చేసేలా ప్రణాళికను రూపొందించారు. పింఛన్ల పెంపు అంశంపైనా మంత్రివర్గంలో కీలకంగా చర్చించారు. దీని కింద ఇచ్చే మొత్తం రూ.3వేల నుంచి రూ.4లకు పెంచే నిర్ణయానికి ఆమోదం తెలిపారు. జులై 1 నుంచి పెంచిన పింఛన్లను ఇంటి వద్దే అందజేయాలని నిర్ణయించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గత మూడునెలలకు కలిపి వచ్చే నెలలో ఒక్కొక్కరికి రూ.7వేల పింఛను అందనుంది. రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది లబ్ధిదారులకు ఈ మొత్తాలను పంపిణీ చేయనున్నారు. గంజాయి నివారణకు హోంమంత్రి అనిత సారథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హోం, రెవెన్యూ, హెల్త్, గిరిజన శాఖ మంత్రులతో ఉప సంఘం ఏర్పాటు చేయనున్నారు. గంజాయి నియంత్రణపై మంత్రుల కమిటీలో సభ్యుడిగా మంత్రి నారా లోకేశ్ ఉండనున్నారు.

బీఆర్ఎస్ ఖతం: షబ్బీర్ అలీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖతమైందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కోసం 11 ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. ఆ భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఇప్పటి వరకు ఆఫీస్ లేదని పేర్కొన్నారు. కొకాపేటలో బీఆర్ఎస్‌కు ఇచ్చిన భూములను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ భూమిని వేలమేసి వచ్చిన డబ్బును రుణమాఫీకి వాడాలని సూచించారు.

సుప్రీంకు బీఆర్ఎస్?

(మొదటిపేజి తరువాయి)

మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీవీడటాన్ని బీఆర్ఎస్ నేతలు అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో అలర్ట్ అయిన గులాబీ బాస్ ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం కోర్టు తలుపులు తట్టేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. ఈ అంశంపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై న్యాయనిపుణులతో తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ నెల 27న ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు కేసు హైకోర్టులో విచారణకు రానున్న సంగతి తెలిసిందే. ప్రజల తీర్పునకు వ్యతిరేకంగా తమ పార్టీ సింబల్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరుతున్న ఎమ్మెల్యేలపై సీరియస్‌గా ముందుకెళ్లాలని బీఆర్ఎస్ అధిష్టానం ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి మూడు నెలలు పూర్తికానున్న నేపథ్యంలో సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు న్యాయ నిపుణులతో చర్చిస్తున్నది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం మూడు నెలల్లో అనర్హత పిటిషన్ పైన స్పీకర్ నిర్ణయం తీసుకోవాలనే నిబంధన ఉన్నది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని పేరా నెంబర్ 30, 33 ప్రకారం హైకోర్టు వెంటనే నిర్ణయం తీసుకోవాలి. ఒకవేళ హైకోర్టు దానంపై అనర్హత వేటు వేయకుంటే ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి హస్తం గూటికి చేరిన ఎమ్మెల్యేల పేర్లనూ పిటిషన్‌లో చేర్చి సుప్రీం కోర్టు తలుపులు తట్టేందుకు గులాబీబాస్ కసరత్తులు చేస్తున్నారు. ఇదిలాఉండగా, కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేసుకోవడంపై సీరియస్‌గా దృష్టి సారించింది. 2019లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకుని ప్రతిపక్ష హోదా లేకుండా కేసీఆర్ చేసినట్టుగానే కాంగ్రెస్ కూడా ప్రయత్నాలు మొదలుపెట్టింది. అందులో భాగంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్‌పెట్టారు. సామదానదండోపాయాలు ప్రయోగించి కారుపార్టీ ఎమ్మెల్యేలను లాక్కునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పటికే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ అధిక స్థానాలను గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే గెలిచింది. ఇప్పుడు ఆ ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్ నేతలకు ఒక్కొక్కరుగా టచ్‌లోకి వెళ్తున్నారు. ఒకటెండ్రు రోజుల్లో వారంతా హస్తంగూటికి చేరబోతున్నారనే ప్రచారమూ జోరుగా సాగుతున్నది. ప్రతిపక్షం లేకుండా పార్టీఫిరాయింపులను ప్రోత్సహించి గతంలో దూకుడు ప్రదర్శించిన బీఆర్ఎస్ మాదిరిగానే ఇప్పుడు కాంగ్రెస్ ముందుకు వెళ్తున్నదనే చర్చ రాజకీయవర్గాలో చర్చనీయాంశమవుతున్నది.

ప్రజల చేతుల్లో గుణపాఠం తప్పదు : కేటీఆర్

కాంగ్రెస్ ప్రోత్సహిస్తున్న పార్టీ ఫిరాయింపుల అంశంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌వేదికగా ఘాటుగా స్పందించారు. 'అధికారంలో ఉన్నామని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రజల చేతుల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు. ప్రజాస్వామ్యంలో ప్రజల శక్తి ఎప్పుడు అధికారంలో ఉన్నవారి కన్నా కూడా బలంగా ఉంటుంది. 2004-06లో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక సార్లు పార్టీ ఫిరాయింపులకు పాల్పడింది. అప్పుడు కూడా బీఆర్ఎస్ ఇబ్బందులను ఎదుర్కొంది. ఇలాంటి కష్టసమయం బీఆర్ఎస్ కు కొత్త కాదు. కానీ, కాంగ్రెస్ పార్టీ నీతి లేని వ్యవహారాలపై తెలంగాణ ప్రజలు ఆందోళన ఉధృతమవుతున్నది. ఈ దెబ్బకు కాంగ్రెస్ పార్టీ తల వంచక తప్పలేదు. ప్రస్తుతానికి మా పార్టీ ఎమ్మెల్యేలను ఫిరాయింపులకు పాల్పడేందుకు ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి మళ్లీ కచ్చితంగా ప్రజలు బుద్ధి చెబుతారు. చరిత్ర పునరావృతమవుతుంది' అని పేర్కొన్నారు.

నవచిత్రం



సినీ పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం..

'ఏపీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులను సినీ పరిశ్రమ తరఫున అభినందించడానికి అపాయింట్మెంట్ అడిగాం. మా విజ్ఞాపనకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు' అని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు.
సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో తెలుగు సినీ నిర్మాతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్, నిర్మాతలు సి.అశ్వనీదత్, ఎ.ఎం.రత్నం, డి.సురేష్ బాబు, ఎస్.రాధాకృష్ణ (చినబాబు), దిల్ రాజు, భోగవల్లి ప్రసాద్, డి.వి.వి.దానయ్య, సుప్రియ, ఎన్.వి.ప్రసాద్, బన్నీ వాసు, నవీన్ ఎర్నేని, నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్, వంశీ కృష్ణ, వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'తెలుగు చిత్ర పరిశ్రమలో ఉన్న సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చించలేదు. త్వరలోనే మరోసారి కలిసి చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీ రంగ విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చిస్తాం' అని అన్నారు.

పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్..


విజయశాంతి

తన కెరీర్‌లో పోషించిన అద్భుతమైన ఇంటెన్స్ క్యారెక్టర్స్‌తో లేడీ సూపర్ స్టార్‌గా విజయశాంతి పేరొందారు. చాలా కాలం తర్వాత ఆమె నందమూరి కళ్యాణ్ రామ్ చిత్రానికి సైన్ చేశారు.
ఇందులో ఆమె 'కర్తవ్యం' తరహాలో నిజాయితీ గల పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు.
విజయశాంతికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా ఆమె పాత్రను వైజయంతి ఐపీఎస్‌గా పరిచయం చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌తోనే ఆ పాత్ర ఎంత పవర్ ఫుల్‌గా ఉండబోతుందో అర్థమవుతోంది. మేకర్స్ క్యారెక్టర్‌ని పరిచయం చేయడానికి ఒక గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు.
'వైజయంతి ఐపీఎస్... తను పట్టుకుంటే పోలీస్ తుపాకికే ధైర్యం వస్తుంది... వేసుకుంటే యూనిఫాంకే పౌరుషం వస్తుంది... తానే ఒక యుద్ధం... నేనే తన సైన్యం..." అంటూ కళ్యాణ్ రామ్ వాయిస్ ఓవర్‌తో క్యారెక్టర్‌ని ప్రజెంట్ చేయడంతో అదిరిపోయింది. కళ్యాణ్ రామ్ కూడా వీడియోలో ఫెరోషియస్‌గా కనిపించారు.
ప్రదీప్ చిలుకూరి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్ పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో బిగ్ స్కేల్‌లో జరుగుతోంది. ఈ చిత్రంలో సోహెల్ ఖాన్, సయీ మంజ్రేకర్, శ్రీకాంత్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, డీవోపీ : రామ్ ప్రసాద్, ఎడిటర్: తమ్మిరాజు, స్క్రీన్ ప్లే: శ్రీకాంత్ విస్సా.

సరికొత్త కంటెంట్‌తో డార్లింగ్


ప్రియదర్శి, నభా నటేష్

ఈ సంవత్సరం ప్రారంభంలో పాన్ ఇండియా సెన్సేషన్ 'హను-మాన్' అందించిన బ్లాక్‌బస్టర్ ప్రొడక్షన్ హౌస్ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ తాజాగా ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో 'డార్లింగ్' అనే రోమ్-కామ్ ఎంటర్‌టైనర్‌తో వస్తోంది. నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి అశ్విన్ రామ్ రైటర్, డైరెక్టర్.ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌కి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా ఈ మూవీని థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రాన్ని జూలై 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు అనౌన్స్ చేశారు.రోమ్-కామ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ మూవీతో మరో బ్లాక్‌బస్టర్‌ని స్కోర్ చేయడంపై మేకర్స్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. ప్రస్తుత ట్రెండ్‌లో మోస్ట్ రిలేటేబుల్ కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేందుకు ఈ చిత్రం రెడీగా ఉందని చిత్ర బృందం తెలిపింది. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు.
ఈచిత్రానికి రచన- దర్శకత్వం: అశ్విన్ రామ్, సంగీతం: వివేక్ సాగర్, డీవోపీ: నరేష్ రామదురై, ఎడిటర్: ప్రదీప్ ఇ రాఘవ, డైలాగ్స్: హేమంత్, ప్రొడక్షన్ డిజైనర్: గాంధీ, క్రియేటివ్ ప్రొడ్యూసర్: సీతారామ్ వై, లిరిక్స్: కాసర్ల శ్యామ్, కొరియోగ్రాఫర్: విజయ్ పోలాకి, ఈశ్వర్ పెంటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ : ప్రకాష్ రెడ్డి పన్నాల, వంశీ సంగెం, లైన్ ప్రొడ్యూసర్: మంచి వెంకట్.

తెలుగులో ఎంట్రీకి రంగం సిద్ధం


శివరాజ్ కుమార్

కన్నడ కథానాయకుడు శివరాజ్ కుమార్ తెలుగు ప్రేక్షకులకు బాగా సుపరిచితుడు. ఆయన సతీమణి గీతా శివ రాజ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా శివ రాజ్‌కుమార్ నెక్స్ మూవీని అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఆయన కన్నడ, తెలుగు భాషల్లో ఓ సినిమా చేయనున్నారు.
ఈ బైలింగ్వల్ ఫిల్మ్‌ని కార్తీక్ అద్వైత్ దర్శకత్వంలో పద్మజ ఫిలింస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో భువనేశ్వరి పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, సుధీర్ పి నిర్మిస్తున్నారు.
శివరాజ్ కుమార్‌ని కంప్లీట్ కొత్త లుక్, క్యారెక్టర్‌లో ప్రజెంట్ చేసే ఈ మూవీపై అభిమానులలో భారీ అంచనాలు ఉన్నాయి. స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. ఇప్పటికే మ్యూజిక్ కంపోజిషన్ జరుగుతోంది. అఫీషియల్ లాంచ్ వేడుక ఆగస్ట్‌లో ఉంటుంది. తెలుగు చిత్ర పరిశ్రమలో విజయవంతమైన చిత్రాలతో మంచి పేరు తెచ్చుకున్న నిర్మాత ఎస్ఎన్‌రెడ్డి ఈ బైలింగ్వల్ వెంచర్ కోసం సుధీర్ పి.తో కొలబరేట్ అవుతున్నారు. ఎస్ఎన్‌రెడ్డి రీసెంట్ ప్రాజెక్ట్ 'జీబ్రా' తెలుగు, కన్నడ రెండింటిలోనూ విడుదల కానుంది.

సీతా కళ్యాణ వైభోగమేకి విశేష స్పందన

ప్రస్తుతం ఉన్న ఈ మోడ్రన్ ప్రపంచంలో ప్రేమ, పెళ్లి అనే పదాలకు అర్థాలే మారిపోయాయి. కానీ త్రేతాయుగంలో సీతారాములు చూపించిన దారిలో నడవడం, విలువలు పాటించడమంటే మామూలు విషయం కాదు.
విలువల్ని మర్చిపోతున్న ఈ తరానికి ప్రేమ, పెళ్లి గొప్పదనం చెప్పడం, రాముడు పాటించిన విలువలు, సీత గొప్పదనం చెప్పేలా నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా తీసిన సినిమా 'సీతా కళ్యాణ వైభోగమే'. సుమన్ తేజ్, గరిమ చౌహాన్ హీరో, హీరోయిన్లుగా డ్రీమ్ గేట్ ప్రొడక్షన్స్ పతాకంపై సతీష్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈనెల 21న విడుదలైన ఈ సినిమా థియేటర్లో అందరినీ ఆకట్టుకుంటోంది.
ఈ సందర్భంగా నిర్మాత రాచాల యుగంధర్ మాట్లాడుతూ, 'ఫ్యామిలీ అంతా కలిసి చూడదగ్గ ఓ క్లీన్ చిత్రం కావడంతో అన్ని వర్గాలను మా సినిమా ఆకట్టుకుంటోంది. కమర్షియల్‌గా ఈ సినిమా వర్కౌట్ అవుతోందని ట్రేడ్ వర్గాలు విశ్లేషించడం ఆనందంగా ఉంది. చరణ్ అర్జున్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మొదటి సినిమానే అయినప్పటికీ ఈ చిత్రాన్ని అద్భుతంగా నిర్మించారంటూ నిర్మాతగా నన్ను అభినందించడం మరింత సంతోషంగా ఉంది. మొదటి ప్రోడక్ట్‌గా ఖర్చుకు వెనుకాడకుండా విలువలతో కూడిన సినిమాను నిర్మించి, ప్రేక్షకుల మెప్పు పొందడం గర్వంగా, మరింత ప్రోత్సాహకరంగా ఉంది' అని తెలిపారు.


సుమన్ తేజ్, గరిమ చౌహాన్, రాచాల యుగంధర్

నిజమని నిరూపిస్తే ఇండస్ట్రీ వదిలేసి వెళ్ళిపోతా

- జానీ మాస్టర్



నృత్య దర్శకుడిగా జానీ మాస్టర్ స్థాయి పాన్ ఇండియా లెవల్ సినిమాల వరకు వెళ్ళింది. తెలుగుతో పాటు తమిళ, హిందీ సినిమాల్లో పాటలకు ఆయన కొరియోగ్రఫీ చేస్తున్నారు.
మరో వైపు తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు.
అయితే... ఇటీవల సతీష్ అనే డ్యాన్సర్ జానీ మాస్టర్ మీద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు ఒక వీడియో విడుదల చేశారు. అందులో పలు ఆరోపణలు చేశారు. అవి నిజమని నిరూపిస్తే తాను ఇండస్ట్రీ వదిలేసి వెళ్లిపోతానని జానీ మాస్టర్ చెప్పారు. ఈ వివాదం పూర్వాపరాలు వెల్లడించడానికి అసోసియేషన్ సభ్యులతో కలిసి సోమవారం మీడియాతో సమావేశమయ్యారు.
జానీ మాస్టర్ మాట్లాడుతూ, 'సతీష్ విషయానికి వస్తే... అయేషా చెప్పినవన్నీ నిజాలు. రూల్స్ ప్రకారం కమిటీ, కొరియోగ్రాఫర్లతో మాట్లాడి లక్ష రూపాయలు ఫైన్ విధించారు. సతీష్ తప్పు అయ్యిందని లెటర్ రాస్తే మొదటి తప్పుగా క్షమించి వదిలేసేవాళ్ళం. ఫైన్ వేసేవాళ్ళం కాదు. నేను ఏంటో చూపిస్తానని కొందరిని బెదిరించారు. అలాగే ఆయన ఒక వీడియో విడుదల చేశారు. అందులో ఒక్కటి నిజమైనా సరే నేను ఇండస్ట్రీ వదిలేసి వెళ్ళిపోతా' అని చెప్పారు. 'మాది 33 ఏళ్ల చరిత్ర ఉన్న అసోసియేషన్. దీనికి కొన్ని రూల్స్- రెగ్యులేషన్స్, బైలాస్ ఉన్నాయి. మా సభ్యుడు జీ సతీష్ మా నియమ నిబంధనలకు వ్యతిరేకంగా బయటకు వెళ్లి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. పోలీస్ కంప్లైంట్ ఇచ్చారు. అంతేకాదు మా సంఘంలో జరిగిన కొన్ని విషయాలు స్టేటస్‌లో పెట్టారు. అది వద్దని చెప్పినందుకు అసభ్య పదజాలం వాడారు. తర్వాత కమిటీ పిలిచినప్పుడు తప్పు చేశానని ఒప్పుకొన్నారు. జరిమానా కట్టి మళ్లీ పని చేసుకోవాలని సూచించాం. కానీ, ఆయన అందుకు అంగీకరించలేదు. జానీ మాస్టర్ కమిటీ వచ్చిన తర్వాత బైలాస్‌లో మార్పులు చేయలేదు. అంతకు ముందు ఉన్నదే ఫాలో అవుతున్నాం. ఆయన ఆరోపణలలో వాస్తవం లేదు' అని ప్రధాన కార్యదర్శి శ్రీను దేవర చెప్పారు.





అమరావతి పనులు మళ్లీ ప్రారంభించండి


- ఎల్ అండ్ టి ప్రతినిధులను కోరిన ఏపీ సీఎం చంద్రబాబు
- బిల్లులు జాప్యం చేయవద్దని కోరిన కంపెనీ



అమరావతి : రాజధాని అమరావతిలో అగిపోయిన పనులను మళ్లీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎల్అండ్‌టి ప్రతినిధులను కోరారు. ఎల్ అండ్‌టి సంస్థ గతంలో రాజధాని ప్రాంతంలో కొన్ని పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. రాజధానిలో కీలకమైన అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్ పనులను ఎల్అండ్‌టి చేపట్టింది. మరికొన్ని కీలక పనులను షాపూర్‌జీ, పల్లోంజీ, ఎన్‌సిసి, మేఘా సంస్థలు కూడా చేశాయి. రాజధాని నిర్మాణాన్ని ప్రాధాన్యతగా తీసుకున్న నేపథ్యంలో గతంలో పనులు నిర్వహించిన సంస్థలతో ఒక్కోరోజు ఒక్కో సంస్థతో సమావేశం కావాలని చంద్రబాబు నిర్ణయించారు. దీనిలో భాగంగా తొలిరోజైన శుక్రవారం ఎల్అండ్‌టి సంస్థ ప్రతినిధులతో సమావేశమైన ఆయన గతంలో వారు చెపట్టిన పనులు, ఎంతవరకూ పూర్తయ్యాయి. మరలా పనులు చేపట్టాలంటే ప్రభు త్వం చేయాల్సిం దేమిటి తదితర అంశాలపై వారితో మాట్లాడారు. బిల్లుల పెండింగ్ వంటివి ఏమైనా ఉన్నాయా ఉంటే వాటిస్థితి ఏమిటి, గత ఐదేళ్లలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు తదితర అంశాలను వారితో చర్చిచారు. దీనిపై స్పందించిన ఎల్అండ్‌టి సంస్థ ప్రతినిధులు తమకు గతంలో కొంత నిధులు పెండింగ్ ఉన్నాయని, కొన్ని యంత్రాలు వదిలేశామని, కొంత నష్టం వాటిల్లిందని తెలిపారు. దీనిపై స్పందించిన సిఎం తామేమీ చేయాలని మీరు కోరుకుంటున్నారో చెప్పాలని అడిగారు దీనిపై వారు మాట్లాడుతూ పనులు చేయడానికి అభ్యంతరం లేదని, కానీ బిల్లులు వెంటనే వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని, ఇతర అంశాలపై అధికారులతో చర్చించి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూస్తానని చెప్పినట్లు తెలిసింది. ఎల్అండ్‌టి సంస్థ అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఎజిసి)తోపాటు, ఉద్యోగుల నివాసాల నిర్మాణాన్ని చేపట్టింది. వీటిల్లో ఉద్యోగుల నివాసాలు దాదాపు పూర్తయ్యేదశలో ఉండగా వైసిపి ప్రభుత్వం పనులు నిలిపేసింది.

బైజూస్‌లో రూ.4వేల కోట్లు హుష్..

- నిండా మునిగిన నెథర్లాండ్ కంపెనీ



బెంగళూరు : కరోనాకు ముందు ఓ వెలుగు వెలిగిన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌లో రూ.4వేల కోట్ల పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ప్రోసస్ ఎన్‌వి నిండా మునిగినట్లు ప్రకటించింది. 2018లోని తమ పెట్టుబడులు ఇప్పుడు సున్నా విలువకు పడిపోయినట్లు తెలిపింది. తాము బైజూస్‌లో పెట్టిన పెట్టుబడుల వాటాను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. బైజూస్ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, భవిష్యత్ అంచనాలకు సంబంధించి తమవద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆ సంస్థ విలువను తాము సున్నాకు తగ్గిస్తున్నట్లు ప్రోసస్ తెలిపింది. తద్వారా తమకు 493 మిలియన్ డాలర్లు (రూ.4వేల కోట్లు) మేర నష్టం వాటిల్లినట్లు ఆ కంపెనీ పేర్కొంది.

ప్రైమ్ మినిస్టర్ కాదు, క్రైమ్ మినిస్టర్

- నెతన్యాహుపై ఇజ్రాయిలీ ప్రజల ఆగ్రహం
- లక్షన్నర మందితో భారీ ర్యాలీ

టెల్ అవీవ్: గాజాలో జరుగుతున్న మారణహోమం నుంచి ఇజ్రాయిల్ వెనక్కి తగ్గేది లేదని ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించడంతో ఇజ్రాయిల్ ప్రజలు భారీ యుద్ధ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. 37వేల మందిని అమానుషంగా పొట్టనపెట్టుకున్న నెతన్యాహు ఇంకా నీ రక్త దాహం తీరలేదా అంటూ వారు నినదించారు. ఆదివారం టెల్ అవీవ్‌లో పెద్ద సంఖ్యలో గుమికూడిన ఇజ్రాయిలీ ప్రజలు నెతన్యాహు ప్రైమ్ మినిస్టర్ కాదు, క్రైమ్ మినిస్టర్ అన్న బ్యానర్‌తో ర్యాలీ నిర్వహించారు. లక్షన్నర మంది దాకా ఈ ర్యాలీలో పాల్గొనడం విశేషం. నెతన్యాహు అంత చెత్త ప్రధానిని



తానెన్నడూ చూడలేదని భద్రతా దళ మాజీ అధిపతి ఇవాన్ డిస్కిన్ అన్నారు.మనవడి భవిష్యత్తు కోసం తాను ఈ నిరసన ర్యాలీలో పాల్గొనడానికి వచ్చానని ఆయన తెలిపారు.నెతన్యాహు ప్రభుత్వాన్ని పడగొట్టక పోతే తమకే కాదు, తమ పిల్లలకూ భవిష్యత్తు ఉండదని 66 ఏళ్ల పాయ్ ఎరెల్ అన్నారు. నెతన్యాహు హయాంలో దేశంలో ప్రజాస్వామ్యం చచ్చిపోతోందంటూ టెల్ అవీవ్‌లోని డెమొక్రసీ స్క్వేర్‌కు ఎర్ర రంగు పులిమి నిరసన తెలిపారు. నెతన్యాహు తక్షణమే గద్దె దిగి, ఇజ్రాయిల్ పార్లమెంటుకు ఎన్నికలు జరపాలని నిరసన కారులు డిమాండ్ చేశారు. గాజాపై దాడులను ఆపాలని కూడా వారు డిమాండ్ చేశారు. హమాస్ చేతిలో బందీలుగా చిక్కుకున్న వారి కుటుంబ సభ్యులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

హిట్‌మ్యాన్ ధమాకా

కంగారూల ఖేల్ ఖతం!. చావోరేవో తేల్చుకోవాల్సిన సూపర్8 మ్యాచ్‌లో టీమ్ ఇండియా చేతిలో ఆస్ట్రేలియా చిత్తయ్యింది. వరుసగా రెండో ఓటమితో సెమీఫైనల్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. 206 పరుగుల ఛేదనలో ఆసీస్ 181 పరుగులకే పరిమితమైంది. 24 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ (92) ధనాధన్ ఇన్నింగ్స్‌తో భారత్ 205 పరుగుల భారీ స్కోరు చేసింది. 19 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన రోహిత్ శర్మ.. ఏడు ఫోర్లు, ఎనిమిది సిక్సర్లతో విశ్వరూపం చూపించాడు.





- ఆస్ట్రేలియాపై భారత్ ఘన విజయం
- భారత్ 205/5, ఆస్ట్రేలియా 181/7

41 బంతుల్లో 92 బాదిన రోహిత్ శర్మ

నవతెలంగాణ-గ్రాస్‌ఐలెట్

ఆస్ట్రేలియాపై భారత్ 24 పరుగుల తేడతో ఘన విజయం సాధించింది. 2023 వరల్డ్‌కప్ ఫైనల్ పరాజయానికి ప్రతీకారం తీర్చుకుంది!. కీలక సూపర్8 మ్యాచ్‌లో నెగ్గి.. ఆసీస్ సెమీఫైనల్ అవకాశాలను దారుణంగా దెబ్బతీసింది. 206 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా 181 పరుగులే చేసింది. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (76, 43 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సులు), కెప్టెన్ మిచెల్ మార్ష్ (37, 28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) పోరాడినా ఫలితం దక్కలేదు. వార్నర్ (6), స్టోయినిస్ (2), మాక్స్‌వెల్ (20), టిమ్ డెవిడ్ (15), మాథ్యూ వేడ్ (1) భారత బౌలర్ల ముంగిట తేలిపోయారు. అర్షదీప్ సింగ్ (3/37), కుల్దీప్ యాదవ్ (2/24) ఆసీస్ ఆట కట్టించారు.

అంతకుముందు, రోహిత్ శర్మ (92, 41 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సులు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో కదం తొక్కటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ (31, 16 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు), హార్దిక్ పాండ్య (27 నాటౌట్, 17 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు), శివం దూబె



(28, 22 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

హైహై.. నాయకా! :

టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా మరోసారి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కొత్త బంతితో స్టార్క్, హాజిల్‌వుడ్ నిప్పులు చెరగటంతో భారీ స్కోరు కష్టమే అనిపించింది. విరాట్ కోహ్లి (0) డకౌట్‌గా నిష్క్రమించగా 2 ఓవర్లలో భారత్ 6/1తో పేలవంగా మొదలెట్టింది. రోహిత్ శర్మ ధనాధన్‌తో ఇక్కడ్నుంచి మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. మిచెల్ స్టార్క్ ఓవర్లో వరుసగా 6, 6, 4, 6, 0, 6తో ఆకాశమే హద్దుగా బాదేసిన రోహిత్ శర్మ ఆ ఓవర్లో ఏకంగా 29 పరుగులు పిండుకున్నాడు. దీంతో 6/1తో ఉన్న భారత్ 3 ఓవర్లలో 35/1తో దూకుడు పట్టాలెక్కింది. ఓ ఎండ్‌లో రోహిత్ శర్మ ఊచకోత కొనసాగగా.. రిషబ్ పంత్ (15) కాస్త ఇబ్బంది పడ్డాడు. స్వేచ్ఛగా విరుచుకుపడిన రోహిత్ శర్మ నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 19 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. రోహిత్, పంత్ జోడీ రెండో వికెట్‌కు 38 బంతుల్లోనే 87 పరుగులు పిండుకోవటం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. అర్థ సెంచరీ తర్వాత మూడు సిక్సర్లు, మూడు ఫోర్లు బాదిన రోహిత్ శర్మ సెంచరీని తృటిలో చేజార్చుకున్నాడు. స్టార్క్ ఓవర్లోనే వికెట్ కోల్పోయి నిష్క్రమించాడు. రోహిత్ అవుటైనా.. భారత జోరు తగ్గలేదు. సూర్యకుమార్ యాదవ్ (31), శివం దూబె (28) మిడిల్ ఓవర్లలో మెరుగా.. హార్దిక్ పాండ్య (27 నాటౌట్) డెత్ ఓవర్లలో చెలరేగాడు. రవీంద్ర జడేజా (9 నాటౌట్) ఓ సిక్సర్‌తో అలరించాడు. ఆసీస్ బౌలర్లందరూ రెండెంకల ఎకానమీతో గణాంకాలు గల్లంతు చేసుకోగా.. హాజిల్‌వుడ్ (1/14) 24 బంతుల్లో 14 పరుగులే ఇచ్చి ఆకట్టుకున్నాడు.

శతకం చేజార్చుకున్న రోహిత్ శర్మ టీ20ల్లో అత్యధిక పరుగుల రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. బాబర్ ఆజమ్ (4145)ను దాటేసి 4165 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.



నితీశ్‌కు పిలుపు

అభిషేక్, రియాన్‌లకు సైతం
జింబాబ్వే పర్యటనకు భారత జట్టు ఎంపిక

నవతెలంగాణ-ముంబయి :

తెలుగు తేజం, సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్థమాన ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తొలిసారి భారత జట్టుకు ఎంపికయ్యాడు. ఐపీఎల్ 2024లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన నితీశ్ కుమార్ రెడ్డి.. ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డును దక్కించుకున్నాడు. మిడిల్ ఆర్డర్‌లో విలువైన బ్యాటర్‌గా, నమ్మదగిన పేసర్‌గా నితీశ్ కుమార్ అరుదైన ఆల్‌రౌండర్. జింబాబ్వే పర్యటనలో టీ20 సిరీస్‌లో ఆడనున్న భారత జట్టులో పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి చోటు దక్కించుకున్నాడు. ఐపీఎల్ 2024లో మెరుపు ప్రదర్శన చేసిన యువ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్ సైతం తొలిసారి జాతీయ జట్టులో చోటు సాధించారు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ పగ్గాలు దక్కించుకున్నాడు. హైదరాబాదీ స్టార్ తిలక్ వర్మ గాయంతో ప్రస్తుతం బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. దీంతో అతడిని సెలక్షన్ కమిటీ ఎంపికకు పరిగణనలోకి తీసుకోలేదని సమాచారం. జింబాబ్వే పర్యటనలో భారత్ ఐదు టీ20 మ్యాచులు ఆడనుంది. జులై 6, 7, 10, 13, 14న హరారేలో టీ20 సిరీస్ జరుగనుంది.

భారత టీ20 జట్టు : శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రింకూ సింగ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముకేశ్ కుమార్, తుషార్ దేశ్‌పాండే.

సెమీస్‌లో సఫారీలు

- దశాబ్దం నిరీక్షణకు తెరదించిన దక్షిణాఫ్రికా
- ఉత్కంఠ సూపర్8 పోరులో విండీస్‌పై గెలుపు

ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్

నవతెలంగాణ-నార్త్‌సౌండ్



సఫారీలు సెమీఫైనల్లోకి ప్రవేశించారు. ఉత్కంఠ సూపర్8 గ్రూప్-2 మ్యాచ్‌లో ఆతిథ్య వెస్టిండీస్‌పై 3 వికెట్ల తేడాతో విజయం సాధించారు. బ్యాటింగ్‌కు కష్టమైన పిచ్‌పై ఛేదనలో ట్రిస్టన్ స్టబ్స్ (29, 27 బంతుల్లో 4 ఫోర్లు), హెన్రిచ్ క్లాసెన్ (22, 10 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), మార్కో జాన్సెన్ (21 నాటౌట్, 14 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. 136 పరుగుల ఛేదనలో వర్షం అంతరాయంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం లక్ష్యాన్ని 17 ఓవర్లలో 123 పరుగులుగా నిర్దేశించారు. 16.1 ఓవర్లలోనే 124 పరుగులు సాధించిన దక్షిణాఫ్రికా మరో ఐదు బంతులు ఉండగానే లాంఛనం ముగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. రోస్టన్ ఛేజ్ (52చ 42 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీ సాధించగా, ఓపెనర్ కైల్ మేయర్స్ (35, 34 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) ఆకట్టుకునే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. మూడు వికెట్లతో విజృంభించిన సఫారీ స్పిన్నర్ షంశి (3/27) 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

సఫారీ సూపర్ : ఛేదనలో సఫారీ ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు క్వింటన్ డికాక్ (12), రీజా హెండ్రిక్స్ (0) ఇన్నింగ్స్ రెండో ఓవర్లో వికెట్ కోల్పోయారు. 15/2తో కష్టాల్లో పడిన వేళ వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించింది. విరామం అనంతరం మ్యాచ్ మొదలైనా.. లక్ష్యాన్ని 17 ఓవర్లకు 123 పరుగులకు మార్చారు. కెప్టెన్ ఎడెన్ మార్క్రామ్ (18, 15 బంతుల్లో 2 ఫోర్లు), ట్రిస్టన్ స్టబ్స్ (29), హెన్రిచ్ క్లాసెన్ (22) మిడిల్ ఆర్డర్‌లో సమయోచిత ఇన్నింగ్స్‌లు ఆడారు. కానీ మిడిల్ ఆర్డర్‌తో పాటు డెవిడ్ మిల్లర్ (4) సైతం నిష్క్రమించటంతో 5/93తో దక్షిణాఫ్రికా చిక్కుల్లో పడింది. బంతితో పరుగు చేయాల్సిన తరుణంలో టెయిలెండర్లు ఒత్తిడిని జయించారు. మార్కో జాన్సెన్ (21 నాటౌట్), కగిసో రబాడ (5 నాటౌట్, 3 బంతుల్లో 1 ఫోర్) మెరిశారు. ఆఖరు ఓవర్ తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన జాన్సెన్.. సఫారీలను సెమీఫైనల్స్‌కు చేర్చాడు. వెస్టిండీస్ బౌలర్లలో స్పిన్నర్ రోస్టన్ ఛేజ్ (3/12), పేసర్లు రసెల్ (2/19), అల్జారీ జోసెఫ్ (2/25) రాణించారు.

ఒలింపిక్స్‌కు ఆర్చరీ జట్లు

మెన్స్, ఉమెన్స్ జట్లు అర్హత



న్యూఢిల్లీ : 2024 పారిస్ ఒలింపిక్స్‌కు భారత ఆర్చరీ మెన్స్, ఉమెన్స్ జట్లు అర్హత సాధించాయి. ప్రపంచ ఆర్చరీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన భారత్.. పారిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ ఐదు పతక విభాగాల్లో (మెన్, ఉమెన్ టీమ్, వ్యక్తిగత సహా మిక్స్‌డ్ టీమ్) పోటీపడనుంది. నాన్ క్వాలిఫయింగ్ జట్ల జాబితాలో భారత్ అగ్రస్థానంలో నిలువగా.. మెన్స్‌లో చైనా, ఉమెన్స్‌లో ఇండోనేషియా రెండో స్థానంతో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. 40 ఏండ్ల ఆర్మీ వెటరన్ తరుణ్‌దీప్ రాయ్, మాజీ వరల్డ్ నం.1 దీపిక కుమారి నాల్గోసారి ఒలింపిక్స్‌లో పోటీపడేందుకు సిద్ధమవుతున్నారు.

ఒలింపిక్స్‌కు భారత జట్లు : తరుణ్‌దీప్ రాయ్, ధీరజ్ బొమ్మదేవర, ప్రవీణ్ జాదవ్ (మెన్స్). దీపిక కుమారి, భాజన్ కౌర్, అంకిత (ఉమెన్స్)

హెచ్‌సీఏ ఓపెన్ సెలక్షన్స్

ఉమెన్స్ లీగ్ కోసం ప్రతిభాన్వేషణ



నవతెలంగాణ-హైదరాబాద్ : ఉమెన్స్ లీగ్ కోసం వర్థమాన మహిళా క్రికెటర్లను ఎంపిక చేసేందుకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఓపెన్ సెలక్షన్స్ నిర్వహించనుంది. ఈ మేరకు హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్. దేవరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29, 30న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉప్పల్ స్టేడియంలో సెలక్షన్స్ చేపట్టనున్నారు. ఆసక్తిగల క్రికెటర్లు హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి సూచించారు. గతంలో బీసీసీఐ, హెచ్‌సీఏ టోర్నమెంట్స్‌లో పోటీపడని క్రికెటర్లు మాత్రమే ఓపెన్ సెలక్షన్‌కు హాజరు కావాలని దేవరాజ్ తెలిపారు.

సెమీస్‌లో ఇంగ్లాండ్



డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్ టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌కు చేరుకుంది. సూపర్8లో సఫారీ చేతిలో ఓడిన బట్లర్‌సేన.. వెస్టిండీస్, అమెరికా (యుఎస్‌ఏ)పై ఘన విజయాలు సాధించింది. దక్షిణాఫ్రికా మూడు విజయాలతో సూపర్8 గ్రూప్-2లో అగ్రస్థానంలో నిలువగా.. ఇంగ్లాండ్ రెండో స్థానం దక్కించుకుంది. గ్రూప్-2 నుంచి సఫారీ, ఇంగ్లాండ్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఆతిథ్య జట్లు వెస్టిండీస్, అమెరికా ఇంటిముఖం పట్టాయి. సూపర్8 గ్రూప్-1లో అగ్ర స్థానంలో ఉన్న భారత్ సెమీ ఫైనల్లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది. దీంతో గురువారం ప్రావిడెన్స్‌లో 2022 టీ20 ప్రపంచకప్ సెమీఫైన ల్ పోరు రిపీట్ కానుంది!. గ్రూప్-1 లో రెండో స్థానంలో నిలిచే జట్టుతో దక్షిణాఫ్రికా సెమీస్‌లో పోటీపడనుంది.

బిజినెస్

భారత వృద్ధి 7శాతంలోపే..!

- ఎస్అండ్‌పి విశ్లేషణ
- ఆర్‌బిఐ అంచనాల కంటే తక్కువ
- అధిక వడ్డీ రేట్ల ప్రభావం

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ పెరుగుదల ఏడు శాతం దిగువకే



పరిమితం కానుందని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పి అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో భారత వృద్ధి 6.8 శాతంగా ఉండొచ్చని సోమవారం ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. అధిక వడ్డీ రేట్లు, వ్యవసాయేతర రంగాలలో మందగమనం డిమాండ్‌ను దెబ్బతీయనున్నాయని తెలిపింది. "భారత జిడిపి వృద్ధి పురోగమనం ఆశ్చర్యకరంగా కొనసాగుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 8.2 శాతం వృద్ధి నమోదయ్యింది. అధిక వడ్డీ రేట్లు, వ్యవసాయేతర రంగాలలో తక్కువ ఆర్థిక వృద్ధితో ఈ ఏడాది జిడిపి 6.8 శాతానికి పడిపోవచ్చని అంచనా వేస్తున్నాము" అని ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ ఆసియా పసిఫిక్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఆర్థిక సంవత్సరం 2025-26లో 6.9 శాతం, 2026-27లో 7 శాతంగా నమోదు కావొచ్చని ఎస్అండ్‌పి అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తన పాలసీ రేటును 6.5 శాతం నుండి 6 శాతానికి తగ్గించవచ్చని పేర్కొంది. 2025-26, 2026-27లో రుణ రేటును వరుసగా 5.5 శాతం మరియు 5.25 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయని విశ్లేషించింది. ఎస్అండ్‌పి వృద్ధి అంచనాలు ఆర్‌బిఐ కంటే తక్కువగా ఉన్నాయి. తాజా ద్రవ్య పరపతి విధాన సమీక్షలో, ఆర్‌బిఐ 2024-25కు గాను 7.2 శాతం వృద్ధిని అంచనా వేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉండొచ్చని తెలిపింది."ద్రవ్యోల్బణం, అధిక నిరుద్యోగం, సామాజిక, ఆర్థిక అసమానతలు వంటి దీర్ఘకాలిక సవాళ్లను ఎదుర్కోవడంలో.. అదే విధంగా కొత్త పొత్తులను ఏర్పరచడంలో బిజెపి ఎంత బాగా పని చేస్తుందో.. దాన్ని బట్టి వచ్చే ఐదేళ్లలో భారత వృద్ధి ఉండొచ్చని ఎస్అండ్‌పి పేర్కొంది.

కీర్తిలాల్ జ్యుయలర్స్ 'టీమ్ మార్క్స్ మెన్' అవార్డు



హైదరాబాద్ : ప్రముఖ అభరణాల విక్రయ రిటైల్ చెయిన్ కీర్తిలాల్ జ్యుయలర్స్‌కు 2024-25కు గాను అత్యంత ప్రాధాన్యతమైన పని ప్రదేశానికి గాను 'టీమ్ మార్క్స్ మెన్' అవార్డు దక్కిందని ఆ సంస్థ తెలిపింది. ఇటీవల డిల్లీలో జరిగిన కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు జయప్రద చేతుల మీదుగా కీర్తిలాల్స్ రిటైల్ సేల్స్ అండ్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ ముత్తుకుమార్ ఈ పురస్కారాన్ని అందుకున్నారని పేర్కొంది. పని ప్రదేశంలో పర్యావరణ వ్యవస్థ, సమానత్వం, రివార్డులు, సామాజిక సమన్వాయం తదితర అంశాల ఆధారంగా ఈ అవార్డును ఇస్తారని ఆ సంస్థ తెలిపింది.

బైజూస్‌లో రూ.4వేల కోట్లు హుష్..

- నిండా మునిగిన నెథర్లాండ్ కంపెనీ

బెంగళూరు : కరోనాకు ముందు ఓ వెలుగు వెలిగిన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌లో రూ.4వేల కోట్ల పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ప్రోసస్ ఎన్‌వి నిండా మునిగినట్లు ప్రకటించింది. 2018లోని తమ పెట్టుబడులు ఇప్పుడు సున్నా విలువకు పడిపోయినట్లు తెలిపింది. తాము బైజూస్‌లో పెట్టిన పెట్టుబడుల వాటాను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. బైజూస్ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, భవిష్యత్ అంచనాలకు సంబంధించి తమవద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆ సంస్థ విలువను తాము సున్నాకు తగ్గిస్తున్నట్లు ప్రోసస్ తెలిపింది. తద్వారా తమకు 493 మిలియన్ డాలర్లు (రూ.4వేల కోట్లు) మేర నష్టం వాటిల్లినట్లు ఆ కంపెనీ పేర్కొంది.

ఆర్థిక మోసాలపై అప్రమత్తం : హెచ్‌డీఎఫ్‌సీ

ముంబయి : మోసపూరిత వాట్సాప్ గ్రూప్‌లు, బ్యాంకు ప్రతినిధులుగా చేసే మోసాల పట్ల ఖాతాదారులు అప్రమప్తంగా ఉండాలని స్టాక్ బ్రోకింగ్ సంస్థ హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ హెచ్చరించింది. పెట్టుబడిదారులందరూ స్టాక్ మార్కెట్‌లో సూచనాత్మకమైన, హామీ ఇవ్వబడిన లేదా గ్యారెంటీడ్ రాబడిని అందిస్తుందనే ఏదైనా స్కీమ్ లేదా ప్రోడక్ట్‌లను సబ్‌స్రయిబ్ చేయకుండా ఉండాలని ఆ సంస్థ సిఇఒ సందీప్ భరద్వాజ్ పేర్కొన్నారు.

మంగళం గ్లోబల్ కు వంట నూనెల రిఫైనరీ

న్యూఢిల్లీ: మంగళం గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఇటీవల ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీ అండ్ ప్యాకేజింగ్ యూనిట్‌ను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. మంగళం గ్లోబల్ ఆముదం, మస్టర్డ్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్ తదితర ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేస్తుంది. కాగా.. గురుకృప నుండి ప్లాంట్ అండ్ మెషినరీ, భవనాలను కొనుగోలు చేయడానికి జూన్ 18న ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. రోజుకు 200 మెట్రిక్ టన్నులు చమురు ప్యాకింగ్, రోజుకు 20 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఆయిల్ సీడ్ క్రషింగ్ ప్లాంట్‌ను కలిగి ఉన్నట్లు పేర్కొంది.

నేటి నుంచి సూత్రా వస్త్ర ప్రదర్శన

హైదరాబాద్ : సూత్రా ఎగ్జిబిషన్ జూన్ 25 నుంచి 27వ తేది వరకు హైదరాబాద్‌లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. తాజ్‌క్రిష్ణాలో మూడు రోజుల పాటు ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని సూత్రా ఎగ్జిబిషన్ అధినేత ఉమేష్ వెల్లడించారు. సూత్రా ఎల్లప్పుడూ సంస్కృతి, సంప్రదాయతలు, ఆధునిక ఫ్యాషన్లు, రాయల్ సొగసులను ప్రతిబింబించు వస్త్ర సముదాయాలు ప్రదర్శిస్తుందన్నారు. దేశంలోని నలుమూలల నుంచి 85 మందికి పైగా డిజైనర్లు, నిపుణులైన కళాకారులు తమ వస్త్ర, అభరణాలన్నింటిని ఒకే వేదిక పైన సందర్శకులకు అందుబాటులో ఉంచుతారన్నారు.

ఒప్పో నుంచి ఎ3ప్రో

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో కొత్తగా తన ఒప్పో ఏ3 ప్రోను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. గత ఏప్రిల్‌లో చైనాలో ఈ ఫోన్‌ను ఆవిష్కరించింది. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్, 50-మెగా పిక్సెల్ డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ కలిగి ఉంది. 8జిబి ర్యామ్ విత్ 128జిబి స్టోరేజీ వేరియంట్ ధరను రూ.17,999గా, 8జిబి ర్యామ్, 256 జిబి స్టోరేజీ వేరియంట్ ధరను రూ.19,999గా నిర్ణయించింది. ఒప్పో ఏ3 ప్రో ఫోన్ 50 ఎంపి ప్రైమరీ సెన్సర్ కెమెరాతో పాటు డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ సహా సెల్ఫీ కోసం 8ఎంపి కెమెరాను అమర్చింది.

హీరో మోటో వాహనాలు ప్రియం



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ కంపెనీ హీరో మోటో కార్ప్ తన వాహన ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఎంపిక చేసిన మోటారు సైకిళు.., స్కూటర్లపై జులై 1 నుంచి పెంచిన ధరలు అమల్లోకి వస్తాయని సోమవారం ఆ సంస్థ వెల్లడించింది. మోటారు సైకిల్ లేదా స్కూటర్‌పై గరిష్ఠంగా రూ.1,500 వరకు పెంచుతున్నట్లు వెల్లడించింది. ముడి సరుకుల వ్యయాలు పెరగడంతో పెంపు అనివార్యమయ్యిందని హీరో మోటో తెలిపింది. హీరో మోటో 2023లో 5.08 లక్షల యూనిట్లు అమ్మకాలు చేయగా.. 18,673 యూనిట్లను ఎగుమతి చేసింది.

మహిళల భద్రత , సాధికారతే లక్ష్యం

- బీబీజీ గ్రూపు ఛైర్మన్ మల్లికార్జున్ రెడ్డి

హైదరాబాద్ : మహిళల భద్రత, సాధికారతే లక్ష్యంగా శంషాబాద్‌లో భరోసా కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ (బిబిజి) ఛైర్మన్ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు.. బాలికలు, మహిళల కోసం సురక్షితమైన కమ్యూనిటీలను రూపొందించడంతో బిబిజి నిబద్ధతకు నిదర్శనమని మల్లికార్జున్ రెడ్డి అన్నారు.

మహిళలు, పిల్లలకు అవసరమైన నమ్మకాన్ని, మద్దతును పెంపొందించడంలో ఒక ముఖ్యమైన మైలురాయి అన్నారు. హింస, లైంగిక వేధింపుల బారిన పడిన మహిళలు, పిల్లలకు తిరిగి చక్కటి పరిష్కారాన్ని అందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ 449వ టాలెంట్ ఫ్యాక్టరీ కార్యక్రమానికి తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్ మహిళా, శిశు భద్రతా విభాగానికి చెందిన డిసిపి సృజన కర్ణం హాజరయ్యారు

సహజ మరణానికీ రూ. 15 లక్షలు ఇన్సూరెన్స్ ఇప్పించండి

- యాజమాన్యానికి టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీలో కార్మికులు, ఉద్యోగుల సహజ మరణానికి కూడా రూ.15 లక్షలు ఇన్సూరెన్స్ వచ్చేలా చర్యలు చేపట్టాలని టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) కోరింది.

ఈ మేరకు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఏ, ఎమ్, పీ అండ్ ఏఎమ్)కు ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సోమవారం వినతిపత్రం సమర్పించింది. ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు ఆ వివరాలు వెల్లడించారు. టీజీఎస్‌ఆర్టీసీలో సర్వీస్‌లో ఉండి, ఏ కారణంతో అయినా జరిగే సహజ మరణానికి కూడా కనీసం రూ.15 లక్షలు ఆ కుటుంబానికి అందేలా యూనియన్‌బ్యాంక్‌తో సంప్రదింపులు జరిపాలని కోరారు. యూనియన్‌బ్యాంక్‌లో సూపర్ సేలరీ అక్కౌంటు కలిగి, ప్రమాదంలో మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.1 కోటి 15 లక్షలు ఇన్సూరెన్స్ ద్వారా చెల్లిస్తున్నారనీ, ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబానికి అది బాగా సహాయపడుతుందని చెప్పారు. అదే తరహాలో సహజ మరణం పొందిన కార్మికుని కుటుంబానికి కూడా రూ.15 లక్షలు ఇన్సూరెన్స్ వచ్చేలా స్కీం రూపొందించాలని కోరారు.

కార్మికుడు / ఉద్యోగి నుంచి నెలవారీగా వంద రూపాయలు రికవరీ చేసుకొని, కనీస మొత్తం రూ.15 లక్షల ఇన్సూరెన్స్ వచ్చేలా యూనియన్ బ్యాంక్‌తో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ స్కీంను ప్రారంభించే క్రమంలో ప్రీమియం నెలకు వంద రూపాయలు మాత్రమే ప్రీమియం వుండేలా చూడాలనీ, ఐదేండ్ల తర్వాతే దీనిపై సమీక్ష చేసేలా నిబంధన ఉండాలని సూచించారు. ఇన్సూరెన్స్ చెల్లింపునకూ, హాజరుకు ఎటువంటి సంబంధం లేకుండా చూడాలని కోరారు.

నీట్‌పై పార్లమెంటులో చర్చించాలి : బోయినపల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ పరీక్షకు సంబంధించిన అవకతవకలపై పార్లమెంటులో చర్చించాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నీట్ నుంచి మన రాష్ట్రం బయటకు రావాలని సూచించారు. ఆ పరీక్షలో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరిగిన నేపథ్యంలో సీఎం రేవంత్ చొరవ తీసుకుని సుప్రీంకోర్టులో న్యాయవాదిని నియమించాలని కోరారు. తద్వారా విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నీట్‌ను మళ్లీ నిర్వహించాలని 27న పార్లమెంటు ముట్టడి

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ రాతపరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న ఢిల్లీలో పార్లమెంటు ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి చెప్పారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ నీట్ విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. మతాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్దిపొందాలని చూస్తున్నదని అన్నారు. తెలంగాణ నుంచి ఈనెల 27న జరిగే పార్లమెంటు ముట్టడి కార్యక్రమానికి భారీగా విద్యార్థులను తరలిస్తామని చెప్పారు. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురిచేసి విద్యావ్యవస్థను నాశనం చేసిన బీజేపీని గద్దెదించాలని అన్నారు. దేశంలో నీట్ రాసిన 24 లక్షల మంది విద్యార్థులు కేంద్రంపై తిరగబడాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎన్టీఏను రద్దు చేయాలి : సురభి ద్వివేది

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను రద్దు చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జీ సురభి ద్వివేది కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ జరిగిందని తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. న్యాయం చేయాలంటూ విద్యార్థులు కోరుతుంటే పోలీసులు లాఠీచార్జీ చేస్తున్నారని అన్నారు. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ప్రధాని మోడీకి డిగ్రీ లేనందునే విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పార్లమెంటు ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యార్థులంతా ఢిల్లీ చేరుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు.

సహజ వనరులను లూటీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

- మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వాసుదేవరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాష్ట్రంలోని సహజ వనరులను లూటీ చేస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వాసుదేవరెడ్డి విమర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు అండతో మంథని నియోజకవర్గంలో ఇసుక, మట్టి మాఫియా చెలరేగి పోతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ నేతలు ఇసుకను యధేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. మైనింగ్ ప్రమాణాలు పాటించకుండా వారు మట్టిని తరలిస్తున్నారని చెప్పారు. ఒక లారీకి పర్మిషన్ ఉంటే వంద లారీల్లో మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన డబ్బు శ్రీధర్‌బాబు కుటుంబ సభ్యుల జేబుల్లోకి వెళుతోందని పేర్కొన్నారు. ఎన్నికలప్పుడు ఇసుక మాఫియా గురించి నీతులు చెప్పిన శ్రీధర్‌బాబు అదే దందాకు ఇప్పుడు తెరతీశారని విమర్శించారు. జిల్లా అధికారులకు ఈ దందాల గురించి చెప్పినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల రాష్ట్ర స్థాయిలోని ఉన్నతాధికారులైనా ఈ అంశాన్ని పట్టించుకోవాలనీ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.